www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI


గామన్ బ్రిడ్జిపై కుంగిన ప్రాంతం ఇదే.

మళ్లీ కుంగిన గామన్ బ్రిడ్జి
9 సంవత్సరాల్లో ఇది రెండోసారి
52వ స్తంభం వద్ద మరమ్మతులు
విజయవాడ-వైజాగ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ట్రాఫిక్ ఇక్కట్లు
3

సోమవారం | 25-3-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 340 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 12.31 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తర ఉ. 10.39 తదుపరి హస్త; వర్జ్యం: రా. 8.03-9.51; దుర్ముహూర్తం: మ. 12.46-1.34, మ. 3.11-3.59; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ.7.30-9.00 వరకు; సూర్యోదయం: 6.19; సూర్యాస్తమయం: 6.24
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కోడ్ ముందు క్లియరెన్స్ సేల్

అస్మదీయుడికి.. అదిరేటి ఆఫర్

కాకినాడ వైసీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కుటుంబ కంపెనీకి భారీ భూసంతర్పణ

అదీ ఎకరం జస్ట్ 5 లక్షలకే

కోడ్ ముందు రోజు 1,985 ఎకరాలు



ఐదేళ్లలో గ్రీన్‌కోకు 7,047 ఎకరాలు
అందులో 1,985 ఎకరాలకు కోడ్‌కు ఒక్కరోజు ముందు జీవోలు
మిగతా కంపెనీలకు భూములు లీజుకు
గ్రీన్‌కోకు మాత్రం అమ్మేయడమే
టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన భూమే ఇంకా వినియోగంలోకి రాని వైనం
ఆరేళ్లవుతున్నా కాంక్రీటు పనులూ కాలేదు
అయినా వేల ఎకరాలు దోచిపెట్టిన సర్కార్
సీఎం స్పెషల్ సెక్రటరీ దువ్వూరి కృష్ణకు గతంలో గ్రీన్‌కోతో అనుబంధం
కంపెనీకి వెన్నెముకగా ఓ ఐఏఎస్

- భూతద్దంతో రాష్ట్రం మొత్తం వెతికినా ఎకరం భూమి రూ.5 లక్షలకు దొరకడం చాలా కష్టం. అలాంటిది.. జగన్ సర్కార్ పదో, పాతికో కాదు ఐదేళ్లలో ఏకంగా 7047.86 ఎకరాల భూములను ఎకరం రూ.5 లక్షల చొప్పున అమ్మేసింది. అది కూడా గ్రీన్‌కో అనే ఒక్క కంపెనీకే ఈ భూములన్నీ కట్టబెట్టేసింది.
- గ్రీన్‌కోకు సంతర్పణ చేసిన 7047.86 ఎకరాల్లో 1985 ఎకరాలను ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందు అంటే.. ఈ నెల 15వ తేదీన అమ్మేసినట్టుగా 2 జీవోలు ఇచ్చారు. కేబినెట్ షార్ట్ సర్క్యులేషన్ ద్వారా ఈ ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తీసుకున్నారు. గ్రీన్‌కో కంపెనీపై జగన్‌కు ఎందుకింత ప్రేమ అనే సందేహం ఎవరికైనా రావచ్చు. ఇక్కడే అసలు విషయం దాగుంది.
- కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్ కుటుంబానిదే గ్రీన్‌కో కంపెనీ. ఆ కంపెనీ కోరుకున్నంత భూమిని, కోరుకున్నచోట కాదనకుండా ఈ ఐదేళ్లలో జగన్ సర్కార్ అమ్మేసింది. అది కూడా నామమాత్రపు ధరకే.

నిన్న ఇండోసోల్ నేడు గ్రీన్‌కో గుట్టురట్టు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు అస్మదీయ కంపెనీలకు అడ్డగోలుగా భూములు దోచిపెడుతోంది. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, పులివెందులవాసి విశ్వేశ్వరరెడ్డికి చెందిన ఇండోసోల్‌కు వేలాది ఎకరాలు ధారాదత్తం చేయగా.. తాజాగా మరో భూబాగోతం వెలుగులోకి వచ్చింది. ఇండోసోల్‌కు నామమాత్రపు ధరకు భూములు లీజు కిస్తే.. గ్రీన్‌కో కంపెనీకి చౌకధరకే వేలాది ఎకరాలు అమ్మేసింది. గ్రీన్‌కోకు జగన్ సర్కార్ అతి తక్కువ ధరకు ఎందుకు అమ్ముతోందంటే.. ఈ కంపెనీ వైసీపీ నాయకుడు చలమలశెట్టి సునీల్ కుటుంబానికి చెందినది కావడమే. అంతేగాక మరో కారణం కూడా ఉంది. ప్రస్తుతం సీఎం జగన్ స్పెషల్ సెక్రటరీగా ఉన్న దువ్వూరి కృష్ణ.. 2019 మే ఆఖరు వరకు గ్రీన్‌కో కంపెనీలో ఉన్నతస్థాయిలో పనిచేశారు. జగన్ సీఎం కాగానే, కృష్ణ నేరుగా గ్రీన్‌కో నుంచి సీఎం కార్యాలయానికి

మిగతా 12వ పేజీలో...



రఘురామరాజుకు నిరాశే!

నరసాపురం బీజేపీ అభ్యర్థిగా శ్రీనివాసవర్మ
రాజమండ్రిలో పురందేశ్వరి, అనకాపల్లి నుంచి సీఎం రమేశ్
అరకు-గీత, రాజంపేట-కిరణ్
తిరుపతి లోక్‌సభ బరిలో వరప్రసాద్
నేడు అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన
11

తిరుపతిలో ఆరణి శ్రీనివాసులే

మరో 11 స్థానాలకు సేన అభ్యర్థుల ప్రకటన
రాజోలులో మాజీ ఐఏఎస్ వరప్రసాద్, పి.గన్నవరంలో సత్యనారాయణ
ఇక పాలకొండ, అవనిగడ్డ, విశాఖ దక్షిణ పెండింగ్
11

వైసీపీకి మరో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు గుడ్‌బై

వరప్రసాద్ బీజేపీలో చేరిక.. కాంగ్రెస్‌లోకి ఎలీజా
ఇప్పటికే ముగ్గురు ఎస్సీ సభ్యుల రాజీనామా
11



వయా కవిత.. టార్గెట్ కేజ్రీ

ఢిల్లీ సీఎంకు ఉచ్చు బిగించే దిశగా దర్యాప్తు
కవితపై రోజంతా ప్రశ్నల వర్షం
వాంగ్మూలాలు కవిత ముందు ఉంచి ప్రశ్నలు
లిక్కర్ స్కాంలో మేక శరణ్ పాత్రపై ఆరా
ఎనిమిదో రోజుకు చేరిన కవిత విచారణ
నిజామాబాద్‌లో ఈడీ దర్యాప్తు?

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

ప్రజల తాగునీటి వెతలు తీర్చాలని మంత్రి ఆతిషికి ఆదేశాలు
ఘటనపై ఈడీ సీరియస్
కేజ్రీవాల్‌ను 6 గంటలపాటు ప్రశ్నించిన అధికారులు
నిబంధనల ప్రకారం జైలు నుంచి పాలన కష్టమే
కేజ్రీ సతీమణి సునీతకు సీఎం పగ్గాలంటూ ఊహాగానాలు

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు మరింత పెంచింది. ఈ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ప్రధాన కుట్రదారుగా నిరూపించేందుకు కావాల్సిన అన్నిరకాల ఆధారాల సేకరణకు కార్యాచరణను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మద్యం పాలసీ రూపకల్పన, ముడుపుల వ్యవహారంలో కేజ్రీవాల్‌కు ఉచ్చు బిగించేందుకుగాను తమ అదుపులో ఉన్న ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు ఈ మేరకు ఆదివారం రోజంతా సుదీర్ఘంగా విచారించినట్లు తెలిసింది. ఎనిమిదో రోజు విచారణలో భాగంగా.. మద్యం విధానంలో లబ్ధి పొందినవారి నుంచి కేజ్రీవాల్ నేరుగా ముడుపులు స్వీకరించిన అంశంపై ఆమెను గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు సమాచారం. రూ.100 కోట్ల ముడుపుల చెల్లింపు విషయంలో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా.. సౌత్ గ్రూప్

మిగతా 2వ పేజీలో...

31న ఇండియా కూటమి మహార్యాలీ

కేజ్రీ అరెస్టుపై సంఘటిత ఉద్యమం.. రాంలీలా మైదానంలో భారీ సభ
మద్యం కేసులో అరెస్టైన శరత్‌రెడ్డి బీజేపీకి 60 కోట్లిచ్చి విడుదలయ్యారు
కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చారు.. ఢిల్లీ మంత్రి గోపాల్ ఆరోపణలు
ఆప్, కాంగ్రెస్, సీపీఎం సంయుక్త మీడియా సమావేశం
2



లోక్‌సభ బరిలో కంగన రనౌత్

హిమాచల్ నుంచి పోటీకి సినీనటి
మేనకకు టికెట్, వరుణ్‌కు మొండిచేయి
111 మందితో బీజేపీ 5వ జాబితా
2

బకాయిలపై బుకాయింపు!


నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సింది 1,400 కోట్లు
ఆరోగ్యశ్రీ ఉస్తు విడుదల చేసిన నిధులు 180 కోట్లు
నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాల గగ్గోలు
రెండు రోజుల్లో మరో 700 కోట్ల విడుదలకు డిమాండ్
12

జగన్ పత్రికపై 20 కోట్లకు దావా!

పరువు నష్టం నోటీసు పంపిన బీజేపీ చీఫ్ పురందేశ్వరి
11

భారత్‌తో మళ్లీ వాణిజ్యం

సంబంధాల పునరుద్ధరణను తీవ్రంగా పరిశీలిస్తున్నాం: పాక్
2



టీడీపీ గెలుపు.. మాదిగల గెలుపు

పార్టీతో మాదిగలది శాశ్వత బంధం
మంద‌కృష్ణ మాదిగతో భేటీలో చంద్రబాబు
ఎన్డీయేకు మద్దతు ప్రకటించిన ఎంఆర్‌పీఎస్

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గెలిస్తే, మాదిగలు గెలిచినట్లేనని, టీడీపీతో మాదిగలది శాశ్వత బంధమని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఆదివారం ఉండవల్లిలో చంద్రబాబుతో ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ భేటీ అయ్యారు. చంద్రబాబుకు పలు అంశాలతో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మాదిగ వర్గ ప్రజల అభ్యున్నతికి మొదటి నుంచి పనిచేసిన పార్టీ

మిగతా 11వ పేజీలో...

అభివృద్ధి వైపు టీడీపీ.. డ్రగ్స్ వైపు వైసీపీ



ఏది కావాలో ప్రజలే విజ్ఞత చూపాలి
2020లోనే గ్యాంబ్లింగ్‌ను చట్టబద్ధం చేసే కుట్ర
వైసీపీకి మళ్లీ అధికారమిస్తే ఇవే దారుణాలు
'ఓట్ నాట్ ఫర్ సేల్' నినాదంతో ముందుకు రండి
ప్రజలకు లోకేశ్ విజ్ఞప్తి.. మంగళగిరిలో ప్రచారం
కాన్వాయ్‌ను పదేపదే తనిఖీ చేసిన పోలీసులు
11

గనుల శాఖలో ఘనుడు!

గనుల శాఖలో ఆయన పేరు వింటే ఆనందపడిపోతారు. గనుల శాఖ, దాని పరిధిలోని ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)లో ఉన్న కీలక అధికారులు ఆయన సేవలో తరించిపోతుంటారు. కొందరు ఆయనంటే భయపడిపోతుంటారు. మాట వింటే కానుకలు. వినకపోతే ముఖ్య అధికారి కార్యాలయం నుంచి ఫోన్‌లో బెదిరింపులు. అయినా దారికి రాకపోతే ఏకంగా సీఎంవో నుంచి ఫోన్‌లు. ఇంతటి శక్తివంతుడు ఓ ప్రైవేటు మైనింగ్ కంపెనీలో ఉద్యోగి!

ఎండీసీని శాసిస్తున్న లాబీయిస్ట్

చాలా ఏళ్లుగా చక్రం తిప్పుతున్న ప్రైవేటు ఉద్యోగి
బెరైటీస్, క్వార్ట్జ్, ఇతర ఖనిజాలపై కన్ను
మార్కెటింగ్ విభాగం అడ్డాగా వ్యవహారాలు
లీజులు, బిల్లులు, టెండర్లు.. సర్వం ఆయనే
ఓ కంపెనీకి '100 ఎకరాల' ప్లాన్ ఆయనదే
గనుల నుంచి రెవెన్యూ వరకు లాబీయింగ్
మాట వినని వారిపై సీఎంవో నుంచి ఫోన్లు
ముఖ్య అధికారితో లాబీయిస్టు చెట్టపట్టాల్
చిన్న కంపెనీలను ప్రోత్సహించవద్దని హుకుం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వేలకోట్ల రూపాయల ఖనిజ వ్యాపారం చేస్తున్న ఏపీఎండీసీని కనుసైగలతో ఓ లాబీయిస్టు శాసిస్తున్నారు. నోటిమాటలతో ఆదేశాలు ఇప్పిస్తున్నారు. కార్పొరేట్ లాబీయింగ్‌తో ఎండీసీలోనే శాశ్వత మకాం వేశారు. ఎండీసీలోని మార్కెటింగ్ విభాగం అడ్డాగా ఆయన ఆఫీసును తన గుప్పిట్లో పెట్టుకున్నారు. కార్పొరేట్ లాబీయిస్ట్‌గా మారి చిన్న కంపెనీలను చిదిమేస్తున్నారు. ఎండీసీ సైతం ఆయా చిన్న కంపెనీలను ప్రోత్సహించకుండా పాలసీ తీసుకురావాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇటు కార్పొరేట్ కంపెనీలు, అటు గనుల అధికారులను ఆనందపరిచే ఆయన ఓ కంపెనీలో ఉద్యోగి. అనేక ఏళ్లుగా అటు గనుల శాఖ, ఇటు ఎండీసీ కేంద్రంగా ఆయన లాబీయింగ్ చేస్తున్నారు. తమిళనాడు కేంద్రంగా పనిచేసే తన కంపెనీకి బెరైటీస్, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల టెండర్లు దక్కించుకోవడం ఒక ఎత్తయితే, మరో మూడు కంపెనీల తరఫున కూడా లాబీయింగ్ చేస్తున్నారు. ఇది ఎండీసీలో

మిగతా 6వ పేజీలో...



పెద్దలకు టీబీ వ్యాక్సిన్!

మానవుల నుంచి సేకరించిన క్షయ బ్యాక్టీరియాతో తొలిసారి తయారుచేసిన స్పానిష్ కంపెనీ బయోఫ్యాబ్రీ
ఆ సంస్థతో కలిసి ట్రయల్స్ చేపట్టిన భారత్ బయోటెక్
ప్రపంచంలోనే తొలి లైవ్ ఎటెన్యుయేటెడ్ టీబీ వ్యాక్సిన్
ప్రస్తుతానికి సేఫ్టీ ట్రయల్స్.. వచ్చే ఏడాది ఎఫికసీ ట్రయల్స్
2

'శివ శక్తి' ఇక అధికారికం

జాబిల్లిపై విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి మోదీ నామకరణం
అధికారికంగా ఆమోదించిన అంతర్జాతీయ ఖగోళ సంఘం



బెంగళూరు, మార్చి 24: చంద్రయాన్-3 జాబిల్లిపై దిగి చరిత్ర సృష్టించింది. ఈ విజయానికి గుర్తుగా విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశాన్ని 'శివ శక్తి'గా పిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది ఆగస్టు 23న ప్రకటించారు. దాదాపు 7 నెలల తర్వాత

మిగతా 2వ పేజీలో...



బీజేపీలో చేరిన వాయుసేన మాజీ చీఫ్ బదౌరియా
2



ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్

మంటలు చెలరేగి నలుగురు చిన్నారుల దుర్మరణం
ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో విషాదం



ఇదేదో తేడాగా ఉందే!

రాష్ట్ర అధికారుల తీరుపై ఈసీ విస్మయం

అధికార పక్షం అక్రమాలపై కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు
అడిగితే అంతా బాగుందంటున్న కొందరు కలెక్టర్లు, ఎస్పీలు
పొంతనలేని సమాచారంపై అనుమానం
వారి పుట్టుపూర్వోత్తరాలపై కమిషన్ ఆరా
కొందరిపై అంతర్గతంగా విచారణ
వారం తర్వాత వరుసపెట్టి వేటు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో అసలేం జరుగుతోంది..? పాలక పక్షమైన వైసీపీ అక్రమాలపై ఫిర్యాదులేమో కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి.. ఏమడిగినా అంతా బాగుందని కొందరు కలెక్టర్లు, ఎస్పీలు అధికారిక నివేదికలు పంపిస్తున్నారు. ఇదేదో తేడాగానే ఉందని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) అనుమానిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. అర డజను మంది కలెక్టర్లు, అంతకంటే ఎక్కువ సంఖ్యలో ఎస్పీల వ్యవహార శైలిపై కన్నేసింది. ముఖ్యమంత్రి జగన్ తన పార్టీ అభ్యర్థుల ఎంపికకు ముందే ఎక్కడ ఏ అధికారి ఉండాలో నిర్ణయించుకున్నారు. ఆ ప్రకారమే జిల్లాల్లో తన మనుషులనుకున్నవారిని, చెప్పినట్లు నడుచుకునే వారిని కలెక్టర్లు, ఎస్పీలుగా మోహరింపజేశారు. వారే ఇప్పుడు

మిగతా 12వ పేజీలో...

వాట్సా్‌ప్‌కు ఏఐ హంగు

ఇమేజ్ ఎడిటింగ్, 'ఆస్క్ మెటా' ఫీచర్లు.. త్వరలో అందుబాటులోకి!



కుజగ్రహం మీద కార్ రేస్ జరుగుతున్నట్టు ఫొటో రూపొందించాలని అడిగితే ఏఐ ఇచ్చిన బొమ్మ

న్యూఢిల్లీ, మార్చి 24: ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్న వాట్సాప్.. తాజాగా ఏఐ హంగులు కూడా సమకూర్చుకునే పనిలో పడింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ టూల్‌ను, మనకు వచ్చే రకరకాల సందేహాలకు సమాధానం ఇచ్చే 'ఆస్క్ మెటా' ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు వాట్సాప్ బేటాఇన్ఫో ప్రకటించింది. ప్రస్తుతానికి ఏఐ ఆధారిత ఇమేజ్ ఎడిటింగ్ కోసం మనం క్రోమ్, బింగ్ లాంటి బ్రౌజర్లనే వాడాల్సి వస్తోంది. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వస్తే.. వాట్సాప్‌లోనే ఏఐ సాయంతో మన చిత్రాలను ఎడిట్ చేసుకోవచ్చు. వాటి నేపథ్యాలను మార్చుకోవచ్చు. అలాగే.. ఇప్పుడు మనకు ఏదైనా సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్ చేసి చూసుకుంటాం కదా! అలా.. వాట్సాప్‌లో ఆస్క్ మెటా అందుబాటులోకి వస్తే మన సందేహాలన్నింటినీ అక్కడే తీర్చుకోవచ్చు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ ఫీచర్లను త్వరలోనే తొలుత బీటా వర్షన్ వాడేవారికి, తర్వాత అందరికీ అందుబాటులోకి తేనున్నట్టు సమాచారం.

'శివ శక్తి' ఇక అధికారికం

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ఖగోళ సంఘం (ఐఏయూ) ఈ నెల 19న ఆ పేరును అధికారికంగా ఆమోదించింది. ఐఏయూ ఆమోదించిన గ్రహాల పేర్లు, వాటి వివరాల గురించి సమగ్రమైన సమాచారాన్ని అందించే 'గెజిటరీ ఆఫ్ ప్లానెటరీ నోమెన్‌క్లేచర్'.. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివ శక్తి' అనే పేరును ఐఏయూ వర్కింగ్ గ్రూప్ ఫర్ ప్లానెటరీ సిస్టమ్ ఖరారు చేసిందని పేర్కొంది. దీంతో ఇస్రో విజయానికి గుర్తుగా 'శివ శక్తి' పేరు అధికారికంగా ఖరారైనట్టయింది. 'ప్రకృతి పురుషుడు (శివుడు), స్త్రీ (శక్తి) అర్థాలను వర్ణించే భారతీయ పురాణాల నుంచి సేకరించిన పదమే 'శివ శక్తి' అని గెజిటరీ ఆఫ్ ప్లానెటరీ నోమెన్‌క్లేచర్ వివరించింది. కాగా, అంతరిక్షంలో భారత ఆధిపత్యం కేవలం చంద్రయాన్-3కే పరిమితం కాలేదని, ఖగోళ శాస్త్రవేత్తలు 'శివ', 'శక్తి' అనే పేర్లతో పాలపుంతలోని రెండు పురాతన నక్షత్రాల సమూహాలను గుర్తించారని పలువురు కీర్తిస్తున్నారు.

లోకం తీరు



లోక్‌సభ బరిలో కంగన

- హిమాచల్ నుంచి పోటీ..111 మందితో బీజేపీ 5వ జాబితా
- 'సందేశ్‌ఖాళీ' బాధితురాలు రేఖాపాత్రకు బసీర్‌హాట్ సీటు



న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తన అభ్యర్థుల ఐదో జాబితాను ఆదివారం ప్రకటించింది. 18 రాష్ట్రాలకు చెందిన 111 మందికి ఈ జాబితాలో చోటు లభించింది. కాగా బీజేపీలో ఆదివారమే చేరిన కాంగ్రెస్ మాజీ నేత, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్‌కు టికెట్ దక్కటం విశేషం. హరియాణాలోని కురుక్షేత్ర నుంచి ఆయన బరిలో ఉండనున్నారు. సినీనటి కంగనా రౌనత్‌కు బీజేపీ తొలిసారిగా అవకాశం ఇచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ నుంచి కంగన.. ఎన్నికల రాజకీయాల్లో అరంగేట్రం చేయనున్నారు. రామాయణ్ సీరియల్‌లో రాముడి పాత్ర పోషించిన అరుణ్ గోవిల్‌కు మీరట్ సీటు కేటాయించారు. పశ్చిమ బెంగాల్ సందేశ్‌ఖాళీ ఘటన బాధితురాలైన రేఖాపాత్రకు బసీర్‌హాట్ నియోజకవర్గం నుంచి, అదే రాష్ట్రంలో మమత ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులిచ్చిన కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయకు తమ్లుక్ నియోజకవర్గం నుంచి అవకాశం ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ నుంచి కేంద్ర మాజీ మంత్రి మేనకాగాంధీకి తిరిగి అవకాశం కల్పించినప్పటికీ.. ఆమె కుమారుడు వరుణ్‌గాంధీకి మొండిచేయి చూపారు. వరుణ్ గాంధీ సిటింగ్‌స్థానం ఫిలిబిట్‌ను.. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన జితేంద్ర ప్రసాదకు కేటాయించారు. సైనికదళాల మాజీ ప్రధానాధిపతి జనరల్ వీకే సింగ్‌కు ఆయన సిటింగ్ స్థానమైన ఘజియాబాద్‌లో సీటు నిరాకరించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఒడిశాలోని సంబల్‌పూర్ నుంచి, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రకు పూరీ నుంచి, జార్ఖండ్‌లో జేఎంఎం ఎమ్మెల్యే, మాజీ సీఎం హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్‌కు దుంకా నుంచి, కర్ణాటక మాజీ సీఎం జగదీశ్ షెట్టర్‌కు బెల్గాం నుంచి, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు డార్జిలింగ్ నుంచి, కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ కు పాట్నా నుంచి అవకాశం ఇచ్చారు.

బీజేపీలోకి ఎయిర్‌ఫోర్స్ మాజీ చీఫ్ బదౌరియా



న్యూఢిల్లీ, మార్చి 24: భారత వాయుసేన మాజీ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ బదౌరియా ఆదివారం బీజేపీలో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బదౌరియా వాయుసేన నుంచి చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ హోదాలో 2021లో పదవీ విరమణ పొందారు.

ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్

- మంటలు చెలరేగి యూపీలో నలుగురు చిన్నారుల మృతి

మీరట్, మార్చి 24: ఇంట్లో ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిన్నారులు మృతి చెందారు. ఉత్తర్‌ప్రదేశ్ మీరట్‌లోని పల్లవపురంలో ఈ విషాద ఘటన జరిగింది. మృతులను సారిక (10), నిహారిక (8), సంస్కార్ (6), కాలూ (4)గా పోలీసులు గుర్తించారు. ఇంట్లో ఫోన్ చార్జింగ్ అవుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని, మంటలు దుప్పటికి అంటుకుని ఒక్కసారిగా వ్యాపించడంతో ఈ దుర్ఘటన జరిగిందని మృతి చెందిన చిన్నారుల తండ్రి జానీ తెలిపారు. ఈ ప్రమాదంలో జానీ త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆయన భార్య బబిత తీవ్రంగా గాయపడి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వితంతువులు మళ్లీ పెళ్లి చేసుకుంటే 2 లక్షలు

- ప్రోత్సాహకం ప్రకటించిన ఝార్ఖండ్ సర్కారు

రాంచీ, మార్చి 24: వితంతువుల గౌరవ ప్రతిష్ఠలు, జీవన ప్రమాణాలను పెంచేందుకు ఝార్ఖండ్ ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రారంభించింది. దీని ప్రకారం పునర్వివాహం చేసుకున్న వితంతువులకు రూ.2 లక్షలు ప్రోత్సాహకంగా ఇవ్వనుంది. వితంతు పునర్వివాహ ప్రోత్సాహక పథకం కింద ఈ ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి మనోజ్ కుమార్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఆయన వివరించారు.

కృష్ణగిరిలో వీరప్పన్ కుమార్తె పోటీ

చెన్నై, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కుమార్తె విద్యారాణి వీరప్పన్ తమిళనాడులోని కృష్ణగిరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేయనున్నారు. ఆమెకు సినీ దర్శకుడు నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) కన్వీనర్ సీమాన్ కృష్ణగిరి సీటు కేటాయించారు. నాలుగేళ్ల క్రితం విద్యారాణి బీజేపీలో చేరినప్పటికీ ఆమెకు ఎలాంటి పార్టీ పదవులు ఇవ్వలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. దీనితో ఆమె బీజేపీకి రాజీనామా చేసి, ఎన్‌టీకే పార్టీలో చేరారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌టీకే పార్టీ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలతో పాటు పుదుచ్చేరిలోని లోక్‌సభ స్థానం నుంచి కూడా పోటీ చేస్తోంది. చెన్నైలో జరిగిన సభలో సీమాన్ 40 మంది అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేశారు. వీరిలో 20 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు.

అల్-షిఫా ఆస్పత్రిలో 170 మంది హతం

సెంట్రల్ గాజా, మార్చి 24: గాజాలోని అతిపెద్ద ఆస్పత్రిగా ఓ వెలుగువెలిగిన అల్-షిఫా ఆస్పత్రిలో నక్కిన 170 మంది హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) ఆదివారం ప్రకటించింది. ఈ నెల 18న అల్-షిఫాలో 350 మంది ఉగ్రవాదులు తలదాచుకున్నట్లు సమాచారం రావడంతో.. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపింది. 170 మంది అంతమొందించగా.. మరికొందరిని సజీవంగా పట్టుకున్నట్లు పేర్కొంది. కాగా.. గాజాలో ఇజ్రాయెల్ భూతల దాడులు ప్రారంభమైన తొలినాళ్లలోనే అల్-షిఫా ఆస్పత్రిని ఐడీఎఫ్ టార్గెట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దాడుల్లో ఆస్పత్రిలో చాలా భాగం ధ్వంసమవ్వగా.. అప్పట్లో అక్కడి రోగులను ఖాన్‌యూనిస్‌కు తరలించారు. అప్పట్లో ఇదే ఆస్పత్రిలో హమాస్ భారీ టన్నెల్స్‌ను ఐడీఎఫ్ గుర్తించింది.

కర్ణాటకకు ఇవ్వాల్సిన ప్రతి పైసా ఇచ్చేశాం!

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

బెంగళూరు, మార్చి 24: 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు ప్రత్యేక గ్రాంట్లలో తమ వాటాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని కర్ణాటక ప్రభుత్వం చేసిన ఆరోపణను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ఆర్థిక సంఘం అటువంటి సిఫారసులేమీ చేయలేదన్నారు. 'కర్ణాటకకు రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటును విడుదల చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆరోపణ పూర్తిగా అవాస్తవం' అన్నారు. తీవ్ర కరువుతో అల్లాడుతున్న తమ రాష్ట్రానికి ఎన్‌డీఆర్‌ఎఫ్(జాతీయ విపత్తుల స్పందన నిధి) నుంచి తక్షణమే నిధులు విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కర్ణాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తర్వాతి రోజే నిర్మలా సీతారామన్ ఈ విధంగా స్పందించడం గమనార్హం. 'కర్ణాటకకు ఇవ్వాల్సిన ప్రతి పైసాను సకాలంలోనే ఇచ్చేశాం' అని నిర్మలా సీతారామన్ తెలిపారు.

జైలు నుంచే కేజ్రీవాల్ పాలన

- ప్రజల తాగునీటి వెతలు తీర్చాలంటూ మంత్రి ఆతిషికి ఆదేశాలు
- కేజ్రీవాల్ సతీమణి సునీతకు సీఎం పగ్గాలంటూ ఊహాగానాలు

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తనను జైలులో పెడితే అక్కడి నుంచే సర్కారును నడిపిస్తానని చెప్పినట్టుగానే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్.. జైలు నుంచే తొలి ఆదేశాలను జారీ చేశారు. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, వేసవి దృష్ట్యా ఈ సమస్య మరింత పెరిగిపోకుండా ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్‌లతో మంచినీటిని సరఫరా చేయాలని సంబంధిత మంత్రి ఆతిషిని ఆదేశించారు. అవసరమైతే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) వీకే సక్సేనా సాయం తీసుకోవాలని, ఆయన తప్పకుండా సహకరిస్తారని సూచించారు. తాను జైలులో ఉన్న కారణంగా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తవద్దని చెప్పారు. ఈ వివరాలను మంత్రి ఆతిషి ఆదివారం విలేకర్లకు స్వయంగా వెల్లడించారు. శనివారం సాయంత్రం సీఎం నుంచి ఒక నోట్ రూపంలో ఈ ఆదేశాలు తనకు అందాయని తెలిపారు. ఈడీ కస్టడీలో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ వాసుల సమస్యల పట్ల చూపుతున్న శ్రద్ధను చూసి తనకు కన్నీళ్లు వచ్చాయన్నారు. ఢిల్లీలోని రెండు కోట్ల ప్రజల కుటుంబ సభ్యుడిగా కేజ్రీవాల్ తనను తాను భావిస్తుంటారని, అందువల్లే జైలులో ఉన్నా కూడా ప్రజల వెతల గురించి ఆలోచించటం ఆయనకు సాధ్యమైందని చెప్పారు. జైలు నుంచి కేజ్రీవాల్ ఆదేశాలు ఇవ్వటంపై ఈడీ దృష్టిసారించింది. కోర్టు ఆదేశాల మేరకే ఆయన చర్య ఉందా అన్నదానిపై ఈడీ దర్యాప్తు జరపనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శనివారం కేజ్రీవాల్‌ను ఆయన భార్య సునీత కలిశారని, ఆమె ద్వారా సదరు ఆదేశాల నోట్‌ను కేజ్రీవాల్ బయటకు పంపినట్లు తెలుస్తోందని ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకూ ప్రశ్నించారు.

జైలు నుంచి పాలన కష్టమే!

జైలు నుంచి కేజ్రీవాల్ పరిపాలన కొనసాగించటం సాధ్యం కాకపోవచ్చని తీహార్ జైలుకు చెందిన ఓ మాజీ న్యాయ అధికారి అభిప్రాయపడ్డారు. జైలు నిబంధనల ప్రకారం.. జైలులో ఉన్న వ్యక్తి వారానికి రెండు సార్లు మాత్రమే సమావేశాలు జరపటానికి వీలవుతుందని, దీనివల్ల ప్రజల రోజువారీ సమస్యలపై జైలు నుంచి స్పందించటం ఆచరణసాధ్యం కాదన్నారు. అయితే, కేజ్రీవాల్ ఈడీ కస్టడీని గృహనిర్బంధం కింద మార్చితే ఈ సమస్యకు పరిష్కారం లభించవచ్చని తెలిపారు. ఢిల్లీ ఎల్జీకి ఈ అధికారం ఉంటుందని, ఆయన అనుమతిస్తే ఢిల్లీలోని ఏ భవనాన్ని అయినా జైలుగా ప్రకటించి కేజ్రీవాల్‌ను అక్కడికి తరలించవచ్చని సదరు అధికారి పేర్కొన్నారు.

సునీతకు పగ్గాలు?

కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ఢిల్లీ సీఎంగా ఆయన భార్య సునీత కేజ్రీవాల్ పగ్గాలు చేపట్టనున్నారా? అన్న చర్చ మొదలైంది. 'జైలులో ఉన్నా బయట ఉన్నా నా జీవితం ప్రజాసేవకే అంకితం' అంటూ కేజ్రీవాల్ పంపించిన సందేశాన్ని సునీత శనివారం మీడియాకు చదివి వినిపించిన సంగతి తెలిసిందే. విలేకర్ల సమావేశాల్లో కేజ్రీవాల్ ఎప్పుడూ కూర్చునే కుర్చీలో కూర్చొని సునీత ఈ సందేశాన్ని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే, సీఎం పదవిని ఆమె చేపట్టే అవకాశాలున్నాయంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. కేజ్రీవాల్‌లాగే సునీత కూడా 1993 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐఆర్‌ఎస్ అధికారి. కేజ్రీవాల్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా సునీత ఉద్యోగంలో కొనసాగారు. 2016లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

వయా కవిత.. టార్గెట్ కేజ్రీ

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులతో కలిసి దళారుల ద్వారా చేసిన ముడుపుల చెల్లింపులపై కీలక సమాచారాన్ని ఆమె ముందు ఉంచి ప్రశ్నించినట్లు తెలిసింది. వివిధ మార్గాల ద్వారా పంపిన ముడుపులను ఎన్నికల్లో ఆప్ వినియోగించిన తీరు, అందులో కవిత పాత్రపై ఆరా తీసినట్లు సమాచారం. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో ఇండో స్పిరిట్‌కు అత్యధిక లాభాలు వచ్చేలా చూడడంతోపాటు, హోల్‌సేల్ వ్యాపారి లాభాల మార్జిన్‌ను 12 శాతానికి పెంచి, అందులో కొంత ముడుపులుగా స్వీకరించేందుకు వీలుగా కవిత పోషించిన పాత్రపై ఇతరులు ఇచ్చిన వాంగ్మూలాలను మరోసారి ఆమె ముందు పెట్టి విచారించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సౌత్ గ్రూప్ ఆర్థిక లావాదేవీలలో కవిత ఆడపడుచు కుమారుడు మేక శరణ్ పోషించిన పాత్రపై ఈడీ అధికారులు మరింత లోతుగా ప్రశ్నించినట్లు తెలిసింది. కవిత నివాసంలో ఆమెను అరెస్టు చేసిన సమయంలో స్వాధీనం చేసుకున్న మేక శరణ్ ఫోన్‌లో గుర్తించిన సౌత్ గ్రూప్ లావాదేవీల సమాచారంపై ప్రశ్నించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. శరణ్ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలపై వారు పదే పదే ప్రశ్నించినట్లు సమాచారం. కవిత వైపు నుంచే కాకుండా.. లిక్కర్ వ్యాపారి సమీర్ మహేంద్రు వైపు నుంచి కూడా మేక శరణ్ పాత్రపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సమీర్ మహేంద్రును తమ ముందు విచారణకు హాజరు కావాలని ఇప్పటికే ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే శరణ్ పాత్రపై సమీర్‌ను ఒక్కడినే విచారిస్తారా? లేక ఇప్పటికే ఈ కేసులో అప్రూవర్లుగా మారిన సౌత్ గ్రూప్‌లోని కవిత మాజీ సీఏ బుచ్చిబాబు, మాగుంట రాఘవ్, మాగుంట శ్రీనివాసులుతో కలిపి విచారిస్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది. కాగా, నిజామాబాద్‌లో కవిత వ్యవహారాలపై దర్యాప్తు చేసేందుకు ఈడీ బృందాలు అక్కడికి వెళ్లినట్లు తెలిసింది. మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన అక్రమార్జనను కవిత నిజామాబాద్‌లో వివిధ వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టినట్లు ఈడీ విశ్వసిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకే నిజామాబాద్‌లో కవిత వ్యవహారాలకు సంబంధించి ఆమె అనుచరులను విచారించడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. శనివారం కవిత కస్టడీ పొడగింపు కోసం రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలపైనా ఈడీ ఆరా తీసినట్లు తెలిసింది.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
అనంతపురం	40.0	25.0
తిరుపతి	39.8	24.3
నంద్యాల	39.0	25.0
విజయవాడ	36.5	24.4
ఒంగోలు	34.7	25.5

భారత్‌తో వాణిజ్య సంబంధాల పునరుద్ధరణను పరిశీలిస్తాం..

- పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్

న్యూఢిల్లీ, మార్చి 24: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న దాయాది దేశం పాకిస్థాన్‌కు భారత్ విలువ తెలిసివస్తోంది. భారత్‌తో మళ్లీ వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు తహతహలాడుతున్నట్టు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370ని భారత ప్రభుత్వం రద్దు చేసినప్పటి నుంచి పాక్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను నిలిపివేసింది. అయితే, ఇప్పుడు భారత్‌తో వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించే అంశాన్ని తీవ్రంగా పరిశీలించనున్నట్టు పాక్ విదేశాంగ మంత్రి మొహమ్మద్ ఇషాక్ దార్ శనివారం లండన్‌లో ఓ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌లోని వ్యాపారులు భారత్‌తో వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని కోరుకుంటున్నారని దార్ చెప్పారు. పాకిస్థాన్‌లో షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఇటీవలే కొలువుదీరగా.. ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా షరీఫ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి స్పందించిన ఆయన మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో దౌత్యపరమైన సంబంధాలపై ఆశలు చిగురించాయి. క్షీణిస్తున్న తమ దేశ ఆర్థిక వ్యవస్థను మళ్లీ పట్టాలెక్కించడంపై షరీఫ్ ప్రభుత్వం దృష్టిసారించింది.

'మియా' ముస్లింలకు అసోం సీఎం షరతులు

గువాహటి, మార్చి 24: అస్సాంలో స్థానికులుగా గుర్తింపు పొందాలంటే 'మియా ముస్లింలు' పలు షరతులను పాటించాల్సి ఉంటుందని సీఎం హిమాంత బిశ్వశర్మ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చిన బెంగాలీ మాట్లాడే ముస్లింలనే అస్సాంలో మియాలుగా వ్యవహరిస్తారు. రాష్ట్రంలో అస్సామీ మాట్లాడే స్థానిక ముస్లింలకన్నా వీరు భిన్నమైనవారని భావిస్తుంటారు. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో శనివారం మాట్లాడిన సీఎం మియాలకు పలు షరతులు విధించారు. "మియాలు స్థానికులా, కాదా అన్నది వేరే సమస్య. వారిని స్థానికులుగా గుర్తించడానికి ఇబ్బందేమీ లేదు. అయితే వారు బహుభార్యాత్వం, బాల్య వివాహాలను విడిచిపెట్టాలి. అస్సామీ సంస్కృతిని గౌరవించాలి. వైష్ణవ ఆశ్రమాలకు చెందిన 'సత్రాల' భూములను ఆక్రమించుకొని స్థానికులుగా గుర్తింపు కావాలంటే ఎలా కుదురుతుంది? ఇద్దరు ముగ్గురు భార్యలు ఉండకూడదు. అది అస్సామీ సంస్కృతి కాదు. పిల్లలను మదర్సాలకు పంపించొద్దు. బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వండి" అంటూ షరతులు పెట్టారు. రాష్ట్రంలో 40 లక్షల మంది అస్సామీ మాట్లాడే ముస్లింలు ఉండగా, వారిని మాత్రమే స్థానికులుగా గుర్తిస్తున్నారు. మొత్తం ముస్లింల్లో వారి జనాభా 37 శాతమే. మిగతా 63 శాతం మంది బెంగాలీ మాట్లాడే మియాలే ఉన్నారు.

31న 'ఇండియా' మహార్యాలీ

కేజ్రీవాల్ అరెస్టుపై సంఘటిత ఉద్యమం.. రాంలీలా మైదానంలో భారీ సభ

- హాజరుకానున్న కూటమి అగ్రనేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్ రాయ్

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా విపక్ష కూటమి ఇండియా భారీ ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఈ నెల 31న (వచ్చే ఆదివారం) ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కేజ్రీవాల్‌కు మద్దతుగా లక్షలాది మందితో బహిరంగ సభ (మహార్యాలీ) నిర్వహిస్తామని కూటమి నేతలు తెలిపారు. ఈ సభకు విపక్ష కూటమిలోని అన్ని పార్టీల అగ్రనేతలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఆప్, సీపీఎం ఆదివారం సంయుక్త మీడియా సమావేశం నిర్వహించాయి. ఢిల్లీ మంత్రి, ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. 'ప్రజాస్వామ్యం, దేశం ప్రమాదంలో ఉన్నాయి. వాటిని కాపాడటానికే ఈ మహార్యాలీ. ఇది కేవలం కేజ్రీవాల్ కోసమే కాదు. యావత్ ప్రతిపక్షాలకు ముప్పు పొంచి ఉంది' అని అన్నారు. రాజకీయ నాయకులను భయపెట్టడానికి, ప్రతిపక్షాల అడ్డు తొలగించుకోవడానికి ప్రధాని మోదీ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని.. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారని, బిహార్‌లో తేజస్వీ యాదవ్‌పై తప్పుడు కేసులు బనాయించారని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ నేతలను వేధిస్తున్నారని విమర్శించారు. కేజ్రీవాల్ కుటుంబాన్ని గృహనిర్బంధంలో ఉంచారని, ఆప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని వెల్లడించారు. ఢిల్లీ మద్యం కేసుపై రెండేళ్లుగా దర్యాప్తు జరుగుతున్నా, ఇప్పటివరకూ అక్రమ లావాదేవీలు జరిగినట్లు ఆధారాలు లేవని గోపాల్ రాయ్ గుర్తు చేశారు. 'ఈ కేసులో శరత్‌రెడ్డిని అరెస్టు చేశారు. కానీ, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తానని, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి రూ.60 కోట్లు ఇస్తానని చెప్పిన తర్వాత ఆయనను విడుదల చేశారు. ఈ మేరకు బీజేపీకి రూ.60 కోట్లు ముట్టాయి' అని ఆరోపించారు. దేశాన్ని రక్షించటానికి యావత్ ప్రతిపక్షం సంఘటితంగా ముందుకొస్తుందన్నారు. కాగా, గోపాల్‌రాయ్ ఆరోపణలపై శరత్‌రెడ్డి నుంచి ఎటువంటి స్పందన వెలువడలేదని పీటీఐ వార్తాసంస్థ తెలిపింది. కాగా, మహార్యాలీ నిర్వహణకు అనుమతికి దరఖాస్తు చేస్తామని, అనుమతి లభించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని గోపాల్ రాయ్ తెలిపారు.

రాంలీలా మైదానానికి చారిత్రక ప్రాధాన్యం

ఢిల్లీలోని రాంలీలా మైదానానికి చారిత్రక ప్రాధాన్యత ఉంది. 2011లో నాటి యూపీఏ సర్కారుకు వ్యతిరేకంగా అన్నాహజారే నేతృత్వంలో ఈ మైదానంలోనే అవినీతి వ్యతిరేక ఉద్యమం జరిగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో యూపీఏ ఓటమికి ఇదొక ప్రధాన కారణంగా నిలిచింది. దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిన సమయంలో నాటి ప్రతిపక్షాలు జనతా కూటమిగా ఏర్పడి ఇదే రాంలీలా మైదానంలో భారీ సభలు నిర్వహించాయి. ప్రస్తుతం మోదీ హ్యాట్రిక్ ఖాయమేనంటూ పలు సర్వేలు జోస్యం చెబుతున్న వేళ.. ప్రతిపక్షాలు ఇదే మైదానం వేదికగా ఉద్యమానికి దిగటం చర్చనీయాంశమైంది.

పెద్దలకు టీబీ వ్యాక్సిన్!



- మానవుల నుంచి సేకరించిన క్షయ బ్యాక్టీరియాతో తొలిసారి తయారు చేసిన స్పానిష్ కంపెనీ
- ఆ సంస్థతో కలిసి భారత్ బయోటెక్ ట్రయల్స్

హైదరాబాద్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఏటా దాదాపు కోటి మందికిసోకి.. దాదాపు 15లక్షల మంది ప్రాణాలు బలిగొంటున్న క్షయ మహమ్మారిని నివారించే 'ఎంటీబీవ్యాక్'అనే టీకా త్వరలోనే అందుబాటులోకి రానుంది. క్షయవ్యాధికి సంబంధించి ప్రపంచంలోనే తొలి లైవ్ ఎటెన్యుయేటెడ్ వ్యాక్సిన్ ఇది. స్పెయిన్‌కు చెందిన ఫార్మా సంస్థ బయోఫ్యాబ్రీ తయారుచేసిన ఈ టీకా సేఫ్టీ, ఇమ్యూనోజెనిసిటీ ట్రయల్స్‌ను ఆ సంస్థతో కలిసి చేపడుతున్నట్టు భారత్ బయోటెక్ సంస్థ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. క్షయ నివారణకు ప్రస్తుతం చిన్నారులకు వేస్తున్న బీసీజీ టీకా చాలా పాతది. అది జంతువుల్లో క్షయను కలిగించే బ్యాక్టీరియాను సేకరించి తయారు చేసిన వ్యాక్సిన్. పెద్ద వయసులో వచ్చే క్షయను నివారించే టీకాలేవీ ప్రస్తుతానికి లేవు. ఈ రెండు సమస్యలనూ పరిష్కరించేలా బయోఫ్యాబ్రీ.. మానవులకు సోకే క్షయకారక 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్‌క్యూలోసిస్' సూక్ష్మక్రిమి నుంచి ఈ లైవ్ ఎటెన్యుయేటెడ్ టీకాను అభివృద్ధి చేసింది. లైవ్ ఎటెన్యుయేటెడ్ వ్యాక్సిన్ అంటే వ్యాధికారక సూక్ష్మక్రిమిని.. అది మనకు ఏ హానీ చేయలేనంత బలహీనంగా మార్చి మన శరీరంలోకి ప్రవేశపెట్టే టీకా. ఎంఎంఆర్, పోలియో చుక్కలు ఇందుకు ఉదాహరణ. ఇవి అత్యంత సమర్థంగా పనిచేస్తాయి. ఎంటీబీవ్యాక్ అలాంటిదే. దీన్ని పెద్దలకూ ఇవ్వొచ్చు. ఈ క్రమంలోనే తొలుత క్లినికల్ ట్రయల్స్‌లో భాగంగా దీన్ని పెద్దలపై ప్రయోగిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం చేపట్టినవి సేఫ్టీ అండ్ ఇమ్యూనోజెనెసిటీ ట్రయల్స్ అంటే.. ఈ టీకా ఎంతవరకు సురక్షితం? ఏమేరకు రోగనిరోధక వ్యవస్థను స్పందింపజేసి యాంటీబాడీలు తయారయ్యేలా చేయగలదు?అనే అంశాలను ఈ ట్రయల్స్‌లో పరీక్షిస్తారు. ఈ టీకా ఎంత సమర్థంగా పనిచేస్తుందో పరీక్షించే ఎఫికసీ ట్రయల్స్ వచ్చే ఏడాది నిర్వహించనున్నారు. కాగా.. భారత్‌లో పెద్దలు, కౌమారప్రాయంలో ఉండేవారిపై ఈ టీకా ట్రయల్స్ నిర్వహించడాన్ని గొప్పమైలురాయిగా బయోఫ్యాబ్రీ సీఈవో రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. బయోఫ్యాబ్రీతో కలిసి ఈ టీకా ట్రయల్స్‌లో భాగస్వాములుకావడం గౌరవంగా భావిస్తున్నామని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా పేర్కొన్నారు. పెద్దలు, యుక్తవయసులో వ్యాధిని నివారించడానికి టీబీ వ్యాక్సిన్ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు.

స్పెయిన్‌లో..

ఈ టీకా అభివృద్ధి, క్లినికల్ ట్రయల్స్.. దాదాపు 3దశాబ్దాల కృషి. పారిస్‌లోని పాశ్చర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ బ్రిగిట్ గిక్వెల్..స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జరగోజా ల్యాబ్‌లో ఈ టీకా అభివృద్ధి చేశారు. జరగోజా వర్సిటీకి పారిశ్రామిక భాగస్వామి అయిన బయోఫ్యాబ్రీ ఈ టీకాను ఉత్పత్తి చేస్తోంది. ఈ టీకా ఎంత డోసు వరకు సురక్షితమో తెలుసుకునేందుకు ఇటీవలే ఫేజ్-2 ట్రయల్స్ పూర్తయ్యాయి. బీసీజీతో ఈ టీకాను పోల్చిచూసేందుకు నవజాత శిశువులపై డబుల్ బ్లైండ్, కంట్రోల్డ్ ఫేజ్-3 క్లినికల్ ట్రయల్స్ నిరుడు ప్రారంభించారు. ఇం దులో దక్షిణాఫ్రికాలో 7వేల మంది, మడగాస్కర్ నుంచి 60, సెనెగల్ నుంచి 60మంది పిల్లలకు టీకాలు వేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 1900మంది పైచిలుకు పిల్లలకు ఈ టీకా లు వేశారు. దక్షిణాఫ్రికాలో 276 మంది హెచ్ఐవీ సోకిన పెద్దలకు ఫేజ్-2 ట్రయల్స్‌లో భాగంగా ఈ టీకా ఇచ్చారు. ఫేజ్-2బీ ఎఫికసీ ట్రయల్స్‌లో సబ్‌సహారన్ ఆఫ్రికాలో కౌమారంలో ఉన్నవారికి టీకా ఇవ్వనున్నారు.

ఉక్రెయిన్‌పై రష్యా అగ్ని వర్షం

ఏకంగా 57 క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి

కీవ్, మార్చి 24: ఉక్రెయిన్‌పై రష్యా అగ్ని వర్షం కురిపించింది. ఆదివారం తెల్లవారుజామున భారీగా క్షిపణులను ప్రయోగించింది. రాజధాని కీవ్‌తోపాటు కీలక ఇంధన వనరులు అధికంగా ఉన్న పశ్చిమ ప్రాంతంలోని లెవివ్‌పైనా క్రూయిజ్ మిసైళ్లతో దాడులు చేసింది. విద్యుత్తు సరఫరాలేకుండా చేయాలన్న లక్ష్యంతో ఈ దాడులు చేసినట్టు కనిపిస్తోంది. రష్యా అధ్యక్ష ఎన్నికల సమయంలో ఉక్రెయిన్ దాడులకు పాల్పడగా దానికి ప్రతీకార చర్యగా క్షిపణి ప్రయోగాలకు దిగినట్టు తెలుస్తోంది. లెవివ్‌లోని ఇంధన వనరులపై శుక్రవారమే బాంబులతో దాడి చేయగా, తాజాగా క్షిపణులను ఉపయోగించింది. కీవ్, లెవివ్‌లపై మొత్తంగా 57 మిసైళ్లు, డ్రోన్లను ప్రయోగించింది. 'కింజహాల్ హైపర్ సోనిక్ మిసైల్స్'ను రష్యా ప్రయోగించిందని లెవివ్ రీజనల్ గవర్నర్ మక్స్యం కొజెట్స్కియి తెలిపారు. లెవివ్‌లోని 'కీలక ఇంధన వనరుల్లో'ని పరికరాలు మంటల్లో కాలిపోయాయని, దాంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్టు ఇంధన శాఖ తెలిపింది. ఉక్రెయిన్ ఇంతవరకు పొరుగుదేశాలను విద్యుత్తును ఎగుమతి చేస్తుండగా దానిని నిలిపివేసి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితికి వచ్చింది. రష్యా దాడులకు ఉక్రెయిన్ సమర్థంగానే సమాధానం ఇచ్చింది. మొత్తం 29 మిసైళ్లు దూసుకురాగా వాటిలో 18 క్షిపణులను కూల్చివేసింది. 28 అటాక్ డ్రోన్లు దాడికి రాగా వాటిలో 25 డ్రోన్లను ధ్వంసం చేసింది. కీవ్, పరిసర ప్రాంతాల్లో సుమారు డజను మిసైళ్లను ధ్వంసం చేశామని, బాంబు పేలుళ్లతో ఆ ప్రాంతం దద్దరిల్లిందని కీవ్ మిలటరీ అడ్మినిస్ట్రేషన్ హెడ్ సెరిహీ పాప్కో తెలిపారు. కీవ్‌లో పెద్దగా నష్టం జరగలేదని చెప్పారు. కూల్చివేసిన క్రూయిజ్ మిసైల్ కెహెచ్-55 శకలాలు కీవ్ పార్కులో పడి ఉన్నాయని అధికారులు తెలిపారు.

దారి తప్పి పోలాండ్‌లోకి వెళ్లిన క్షిపణి

లెవివ్‌పై రష్యా ప్రయోగించిన క్షిపణి దారి తప్పి కొద్దిసేపు పోలాండ్ గగనతలంలోకి వెళ్లింది. ఉక్రెయిన్ సరిహద్దులు దాటి రెండు కిలోమీటర్ల ఆవల ఉన్న ఓసెర్‌డేవ్ పట్టణం వైపు వెళ్లింది. గగనతలంలో 39 సెకన్లపాటు ఉండి తిరిగి ఉక్రెయిన్ భూభాగంలోకి వెళ్లింది. దీనిపై రష్యా వివరణ కోరుతామని పోలాండ్ అధికారవర్గాలు తెలిపాయి. ఉక్రెయిన్‌కు మిలటరీ పరంగా, మానవతా దృక్పథంతో సాయం కొనసాగిస్తామని పోలాండ్ రక్షణ మంత్రి చెప్పారు.



శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకాన్ని ఆవిష్కరించిన బ్రహ్మానందం తదితరులు

'శ్రీవేంకటేశ్వర చిత్రార్చన'ను ఆవిష్కరించిన బ్రహ్మానందం

- 202 మంది చిత్రకారుల కుంచె నుంచి శ్రీవారి చిత్రాలతో పుస్తకం

తిరుపతి (కల్చరల్)/తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రాలను 202 మంది చిత్రకారులు వేయగా.. దీన్ని శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పేరుతో తిరుపతికి చెందిన శ్రీకళాక్షేత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఓ పుస్తకంగా రూపొందించింది. ఈ పుస్తకాన్ని ఆదివారం తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాలలో ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను గీసిన బొమ్మ కూడా ఈ పుస్తకంలో ఉండటం ఆ దేవదేవుడి కృపే అన్నారు. పలువురు కళాభిమానులు, విద్యార్థులు, నగరవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా.. బ్రహ్మానందం ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఉద్యమాలకు కవులు, రచనలే కీలకం

- మళ్లీ సీమ ఉద్యమం రావాల్సిందే
- 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణలో గోరటి వెంకన్న



కర్నూలు(కల్చరల్), మార్చి 24: చరిత్రలో తలమానికంగా నిలిచిన ఎన్నో ఉద్యమాలకు కవులు, వారి రచనలు, పుస్తకాలు ప్రధాన భూమిక పోషించాయని ప్రజాకవి, తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అభిప్రాయపడ్డారు. ఆదివారం కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, అనంతపురం జిల్లాకు చెందిన బండి నారాయణ స్వామి రాసిన 'మన సీమ కథలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ సభకు విశిష్ట అతిథిగా హాజరైన గోరటి వెంకన్న ఇతర సాహితీవేత్తలతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలోని కరువు కాటకాలను ఉటంకిస్తూ, ఇక్కడి స్థితిగతులకు ప్రతిబింబంగా 'మన సీమ కథలు' నిలిచిపోతాయని, సుప్రసిద్ధ కథా రచయిత బండి నారాయణ స్వామి తాను అనుభవించిన జీవితసారాన్ని కథల్లో రాశారని కొనియాడారు. రాయలసీమలో వేమన కాలం నుంచి సామాజిక స్పృహతో రాసిన కవులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. రాయలసీమలో తాండవిస్తున్న కరువు, వెనుకబాటుతనంపై ఉద్యమ స్ఫూర్తితో కథలు రాస్తున్న వారిలో బండి నారాయణ స్వామి ముందున్నారని ప్రశంసించారు. తెలంగాణాలోనూ ఉద్యమాలు తీవ్రంగా మారిన తర్వాత ప్రజా గాయకులు, సాహిత్యకారులు ఆ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారన్నారు. రాయలసీమలో రచయితలు ముందుంటున్నారని, ఉద్యమం మరింత బలోపేతం కావాలన్నారు. సీమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అన్ని వర్గాలు కృషి చేయాలని కోరారు. మళ్లీ సీమ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పుస్తకావిష్కర్త, సీమ ఉద్యమకారుడు కానాపురం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీమలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభిస్తే ఇక్కడ ఏ పథకాలూ అమలు చేయాల్సిన అవసరం లేదన్నారు. బండి నారాయణస్వామి మాట్లాడుతూ సీమలో జరుగుతున్న ప్రజాస్వామిక ఉద్యమాలు కొన్ని పత్రికలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాల నుంచీ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉంటాయని, ఆ ఉద్యమం బలపడే దిశగా సాహిత్యకారులు ముందుకు రావాలని కోరారు.

మాజీ మంత్రి బండారుకు తీవ్ర అస్వస్థత

- ఆస్పత్రికి తరలింపు.. నిలకడగా ఆరోగ్యం

పరవాడ (అనకాపల్లి జిల్లా)/ మహారాణిపేట (విశాఖ సిటీ), మార్చి 24: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన విశాఖలోకి ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బండారు స్వస్థలం పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామం. కుటుంబంతో సహా ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో రక్తపోటు విపరీతంగా పెరిగి, షుగర్ లెవెల్స్ పడిపోయాయి. దీంతో అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే విశాఖ తరలించి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ తదితరులు ఆస్పత్రికి వెళ్లి బండారు ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు.

మళ్లీ కుంగిన గామన్ బ్రిడ్జి

- 9 సంవత్సరాల్లో ఇది రెండో సారి
- 52వ స్తంభం వద్ద మరమ్మతులు
- విజయవాడ-విశాఖ ఎక్స్‌ప్రెస్ హైవేపై ట్రాఫిక్ ఇక్కట్లు

కొవ్వూరు, మార్చి 24: తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు నుంచి కొవ్వూరు వరకూ గోదావరిపై నిర్మించిన గామన్ బ్రిడ్జి మళ్లీ కుంగింది. ఆదివారం సాయంత్రం గామన్ బ్రిడ్జిపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే దారిలో 52వ స్తంభం జాయింట్ వద్ద వంతెన అర అంగుళం మేర కుంగింది. వంతెనకు యాక్సెస్ ఇచ్చే బేరింగ్‌లు మరమ్మతులకు గురికావడమే దీనికి కారణమని తేల్చారు. దీంతో కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే దారిలో వాహనాలను నిలుపుదల చేశారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు రెండు వైపుల వాహనాలకూ అనుమతివ్వడంతో ఈ దారిలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభిస్తోంది. నిపుణుల బృందం సోమవారం వచ్చి సమస్యను పరిశీలించి మరమ్మత్తులు చేపట్టనుంది. గామన్ సంస్థ 2007లో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించింది. విజయవాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానంగా గోదావరిపై సుమారు రూ.808 కోట్లతో గామన్ బ్రిడ్జిని నిర్మించారు. 2015లో పుష్కరాల నిమిత్తం హడావుడిగా ప్రారంభించారు. అయితే ఆరంభంలోనే ఈ బ్రిడ్జి ఒకసారి కుంగింది. మళ్లీ ఇన్నేళ్లకు మరమ్మతులకు గురైంది. గామన్ బ్రిడ్జిపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పట్టణ సీఐ వి.జగదీశ్వర రావు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు.

గామన్ బ్రిడ్జి



'ఛీ'ఐ గులాంగిరీ!

- వైసీపీ కార్యకర్తలా పోలీసు అధికారి తీరు
- మంత్రి పెద్దిరెడ్డికి సన్నిహితుడిగా పేరు
- కడప నుంచి వచ్చి చిత్తూరులో పెత్తనం
- అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయండి.. లేకుంటే ఎన్నికల తర్వాత భవిష్యత్తు ఉండదు
- తోటి పోలీసు అధికారులకు బెదిరింపులు
- ఈసీ బదిలీ చేసినా మంత్రి అండతో విధుల్లోకి
- ఎస్ఐ నుంచి డీఎస్పీ వరకు ఆయన మాటే వేదం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఒక సీఐకి సీఎం జగన్ అంటే విపరీతమైన స్వామి భక్తి. మంత్రి పెద్దిరెడ్డికి నమ్మిన బంటుగా, అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. సీఎం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పాటు ఆయన సొంత జిల్లా నుంచి రావడంతో ఇక్కడ పెత్తనం చెలాయిస్తున్నారు. వైసీపీకి అనుకూలంగా పనిచేయాలని తోటి సిబ్బందిని బెదిరిస్తున్నారు. 'వచ్చేది వైసీపీ ప్రభుత్వమే. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయండి. లేకుంటే ప్రభుత్వం వచ్చాక మీకు భవిష్యత్తు ఉండదు'.. అంటూ వారిని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఎస్పీకి దగ్గరగా ఉండే



విభాగంలో పనిచేసే ఆ సీఐ తీరు ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణ రోజుల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పని చేసినా, ఎన్నికల కోడ్ సమయంలో అయినా నిష్పక్షపాతంగా పనిచేసే స్వేచ్ఛ చిత్తూరు జిల్లా పోలీసులకు లేకుండా పోయింది. ఎస్ఐ నుంచి డీఎస్పీ స్థాయి వరకు అతనంటే భయపడుతున్నారని, చివరకు ఎస్పీ కూడా ఆయన మాటే వింటున్నారని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. సదరు సీఐ చెప్పినట్లే మంత్రి పెద్దిరెడ్డి కూడా వింటారని అనేకమార్లు రుజువైంది. జిల్లాలో ఏ పోలీసు అధికారిని బదిలీ చేయాలన్నా, వీఆర్‌కు పంపాలన్నా ఈయన అనుకుంటే నిమిషాల్లో అయిపోతుంది. స్థానిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పుంగనూరు నియోజకవర్గంలో అన్ని సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలతో పాటు మున్సిపాలిటీలోని అన్ని వార్డు స్థానాలనూ వైసీపీ నాయకులు అక్రమంగా ఏకగ్రీవం చేసుకున్నారు. నామినేషన్లు వేసినా ప్రత్యర్థులను బెదిరించి విత్‌డ్రా చేయించినట్లు సీఐపై ఆరోపణలున్నా యి. ఆయన సమక్షంలోనే వైసీపీ నాయకులు ప్రత్యర్థుల నామినేషన్లను చించేసిన ఘటనలున్నాయి. ఈ క్రమంలో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించడంతో పాటు అక్కడినుంచి బదిలీ చేసింది. మంత్రి పెద్దిరెడ్డి అండతో మళ్లీ ఆ సీఐ పుంగనూరు నియోజకవర్గానికే వచ్చారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా ఈసీ నిబంధన మేరకు జిల్లాను వదిలి వెళ్లలేదు. లూప్‌లైన్ పేరుతో ఎస్పీకి దగ్గరగా ఉండే విభాగంలో సీఐగా చేరారు. ఈ విభాగంలో తనకంటే పైస్థాయిలో ఉన్న డీఎస్పీకి కూడా తెలియకుండా నేరుగా జిల్లాలోని పోలీసు అధికారులను వైసీపీకి అనుకూలంగా పనిచేయాలని బెదిరిస్తున్నట్లు సమాచారం. డీఎస్పీకి తెలియకుండానే ఏకంగా 14 మంది అనుకూల సిబ్బందిని ఆ విభాగంలో నియమించుకున్నారు. ఆ డీఎస్పీ కూడా అధికార పార్టీ మనిషే అయినా ఎందుకో ఇద్దరికీ పడలేదు. దీంతో డీఎస్పీ అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు డీఎస్పీ లేకపోవడంతో, సీఐ ఇన్‌చార్జిగా మరింత రెచ్చిపోతారని పోలీసు వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సీఐ బెదిరింపుల బాధిత అధికారులు చాలామంది ఉన్నా, ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఇలాంటివారితో కలసి పనిచేయలేమని కొందరు అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, చిత్తూరు జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ నిత్యం టెలీకాన్ఫరెన్సులు నిర్వహించి, 'కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలి. నిష్పక్షపాతంగా పనిచేయాలి. మనకు అన్ని పార్టీలు ఒక్కటే' అని చెబుతున్నా.. సదరు సీఐ బెదిరింపులను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

విశాఖలో ఆయుధాలు స్వాధీనం

- ట్రావెల్ ఏజెన్సీలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి రివాల్వర్, పిస్టల్, రెండు బుల్లెట్స్ సీజ్



స్వాధీనం చేసుకున్న ఆయుధాలను చూపుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప (ఎడమ), డీసీపీ-1 మణికంఠ చందోలు

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్ ఏజెన్సీ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి పోలీసులు ఒక రివాల్వర్, పిస్టల్‌తోపాటు రెండు బుల్లెట్లు, ఒక ఖాళీ కేస్‌ను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ పోలీసు కమిషనరేట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప వివరాలు వెల్లడించారు. నగరంలోని రామాటాకీస్ సమీపంలోని శ్రీకృష్ణ ట్రావెల్స్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తి వద్ద తుపాకులు ఉన్నట్టు శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో త్రీటౌన్ పోలీసులతో కలిసి ట్రావెల్స్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. అక్కడ పనిచేస్తున్న శివాజీపాలేనికి చెందిన వేములకొండ శివనాగరాజు(41) వద్ద నుంచి దేశవాళీ రివాల్వర్, పిస్టల్‌తోపాటు రెండు బుల్లెట్స్, ఒక ఖాళీ కేస్ స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా.. గతేడాది ఏప్రిల్‌లో జార్ఖండ్‌కు చెందిన కునాల్ శ్రీవాత్సవ అనే వ్యక్తి రెడ్‌బస్ యాప్‌లో విశాఖ నుంచి బెంగళూరుకి టికెట్ బుక్ చేసుకున్నాడని చెప్పాడు. బస్సు బయలుదేరడానికి అరగంట ముందు ట్రావెల్స్ కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గమనించి, బ్యాగ్ తనిఖీ చేయడానికి లోపలికి రావాలని పిలిచానన్నాడు. అయితే అతను లోపలికి రాకపోగా, హడావుడిగా అక్కడి నుంచి పారిపోయాడని, ఈ సమయంలో అతని బ్యాగ్ నుంచి ఒక ప్యాకెట్ కింద పడిపోయిందని వివరించాడు. ప్యాకెట్‌లో రివాల్వర్, పిస్టల్‌తోపాటు రెండు బుల్లెట్స్, ఖాళీ కేస్ ఉందని తెలిపాడు. కాగా ఆయుధాలను పోలీసులకు అప్పగించకుండా తనవద్ద ఉంచుకున్నందుకు శివనాగరాజుపై భారతీయ ఆయుధ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేశామని జాయింట్ సీపీ చెప్పారు. కునాల్‌శ్రీవాత్సవ కోసం గాలిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక డిమాండ్
- సమస్యల పరిష్కారం కోసం 30 సంఘాలతో కూటమి ఏర్పాటు

విజయవాడ(వన్‌టౌన్), మార్చి 24: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యల పరిష్కారానికి 30 సంఘాలతో కూటమిగా ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ తెలిపారు. విజయవాడలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ, కో-చైర్మన్‌గా కె.హరికృష్ణ, వైస్ చైర్మన్లుగా సీహెచ్ పాపారావు, కేదారేశ్వరరావు, ఎం.రమేష్‌కుమార్, రవీంద్రబాబు, ప్రధానకార్యదర్శిగా పటాన్‌బాజీ, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఆస్కారరావు, నరసింహారావు, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ రజాక్, రంగనాథబాబు, ఎంవీ ప్రభాకరరావు, పరమేశ్వర్, కోశాధికారిగా జీఎం రమేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగులు ఆత్మాభిమానంతో బాధ్యతలు నిర్వర్తించేందుకు వారి న్యాయబద్ధమైన హక్కులను సాధించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను ఐక్యవేదిక ప్రతినిధుల దృష్టికి తెచ్చి పరిష్కారం పొందాలని సభ్యులకు సూచించారు. పాత పెన్షన్ స్కీం(ఓపీఎస్) పునరుద్ధరణ, 12వ పీఆర్సీ సత్వర అమలు, సకాలంలో డీఏల చెల్లింపు, బకాయి ఉన్న రూ.25 వేల కోట్లకుపైగా పీఆర్సీ డీఏ తదితరాల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, పెన్షన్ల చెల్లింపు చట్టబద్ధం, ఎన్ఎంఆర్, కంటింజెంట్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పెన్షనర్లకు అదనపు క్వాంటామ్ పెన్షన్ అమలు, మెరుగైన హెల్త్ స్కీమ్, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇంటి స్థలాలు, టీచర్స్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ సమస్యకు శాశ్వత పరిష్కారం, మెరుగైన విద్యావ్యవస్థ ఏర్పాటుకు చట్టబద్ధ చర్యలు, గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, సర్వీస్ రూల్స్ అమలు, సంస్థాగత సమస్యల పరిష్కారం, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలని తీర్మానించారు.



కూటమి ప్రతినిధులతో కలిసి అభివాదం చేస్తున్న కేఆర్ సూర్యనారాయణ



విజేతలతో నిర్వాహకులు, సర్పంచ్ రంగారావు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఓపెన్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 24: నగర సమీపంలోని నిడమానూరు స్టార్ టెన్నిక్ అకాడమీలో ఏపీ స్టేట్ ఓపెన్ టెన్నిస్ (శీలం రాజయ్య మెమోరియల్) టోర్నీలో మ్యాచ్‌లు ఆదివారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా పోరాటమే స్ఫూర్తిగా సాగితే విజయాలను సాధిస్తామన్నారు. స్టార్ టెన్నిస్ అకాడమీ ఎండీ గోపాలరావు, టోర్నీ నిర్వాహకులు సాయి మాట్లాడుతూ టోర్నీకి విశేష స్పందన లభించిందన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో కోచ్‌లు ఆనంద్, లక్ష్మారెడ్డి, శ్రీరామ్, రవి , సాయి పాల్గొన్నారు.



చెస్ విజేతలతో నిర్వాహకులు

జిల్లా స్థాయి ఓపెన్ చెస్‌కు విశేష స్పందన

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 24: స్థానిక గ్రీన్ స్కూల్లో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీకి విశేష స్పందన లభించింది. మొత్తం పోటీల్లో 77 మంది బరిలో దిగారు. ట్రస్ట్ డైరెక్టర్ పి.రేణుక, స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నిఖిల, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం.ఫణికుమార్, చెస్ మేనేజర్ రామకృష్ణ, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ ఎంఈ సుమన్ రాజు పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రతిభ చాటిన 13 మందిని 31న రాజమండ్రిలో జరిగే స్టేట్ లెవెల్ టోర్నీకి ఎంపిక చేశారు.

విజేతలు వీరే... అండర్-7 బాలబాలికల్లో కె.సందీప్, బి.అఖిల్‌సాయి, ఎంఎన్‌వీ. జగదీష్‌బాబులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా, కె.సుహిరిత్, పి.జోష్నికలు ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. అండర్-9లో ఎం.కార్తికేయ, టి.ప్రణీత్ తొలి రెండు స్థానాల్లోను, అండర్-11లో బి.వరుణ్ తేజ్, పి.గీతిక, అండర్-13లో బి.ఆశ్రిత్, ఏ శాన్వి నిషిత, అండర్-15లో ఎం.జితేష్ నాగ్, బి.తన్మయి ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా కేదారేశ్వరరావు



వన్‌టౌన్, మార్చి 24: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడుగా కేదారేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం విద్యాధరపురం కిరణా మర్చంట్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో రవాణా శాఖ నుంచి కేదారేశ్వరరావును ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న, పక్కన నాగుల్‌మీరా

కేశినేని చిన్నిని భారీ మెజారిటీతో గెలిపించాలి

● మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

వన్‌టౌన్, మార్చి 24: వచ్చే ఎన్నికల్లో టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, క్లస్టర్ ఇన్‌చార్జులు, డివిజన్ అధ్యక్షులకు సూచించారు. ఆదివారం వన్‌టౌన్ అర్జున వీధిలోని బుద్దా వెంకన్న తన కార్యాలయంలో బీసీ, మైనార్టీ నేత, పార్టీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరాతో కలిసి క్లస్టర్ ఇన్‌చార్జులు, డివిజన్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎలాంటి విభేదాలు లేకుండా సోదరభావంతో కష్టపడి పనిచేసి చంద్రబాబును సీఎంను చేయాలన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు.

కేశినేని చిన్నికి బుద్దా సత్కారం

పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం వన్‌టౌన్‌లోని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి బుద్దా వెంకన్న ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా వెంకన్న తన అల్లుడు కాంగ్రెస్ రవీంద్రతో కలిసి కేశినేని చిన్నికి దుశ్శాలువ కప్పి సత్కరించారు.

టికెట్ లేకుండా దుర్గమ్మ దర్శనానికి..

● అడ్డుకున్న సెక్యూరిటీపై మేళం ఉద్యోగి దౌర్జన్యం

వన్‌టౌన్, మార్చి 24: దుర్గగుడిలో అమ్మవారి దర్శనానికి టికెట్ లేకుండా ఆలయంలో పనిచేస్తున్న మేళం ఉద్యోగి తిరుపతిరావు వీఐపీ క్యూలో తీసుకువెళుతుండగా అడ్డుకున్న సెక్యూరిటీపై దౌర్జన్యానికి దిగిన సంఘటన ఆదివారం జరిగింది. తిరుపతిరావు టికెట్ లేకుండా నలుగురు భక్తులను వీఐపీ క్యూలో ఎదురుగా తీసుకువెళుతున్నాడు. అదే సమయంలో సెక్యూరిటీ సూపర్‌వైజర్ అరవింద్ ఈవో పేషీ నుంచి 4 టికెట్లు కొని నలుగురిని లోపలికి తీసుకువెళ్తున్నాడు. తిరుపతిరావు వద్ద టికెట్లు లేకపోవడం గమనించిన అరవింద్ తిరుపతిరావును అడ్డుకుని టికెట్లు కొనుగోలు చేయాలన్నారు. అందుకు తిరుపతిరావు నువ్వెలా తీసుకువెళుతున్నావంటూ వాదనకు దిగి దౌర్జన్యం చేయగా అరవింద్ చేతికి గాయమైంది. తిరుపతిరావుతో పాటు మేళంలో పనిచేస్తున్న మరో ఉద్యోగి హరి కూడా టికెట్ లేకుండా భక్తులను ఇష్టానుసారంగా తీసుకువెళుతున్నారని ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది చెబుతున్నారు. తిరుపతిరావు తనపై దౌర్జన్యం చేసిన విషయాన్ని ఆలయాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు.

ఆస్తులు లాక్కుని ఆత్మహత్యలకు ప్రేరేపించడం సామాజిక న్యాయమా?

విద్యాధరపురం, మార్చి 24: ఆస్తులు లాక్కుని ఆత్మహత్యలకు ప్రేరేపించడం సామాజిక న్యాయమా అని టీడీపీ బీసీ సాధికారిక సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. జగన్‌రెడ్డి పాలనలో ఫ్యాక్షనిజం జడలు విప్పిందని ఇంకెతమంది బీసీలను బలి తీసుకుంటారని ధ్వజమెత్తారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంటిమిట్ట మండలం, కొత్తమాధవవరం గ్రామానికి చెందిన పాలసుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం జగన్ మాఫియా అరాచకానికి నిదర్శనమన్నారు. చంద్రబాబుది బడుగుల జీవితాల్లో వెలుగులు నింపే పాలనైతే, జగన్‌రెడ్డిది ప్రాణాలు తీసే పాలనన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రమేష్

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

● రాష్ట్ర టీబీ నివారణాధికారి డాక్టర్ రమేష్

వన్‌టౌన్, మార్చి 24: మరో ఏడాదిలో రాష్ట్రంలో క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర టీబీ నివారణ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ కుటుంబ సంక్షేమ శాఖ జేడీ డాక్టర్ టి.రమేష్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆదివారం పాత ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి ప్రసంగించారు. ప్రపంచంలో నమోదవుతున్న టీబీ కేసుల్లో 24శాతం మన దేశంలోనే ఉన్నాయన్నారు. 2025 నాటికి టీబీని పూర్తిగా అంతమొందించాలన్న ఉద్దేశంతో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. క్షయ నివారణాధికారి డాక్టర్ జే ఉషారాణి, ఆర్ఎంవో డాక్టర్ శోభరాణి, వాసవ్య మండలి సెక్రటరీ జి.లక్ష్మీ, డీటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.గుణశ్రీ, డీఎంహెచ్‌వో, ఎన్‌టీఈపీ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో కొంతమంది క్షయ వ్యాధిగ్రస్థులకు పోషకాహార కిట్లను అందజేశారు. ఐఎంఏ నుంచి చలసాని ప్రమోద్, ఊపిరితిత్తుల డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వివిధ

vividha@andhrajyothy.com సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

రంగుల చేతులు

బజారులో అమ్మకానికి ఉన్న
ఇన్ని హోళీ రంగుల్ని చూస్తుంటే
అప్పుడెప్పుడో చిన్నప్పుడు
దోస్తుల పిడికిళ్లలోంచి
నామీదికి విజృంభించబడిన
ఆనాటి రంగులు గుర్తుకొస్తున్నాయి.
గోడ దూకిన రంగులు
నక్కి నక్కి దాక్కున్న రంగులు
నిశ్శబ్దంగా కిటికీలు తెరిచిన రంగులు...
తీసేదాకా తలుపులు బాదిన రంగులు
దుప్పటి లాగిన రంగులు
వెనుక నుండి హఠాత్తుగా దాడిచేసిన
రంగులు
రోడ్డు మీద పరుగెత్తించిన రంగులు
సైకిల్ ముందుచక్రాన్ని ఆపిన రంగులు
వెనుక చక్రం వెనుక
పరుగెత్తి పరుగెత్తి అందుకోలేకపోయిన
రంగులు
పళ్లకు రుద్దిన రంగులు
కళ్లల్లో పడ్డ రంగులు
వాగునీటిలో కలిసిపోయిన రంగులు
వారందాకా ఒంటిమీదినుండి
వెళ్లిపోని రంగులు

★ ★ ★

బజారులో
అన్ని రంగులూ కొలువుతీరి ఉన్నాయి
ఆ రంగుల్ని పూసే
అప్పటి మిత్రుల చేతివేళ్లే
కొన్ని
కనిపించడం లేదు
చదువుకోండ్రా అంటే
వినని చేతివేళ్లు
హోటళ్లకు నీళ్లు
మోసిన చేతివేళ్లు
సున్నం పనిలో నిచ్చెన మీదినుండి
జారిపడి మంచానికి పరిమితమైన
చేతివేళ్లు
ఆటోనడుపుతున్న చేతివేళ్లు
'అప్పట్నుండీ సెంట్రింగ్ పనేరా'
అని బలహీనంగా నవ్వే చేతివేళ్లు
మట్టిరంగులో కలిసిపోయిన
కొన్ని చేతివేళ్లు
బూడిదరంగు వైపు కరిగిపోయిన
కొన్ని చేతివేళ్లు

★ ★ ★

ఇవ్వాళ కొన్ని రంగుల్ని
ఆకాశంలోకి విసురుతాను
తిరిగివచ్చి
అవి నామీదే పడతాయి
అవి -
వెళ్లిపోయిన చిన్ననాటి మిత్రులు
ఈ హోళీ పండుగ నాడు
పైనుండి నామీదకు విసిరిన
రంగులని
భావించుకుంటాను.

● భగవంతం



రచయిత ఆస్తిగా సాహిత్యం



పదేళ్ళ క్రితం మరణించిన స్పానిష్ రచయిత గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ ఆఖరు నవలను ఆయన అభీష్టానికి భిన్నంగా ఇటీవల ప్రచురించడాన్ని గురించి 'ద టెలిగ్రాఫ్ ఇండియా'లో మార్చ్ 10న 'ఆగస్ట్ టోన్స్' పేరిట ఒక సంపాదకీయం వచ్చింది. ఇది స్థూలంగా రచనల గురించి, వాటి ప్రచురణల గురించి, వాటి ప్రచురణకు సంబంధించిన నైతికత, చట్టబద్ధతల గురించి కొన్ని మౌలికమైన ప్రశ్నలను రేకెత్తించింది.

ఏ 'రచన'నైనా ఒక స్థల కాలాల్లో రాతలో పెట్టబడిన ఆలోచనల సమాహారంగా మనం అంగీకరిస్తే అట్టి రచనల హక్కుల గురించి మాట్లాడుకోవచ్చు. అలా రాయబడిన రచనలు రచయితల ఆస్తిగా పరిణమించాయని తెలుస్తుంది. ఆ విధంగా వారికి కలిగిన ఆస్తి హక్కులు వారు చనిపోయిన తరువాత వారి వారసులకు సంక్రమించడమూ చూస్తున్నాం. చరిత్రలో ప్రచురణకర్తలు బయలుదేరిన తరువాత ఈ హక్కులు మరింత స్థిరత్వాన్ని పొందాయి. మళ్లీ ప్రచురించే హక్కు ఐన కాపీరైట్‌ను రచయిత తన దగ్గరే ఉంచుకోవడమో లేక ప్రచురణకర్తలే కొనుక్కోవడమో జరుగుతూ ఉంది.

రాయడం ద్వారా లేక ప్రచురింపబడడం ద్వారా వచ్చిన ఈ హక్కులు మౌఖిక సాహిత్యానికి లేకపోవడం గమనించాలి. మౌఖిక సాహిత్యం తరతరాలుగా ఒకరి నుండి మరొకరికి, ఒక తరం నుండి మరో తరానికి నోటి ద్వారా అందివ్వబడుతుంది. ఇలా తరతరాలుగా వస్తున్న సాహిత్యానికి కర్తలెవరో చెప్పలేం. ఒకరి నుండి మరొకరికి, మరో తరానికి అందించబడే క్రమంలో కొన్ని మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నందువల్ల కూడా ఇలాంటి సాహిత్యానికి ఒకే కర్తను నిర్ధారించడం కూడా కష్టం. కాలానుగుణంగా మారగలిగే ఈ లక్షణమే మౌఖిక సాహిత్యాన్ని సజీవంగా ఉంచుతుంది. కానీ లిఖిత సాహిత్యానికి అబ్బిన హక్కులు నోటి ద్వారా అందుతున్న ఈ సాహిత్యానికి లేకపోవడం శోచనీయమే. ఇందుకు భిన్నంగా లిఖిత సాహిత్యం ఒక రచయిత పేరుతో ప్రచురింపబడి, తర్వాత ఇక మార్పులు చేర్పులకు వీలులేని స్థిరత్వాన్ని పొందుతుంది.

ఈ నేపథ్యం నుండి చూస్తే ఒక రచయిత తాను చనిపోయిన తరువాత తన రచనలను ప్రచురించవద్దని కానీ, వాటిని ధ్వంసం చేయమని కానీ తన వారసులను ఆదేశించినప్పుడు వారికి అందుకు భిన్నంగా వ్యవహరించే నైతిక హక్కు ఉంటుందా? ఇటీవల మరణించిన ఒడియా రచయిత జయంతా మహాపాత్రా మరణానంతరం ప్రచురించని తన రచనలనన్నింటినీ కాల్చివేయమని వీలునామాలో రాయడం గమనించవచ్చు.

ఈ సందర్భంలో రచయితలు ఆచరించే మరికొన్ని పద్ధతులు రేకెత్తించే మరికొన్ని ప్రశ్నలను మీముందు పెడతాను. కొంతమంది తాము రాసుకున్న రచనలను ప్రచురింపబడిన తరువాత కూడా మార్పులు చేర్పులతో మళ్ళీ ప్రచురిస్తుంటారు. ఒక సారి తన రచన ఒక తీరుగా ప్రచురింపబడి కాపీరైట్ వచ్చిన తరువాత అదే రచనను మార్పులతో ప్రచురించే హక్కు రచయితలకుంటుందా? కొంతమంది వేరే రచయితల ప్రచురింబడిన రచనలలో కొన్ని పాత్రలను తీసుకుని వాటిని తమకు అనుకూలమైన రీతిలో మలుచుకుని, మార్చుకుని తమ పేరుతోనో, పూర్వ రచయిత ప్రభావాన్ని బహిరంగంగా కృతజ్ఞతా భావంతో చెప్పుకుంటూనో ప్రచురిస్తారు. రచన తాలూకు కాపీరైట్ ఇలాంటి పద్ధతి ఒప్పుకుంటుందా? కేశవరెడ్డి హెమ్మింగ్వేను అనుసరించిన తీరు లేవనెత్తిన ప్రశ్నలు తెలుగు పాఠకులకు సుపరిచితమే. ఇక రీరైటింగ్ పేరుతో ప్రసిద్ధ రచనలను కాలానుగుణంగా తిరగ రాసే పద్ధతి ఒక ప్రధాన ప్రక్రియగా పలు భాషల్లో జరగడం మనం చూస్తూనే ఉన్నాం. ఐతే ఇవన్నీ కాపీరైట్ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్టేనా?

ఇక అనువాదాల విషయానికొద్దాం. గొప్ప సాహిత్యంగా పరిగణించబడ్డ రచనలన్నీ ప్రపంచమంతటా అనువాదాల రూపంలో వివిధ భాషల్లోకి అనువదింపబడడం జరుగుతూనే ఉంది. అందులో భాగంగా ఆయా ప్రాంతాల మతాల, రాజకీయ, సాంఘిక పరిస్థితుల ప్రభావంవల్ల, అక్కడక్కడా అనువాదకులు తీసుకొన్న వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబిస్తూ తమదైన రీతిలో వ్యక్తపరచిన రచనలు, తెలుగులో మహాభారతం లాంటి ఉదాహరణలు, అన్ని దేశాల్లో ఉన్నాయి. కాపీరైట్ చట్టం వచ్చిన తర్వాత మూల రచయితల నుండి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితివల్ల ఈ వెసులుబాటు కొంతవరకూ అనువాదకులు కోల్పోయారనే చెప్పాలి.

రచనలు, అవి స్వతంత్ర రచనలైనా, అనువాదాలైనా అవి చేసే వారి మేధోసంబంధమైన శక్తిని, ప్రతిభను వ్యక్తపరచేవిగా, ప్రత్యేక సాంఘిక, రాజకీయ, మరెన్నో ఇతర పరిస్థితులకులోనై ఉద్భవిస్తాయి. కాలప్రవాహంలో ఒక రచన ముందుగానూ, మరొకటి తరువాతా రావొచ్చు. అలాంటప్పుడు తదుపరిగా వెలువడే సాహిత్యాన్ని ముందు వెనుకల నెపంతో, ఆస్తి హక్కుల పరిరక్షణ పేరు విలువలేనిదిగా పరిగణించడం సబబేనా? సాహిత్యాన్ని అమ్మే, కొనే వస్తువుగా పరిగణించడం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పరిణామ పర్యవసానంగా భావించవచ్చా? ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఓపెన్ ఆక్సెస్ వెబ్‌సైట్‌లలో తమ ఆలోచనల్ని పంచుకోవడం అనే పద్ధతి ఈ పరిస్థితులను అధిగమించడానికి సహకరిస్తుందా?

> ఒక రచయిత తాను చనిపోయిన తరువాత తన రచనలను ప్రచురించవద్దని కానీ, వాటిని ధ్వంసం చేయమని కానీ తన వారసులను ఆదేశించినప్పుడు వారికి అందుకు భిన్నంగా వ్యవహరించే నైతిక హక్కు ఉంటుందా?

● ఎమ్. శ్రీధర్

మెతుకు కలల బ్రతుకు పద్యం

కలలకు రంగులు అద్దాలి
కళకు మెరుగులు దిద్దాలి
పడుగు పేక పద్యం
అల్లుతూనే ఉండాలి
పొయ్యి మీది కుండ
పరమాన్నం అయ్యే వరకు

మెతుకు పోగయ్యే వెతుకులాట
ఎప్పుడూ ఒడ్డునపడ్డ చేపపిల్లే

నోరులేని బ్రతుకు
మగ్గంతో మాట్లాడుతుంది
కండెపోగుతో మాట్లాడుతుంది
ఎంత మాట్లాడితే అంత
బువ్వ కూడుతుందని

నగరం చుట్టూ గిరికీలు కొడుతూ
గిరాకీ లేదని
కాలం
మూడు పుష్కరాలు తిన్నది

పని సమంగా పంచుకునే ధర్మనీతి
పాతిపెట్టి
దర్జాగా పెద్దర్వాజా
కలలు ఎత్తుకుపోయే దొంగశాస్త్రం
చదువుతున్నది

బెల్లం లాంటి మాటలకు
ఎత్తిన పిడికిళ్ళు
తలలూపుతున్న చంటి పోరలు
కొడవలి లాంటి ప్రశ్నలు
నక్క జిత్తులకు
నానుతున్న తాబేలు బుర్రలు
సింహం లాంటి వాళ్ళు
రింగు మాస్టర్ ముందు
డూడూ బసవన్నలు

పైసకు కాకపోయినా
పనికి చేయిచాపు నా సోదరులు
తాటాకు చప్పుళ్ళకు
బెదురుతున్న కుందేలు పిల్లలు



నేత కూలీ ఎవుసం
ఎవడు పెట్టిన ఇత్తనమో
పంట
ఎప్పటికీ చేతికి రాదు.

● గజ్జెల రామకృష్ణ
✆ 89774 12795

రసరంజని వార్షికోత్సవం

రసరంజని 31వ వార్షికోత్సవ వేడుకలు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో మార్చి 25 నుంచి 27 వరకు జరుగుతున్నాయి. 25న ప్రారంభ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్, బొల్లినేని కృష్ణయ్య, మామిడి హరికృష్ణ, బుర్రా సాయిమాధవ్ పాల్గొంటారు. 26న రెండవ రోజు కార్యక్రమంలో మాజీ స్పీకర్ యస్. మధుసూదనాచారి, మాడభూషి శ్రీధర్, యం.దివాకరబాబు అతిథులుగా పాల్గొంటారు. 27న ముగింపు సభలో కె.వి. రమణాచారి; తనికెళ్ళ భరణి; డి.యస్.యన్. మూర్తి అతిథులుగా పాల్గొంటారు.

కందిమళ్ళ సాంబశివరావు


అంతఃప్రపంచంలో కవిత్వాన్వేషణ

తన తొలి కవితా సంపుటి 'కుండీలో మర్రి చెట్టు' (1993)తో సున్నితత్వం ఉన్న సుకవిగా గుర్తింపులోకి వచ్చాడు రవిశంకర్. తర్వాత ముప్ఫయ్యేళ్ళ వ్యవధిలో 'వేసవి వాన', 'రెండో పాత్ర', 'మంచు కరిగాక' సంపుటాల్ని వెలువరించాడు. అన్నీ కలిపి ఓ 180 కవితలు, అంతే!

తన మొదటి సంపుటి 'కుండీలో మర్రిచెట్టు'తో ప్రామిసింగ్ పొయెట్‌గా రూఢీ అయిన రవిశంకర్ తదనంతర సంపుటాల లోనూ అదే ఒరవడిని కొనసాగించాడు. ఎక్కడా తొట్రుపడలేదు. దారి తప్పలేదు. తనదైన సున్నితత్వాన్ని కోల్పోలేదు. ఆకాశమే హద్దుగా కొమ్మలూ, రెమ్మలూ, ఊడల్తో దశ దిశలకీ విస్తరించే మర్రి చెట్టు రెక్కల్ని విరిచి కుండీలో అలంకారప్రాయమైన 'మరుగుజ్జు వృక్షం'గా మలచటాన్ని ఇతివృత్తంగా తీసుకొని గొప్ప కవిత నిర్మించాడు. ఇదే పుస్తకంలో తన మాతృమూర్తి మరణానికి కారణమైన వైద్యుడి నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, 'నిన్నెప్పటికీ క్షమించలే' నంటూ రాసిన కవితని చదివినప్పుడు కలిగే అలజడీ అశాంతీ మనల్ని వెంటాడతాయి. రవిశంకర్ కవిత్వం సరళంగా, సూటిగా ఉంటూనే చెరగని అనుభూతి ముద్ర వేస్తుంది. ఏం రాసినా ఒక యెరుక, స్పష్టతతోనే రాశాడు. అపభ్రంశ పదాలూ, వాక్యాల్ని గుప్పించి అయోమయంలోకి నెట్టి, అదే కవిత్వమని భ్రమింప జేయలేదు. అతడికి శబ్దలౌల్యం లేదు. సర్కస్ ఫీట్లు చెయ్యడు. అచ్చమైన వాడుక భాషలో రాస్తాడు.

తనదైన అనుభవాన్ని తన భావనా పటిమతో బలంగా నిర్మిస్తాడు రవిశంకర్. అతడి కవిత్వపు భాష జీవితమంత సరళం. జీవితంలాగే ప్రగాఢం. పొయెట్రీ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్ స్కూల్‌కి చెందిన వాడు. 1980 ప్రాంతాల్లో ఈ అనుభవ కవిత్వానికి కాకినాడే వేదిక! నాకూ, గోదావరిశర్మకి, రవిశంకర్‌కి, శిఖామణికి, రవిప్రకాష్‌కి, చినవీరభద్రుడికి... మా అందరికీ లచ్చిరాజువీధి లోని ఇస్మాయిల్ గారి ఇల్లే సమావేశ స్థలి. ఇస్మాయిల్ ముందుమాటల తోనే నా 'అంతర్నేత్రం', శిఖామణి 'మువ్వల చేతి కర్ర', రవిశంకర్ 'కుండీలో మర్రి చెట్టు' కవితాసంపుటాలు వెలువడటం ఒక విశేషం! నా కవితల్ని ఇస్మాయిల్ తెరచుకున్న పద్యాలు అన్నారు. సాధారణ అంశాల్ని కవిత్వంగా మలిచే క్రమంలో సార్వత్రిక సత్యాలుగా ఆవిష్కరించినప్పుడు, అట్లా ఆవిష్కరించిన పద్యాలు తమ పరిధిని మించిన విస్తృతార్థాన్ని ఇస్తే కనుక అవి తెరచుకున్న పద్యాలని ఇస్మాయిల్ అభిప్రాయం! ఆ అర్థంలో రవిశంకర్ కవితలు కూడా తెరచుకున్న పద్యాలే!

> సాధారణ అంశాల్ని కవిత్వంగా మలిచే క్రమంలో సార్వత్రిక సత్యాలుగా ఆవిష్కరించినప్పుడు, అట్లా ఆవిష్కరించిన పద్యాలు తమ పరిధిని మించిన విస్తృతార్థాన్ని ఇస్తే కనుక అవి తెరచుకున్న పద్యాలని ఇస్మాయిల్ అభిప్రాయం! ఆ అర్థంలో రవిశంకర్ కవితలు కూడా తెరచుకున్న పద్యాలే!



'ఆఖరి మనిషి' కవితలో రవిశంకర్ ఇలా అంటాడు: "క్రమక్రమంగా/ మరణానికి అలవాటు పడటమే/ జీవితంగా మారిపోతుంది./ నటులే కాదు, ప్రేక్షకులు కూడా/ ఒకరొకరుగా నిష్క్రమిస్తారు/ రంగస్థలం మీది విషాదానికి/ కలిసి కన్నీరు పెట్టటానికి/ ఇరువైపులా ఎవరూ కనపడరు." ఆధునిక మానవ జీవన విషాదానికి, బంధాల లోని డొల్లతనానికి ఇంతకి మించి వేరే వ్యాఖ్యానం ఏముంటుంది?

'ఆట' అనే ఇంకో కవితలో- "చుట్టూ మంచు కప్పబడినప్పుడు/ చెట్లు యోగముద్ర దాలుస్తాయి/ అది కరిగాక అదే చెట్ల మీద/ అవే పువ్వులు వలస పక్షుల్లా వచ్చి వాల్తాయి./ అవే వానలు, అవే ఎండలు/ అలాగే కురిసి, మెరుస్తాయి/ రాలే ఆకుల మీద అవే రహస్య హస్తాలు/ రంగు రంగుల సంతకాలు చేస్తాయి." ఒక దృశ్యాన్ని కవిత్వం చేసి అన్యాపదేశంగా చెప్పదలచుకున్న విషయాన్ని చెప్పబూనటమే రవిశంకర్ కవిత్వ లక్షణం! విలియం కార్లోస్ విలియమ్స్ అంటాడు, "కవిత్వాన్ని వినిపించకు. చూపెట్టు" అని! నిజమే కదా! ధ్వనించేది కవిత్వమే కాదు. దృశ్యమానమై ఇంద్రియాల్ని స్పృశించేదే సిసలైన కవిత్వం. కవిత్వానికి రంగూ, రుచీ, వాసనా ఉంటాయి. వాటిని సమర్థవంతంగా పట్టి చూపి, ప్రకటించగలిగిన వాడే కవి! అటువంటి ఆధునిక కవి రవిశంకర్!



సర్వ సాధారణమైన ఒక చిన్న అనుభవాన్ని సార్వత్రిక సత్యంగా మలచి 'మళ్ళీ వసంతం' అనే పద్యం రాశాడు రవిశంకర్. "నిత్యం పరిభ్రమించే భూమి మీద/ ప్రతి జీవికి ఋతువులుంటాయి/ కానీ, ఒక చెట్టును మాత్రమే వసంతం/ మళ్ళీ మళ్ళీ వచ్చి తట్టి పలకరిస్తుంది," అంటాడు.

వర్షంలో చెట్టు గురించి ఇలా రాస్తున్నాడు: "జలజలా కురిసే వానలో/ తలారా స్నానం చేసి/ తడి బట్టలతో సిగ్గుల మొగ్గైన/ పడచు పిల్లలా మెరుస్తుంది."

మంచు కరిగాక కన్పట్టే దృశ్యాన్నిలా కళ్ళకు్కడుతున్నాడు: "పదిలంగా నిన్న మోసిన అడుగుజాడల్ని/ మంచు ఈ రోజు మర్చిపోయింది/ అది వదిలి వెళ్లిన జాడలు మాత్రం/ అక్కడక్కడా మెరుస్తున్నాయి." ఇక్కడ మంచు మనిషికి ప్రతీక! మనిషి గతిస్తాడు. కానీ, అతను వదిలివెళ్లిన జ్ఞాపకాలు అన్నో ఇన్నో ఉంటాయి. ఆ జ్ఞాపకాల్లో అతను జీవించే ఉంటాడు. రాత్రి కురిసి ఉదయానికి కరిగి అదృశ్యమయ్యే 'మంచు'కి శాశ్వతత్వాన్ని ఆపాదిస్తున్నాడు కవి. ఇటువంటి భావలయతోనే అప్పుడే పుట్టిన కూతురి గురించి రాశాడు రవిశంకర్. అమ్మ పోలికతో కూతురు పుట్టటాన్ని, "పెద్దల పోలికలు పిల్లల్లో రావటం వల్ల తర తరాలకి వాళ్ళ జ్ఞాపకాలు పదిలమౌతాయనే" అర్థంలో!

స్థిరంగా, సచేతనత్వంతో, సున్నితమైన కవిత్వాన్ని రాస్తున్న రవిశంకర్, "ఇక ముందు రోజుల కోసం ఒక కొత్త శక్తిని/ సమకూర్చుకొని/ ఇంకొక కొత్త దీపాన్ని వెలిగించే చమురు కోసం/ అంతః ప్రపంచంలో అన్వేషణ సాగించా"లని; "ఈ కారుచీకటిలోకి మిణుగురేదో/ ఒక సంశయాత్మక కాంతి బిందువై/ ప్రవేశించాలి" అని తను అన్నట్టు గానే, తానొక కాంతి బిందువై పఠితల హృదయాలలోకి ప్రవేశించి అనవరతం ప్రసరిస్తూనే ఉండాలని అభిలషిద్దాం!

● రవూఫ్
✆ 98491 93657

నలువైపులా ఒకే దృశ్యం

ప్రతిరోజూ పరీక్షే. బతుకంతా పరుగే.
ఏం బావుకుంటున్నదీ ఎవరికీ అర్థం కాదు.

థర్డ్ డిగ్రీ దెబ్బలు. తకిట తథిమి నృత్యాలు.
ఏ పక్క చెవినీ నోచుకోని హాహాకారాలు.

సర్వం పైసాచికం. బంధాలు కేవలం
బంధనాలు.
ఎవరికెవరూ ఏమీ కారనే ఏకవాక్య
తీర్మానాలు.

విషాదం విడిగా ఉండదు. ముసుగుకూ,
ముస్తాబుకూ అవినాభావ సంబంధం.

స్థల కాలాదులు నిమిత్త మాత్రం. నాటకం
నిత్యకృత్యం. పెదవి అంచు ప్రేమలయందు
జగతి వర్ధిల్లుచున్నది.



● మోహన్ రుషి

కవిత - 2023

సాహితీమిత్రులు, విజయవాడ ప్రతి ఏటా తెస్తున్న కవిత వార్షికల్లో భాగంగా ఈ సంవత్సరం మే 1న వెలువడబోయే 'కవిత 2023' కోసం కవితల ఎంపిక జరుగుతోంది. మా దృష్టికి రాని కవితల కోసం ఆహ్వానం పలుకుతున్నాం. మీరు పంపే కవితలు 2023 జనవరి నుంచి డిసెంబర్ మధ్య ఏదైనా ప్రింట్ లేదా ఆన్‌లైన్ పత్రికలలో ప్రచురితమైనవై ఉండాలి. ఎంపికపై తుది నిర్ణయం సంపాదకులదే. మీ కవితల సాఫ్ట్ కాపీని ఈమెయిల్: editor.kavita2023@gmail.com కు మార్చ్ 30 లోగా మెయిల్ చేయాలి.

సాహితీమిత్రులు

ఉగాది కవిసమ్మేళనం

ఉగాది కవి సమ్మేళనం ఏప్రిల్ 5 ఉదయం 10గంటలకు సిద్దిపేటలోని కొత్త బస్టాండ్ దగ్గర శివానుభవ మంటపంలో జరుగుతుంది. పాల్గొన్న కవులు కవయిత్రులకు 'శ్రీ వేముగంటి నరసింహాచార్యుల ఉగాది పురస్కారం' ప్రదానం చేయబడును. అన్ని ప్రాంతాల వారు పాల్గొనవచ్చు.

వెన్నెల సాహితీ సంగమం

"కులంతో ముడిపడిన ప్రతీ జీవన సందర్భం నాకు కథావస్తువే"



పసునూరి రవీందర్ • పలకరింపు

దళితకథా సాహిత్యంలో సైతం తనదైన వస్తువుతో ఆధునిక దళిత జీవితాలను ఆవిష్కరిస్తున్న పసునూరి రవీందర్ కథలు ఇప్పటికే హిందీ, కన్నడ భాషలలోకి అనువాదం అయ్యాయి. తాజాగా పాంథర్స్ పా పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో అతని మొదటి కథా సంపుటి 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' (కె. దామోదర్రావు సారథ్యంలో) ఇంగ్లీషులోకి అనువాదం అయ్యింది. ఈ సందర్భంగా పసునూరి రవీందర్ పలకరింపు...

దళిత కథను పట్టణ బాట పట్టించిన మీకు... ఆ కోణంపై పట్టు ఎలా దొరికింది?

ఇందుకు నా నేపథ్యమే కారణం. నేను పుట్టి పెరిగిన సెమీ అర్బన్ జీవితమే కారణం. నాకంటే ముందు దళిత సాహిత్యకారులంతా గ్రామం తాలూకు కుల వివక్ష మీద దృష్టిసారించారు. నేను పట్టణంలో జీవిస్తుండడం వల్ల ఇక్కడ దళితులు ఎదుర్కునే వివక్ష అర్థమైంది. అందుకే ఈ పట్టణకేంద్ర వివక్షను వస్తువుగా ఎంచుకున్నాను. గ్రామాల్లో అనేక అవమానాలు పడి పట్టణాలకు వచ్చిన దళితులను పట్టణాలు, నగరాలు సైతం ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. ఈ జీవితాన్ని అనుభవిస్తే తప్ప దాన్ని రాయలేం. అట్లా నేను రెండు దశాబ్దాలుగా నగరంలో చూస్తున్న కుల వికృత పోకడలను కథలుగా మలుస్తున్నాను. ఇందుకోసం నేను పెద్దగా వెతుక్కోవాల్సిన పరిస్థితేమీ లేకుండానే కులం నెట్వర్క్ నన్ను వైఫైలా వెంటాడుతూనే ఉంది.

ఇటీవల మీ రెండవ కథా సంపుటి 'కండీషన్స్ అప్లయ్'లో వస్తు విస్తృతి గురించి?

ఇందులో 19 కథలు ఉన్నాయి. దీనిని లిఖిత ప్రెస్ ప్రచురించింది. పట్టణకేంద్ర కుల వివక్షతతో పాటు దళిత కన్నీళ్లు కష్టాలే కాదు, దళిత సంస్కృతి, దళిత విజయాలు కూడా నమోదు చేయాలనే స్పృహతో నేను ఈ కథలు రాశాను. ముఖ్యంగా తెలంగాణ అవతరణ అనంతరపు పరిస్థితుల మీద కూడా కథలు ఉన్నాయి. అలాగే ఆధునికత పేరుతో అభివృద్ధి మాత్రమే కాదు ధ్వంసమవుతున్న మానవ సంబంధాల తాలూకు ప్రతిఫలనాలు సైతం నా కథావస్తువులుగా మారాయి. నేను రాయకుండా ఉండలేని ఇతివృత్తాలు ఇవి. రోజురోజుకు విస్తరిస్తున్న కులజాడ్యపు జబ్బు ఇప్పుడు పట్టణాల్లో సైతం తిష్ట వేయడమే అందుకు కారణమని నమ్ముతాను.

ఎక్కువగా ఇంగ్లీష్ టైటిల్స్ పెడుతుంటారు... దళిత సాహిత్యం లేదా దళిత పాఠకులు ఆ స్థాయి చైతన్యాన్ని కలిగి ఉన్నారనా మీ ఉద్దేశ్యం?

నా ఉద్దేశ్యం అది కాదు. కాకుంటే ప్రత్యామ్నాయ పంథాను సృష్టించడంలో ఇది కూడా ఒక ఎత్తుగడగా నేను భావిస్తున్నాను. సాంస్కృతిక పరాయికరణ ప్రభావం దళిత రచయితల మీద కూడా చాలా ఉంది. దళితులకు సొంత కల్చర్ ఉంది. అది వారి జీవన విధానం నుండి వచ్చింది. ఆ మూలవాసీ తాత్విక భూమికతో కూడిన శీర్షికలు పెట్టాలి. కాకుంటే పాఠక లోకం దళిత సాహిత్యాన్ని గురించి అంత ఆసక్తి చూపి అర్థం చేసుకుంటుందని నేను అనుకోను. ముఖ్యంగా ఈ తరం చదవాలంటే ఈ రకమైన టైటిల్స్ తప్పవు. అలాగే నా ఇతివృత్తానికి సరిపడే టైటిల్ ఇంగ్లీషులో దొరికితే దానిని పెట్టడం వల్లనే పాఠకులకు ఎక్కువగా రీచ్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

> రానున్నదంతా బహుజన సాహిత్య యుగమే. దళితుల్లో రచనలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్త కలాలు, గళాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు కారణం అంబేద్కరిస్టు చైతన్యమే. సాహిత్య రంగంలో తిష్టవేసుకున్న విశ్రాంతవర్గాల సాహిత్యం ఆగిపోనుంది. కింది కులాల నుండి ఎదిగి వస్తున్న విద్యావంతులు సాహిత్య ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరపు పరిస్థితుల ప్రభావం మీ కథలపై ఎలా ఉంది?

తెలంగాణకు ముందైనా, తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరమైనా దళితుల జీవితాల్లో పెద్దగా మార్పు వచ్చిందేమీ లేదు. చితికిపోయిన అమరవీరుల కుటుంబాల దైన్య స్థితి మీద, నిరుద్యోగుల గోసల మీద సైతం నేను దళిత నేపథ్యం నుండి రాస్తున్నాను. ముఖ్యంగా కులంతో ముడిపడిన ప్రతీ జీవన సందర్భం నాకు కథావస్తువే. అది రాసేవరకు నా వెంటపడుతూనే ఉంటుంది. అట్లా నిత్యం ప్రతీచోట కులం వల్ల బాధింపడే బాధితులంతా నా కథల్లోని పాత్రలుగానే మారుతుంటారు. ముఖ్యంగా దళితుల మీద పెరిగిపోతున్న దాడులు సైతం ఇంకా రాయాల్సే ఉంది.

కథా ప్రక్రియే గాక కవిత్వం, పాట, పరిశోధన, విమర్శ వంటి ప్రక్రియల్లో మీరు ఏకకాలంలో రచనలు చేయడం గురించి చెప్పండి?

ఈ ప్రక్రియలేవి కావాలని ఎంపిక చేసుకొని రాస్తున్నవి కావు. నేను బేసికల్లీ సామాజిక కార్యకర్తను. ఉద్యమ అవసరాల్లో భాగంగా ఏది అవసరమైతే అది రాస్తున్నాను. ఇక సఫలం, విఫలం అనేది పాఠకులు చెప్పాలి. నేను వందకు పైగా పాటలు రాశాను. విమర్శ మీదే ఎంఫిల్, పీహెచ్డీ చేశాను. అలాగే చాలామందిలాగే నేను కూడా మొదట కవిత్వమే రాశాను. ఆ తరువాతే మిగిలినవి రాసుకుంటూ వచ్చాను. ఇట్లా ఆయా ప్రక్రియల్లోకి ప్రవేశం అనేది నాకు తెలియకుండానే జరిగిపోయింది. ఇప్పటికి కూడా సామాజిక ఉద్యమ అవసరాల్లో భాగంగా నా వంతు పాత్ర పోషించడం కోసమే రాస్తాను.

దళిత కథ గమ్యం - గమనం ఎలా ఉన్నాయి?

రానున్నదంతా బహుజన సాహిత్య యుగమే. దళితుల్లో రచనలు చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. కొత్త కలాలు, గళాలు పుట్టుకొస్తున్నాయి. ఇందుకు కారణం అంబేద్కరిస్టు చైతన్యమే. సాహిత్య రంగంలో తిష్టవేసుకున్న విశ్రాంతవర్గాల సాహిత్యం ఆగిపోనుంది. కింది కులాల నుండి ఎదిగి వస్తున్న విద్యావంతులు సాహిత్య ప్రాముఖ్యతను గుర్తిస్తున్నారు. ముఖ్యంగా సాహిత్యంలో తమ పేజీని వెతుక్కుంటున్నారు. తొంభయవ దశకంలో జి.లక్ష్మీ నర్సయ్య, త్రిపురనేని శ్రీనివాస్ వంటి వారు వేసిన మార్గాన్ని మరింత పటిష్టం చేస్తున్నారు. ఇటీవల సంగిశెట్టి శ్రీనివాస్, గుడిపల్లి నిరంజన్ సంపాదకత్వంలో 'తెలంగాణ దళిత కథ' అనే బృహత్ కథా సంకలనం వెలువడింది. మూడేళ్లుగా దళిత కథా వార్షిక వెలువడడం కొత్త చరిత్ర. అలాగే జిలుకర శ్రీనివాస్ 'బైండ్ల చంద్రయ్య' వంటి కథలు వచ్చాయి. సామాజిక బాధ్యతతో కూడిన దళిత కథకు ఇది వికసన దశ అని చెప్పవచ్చు.

✆ 77026 48825

ఆంధ్రజ్యోతి



ఎన్నికల వేళ ఓటర్ల ఆదరణ ఎంత ముఖ్యమో రాజకీయ వ్యూహం కూడా అంతే ముఖ్యం. దీన్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ పావులు కదుపుతోంది. కీలక నేతల మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. అఖండ విజయానికి అన్ని అవకాశాలనూ ఒడిసిపడుతోంది. పార్టీకి దూరంగా ఉంటూ ఓటర్లను ప్రభావితం చేయగలిగే నేతలను కలిసి గెలుపునకు కృషి చేయాలని కోరుతోంది. ఈ క్రమంలోనే విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని.. యలమంచిలి రవితో భేటీ అయ్యారు. మైలవరం అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్.. బొమ్మసాని సుబ్బారావును కలిశారు.

రా.. రమ్మని..!

కీలక నేతలపై టీడీపీ దృష్టి

- యలమంచిలి రవితో చిన్ని భేటీ
- ఇప్పటికే టీడీపీలో చేరిన బొప్పన
- తూర్పులో గెలుపే లక్ష్యంగా చిన్ని పావులు
- బొమ్మసాని ఇంటికి వసంత కృష్ణ ప్రసాద్



యలమంచిలికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కేశినేని చిన్ని

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ తూర్పు నియోకవర్గ వైసీపీ నేత యలమంచిలి రవితో విజయవాడ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఆదివారం భేటీ అయ్యారు. రవికి తూర్పు నియోజకవర్గంలో మంచి పట్టు ఉంది. 2009లో విజయవాడ తూర్పు నుంచి ప్రజారాజ్యం అభ్యర్థిగా రవి గెలుపొందారు. 2019 ఎన్నికలకు ముందు యలమంచిలి రవి వైసీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి ఉన్నా చివరి నిమిషంలో ఆయన స్థానంలో బొప్పన భవకుమార్ పేరు ఖరారైంది. అప్పటి నుంచి వైసీపీలోనే ఉన్నా క్రియాశీలకంగా లేరు. ఈ నేపథ్యంలో రవితో చిన్ని భేటీ రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తూర్పులో గెలుపే లక్ష్యంగా చిన్ని పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా నియోజకవర్గంపై పట్టు ఉన్న నాయకులను టీడీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడిగా ఉన్న బొప్పన భవకుమార్‌ని టీడీపీలోకి తీసుకొచ్చిన చిన్ని తాజాగా రవిపై దృష్టి సారించారు. ఆదివారం రవిని కలిసి టీడీపీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. దీనికి రవి సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. తూర్పు నియోజకవర్గంలో కీలక ప్రాంతాలైన గుణదల, కృష్ణలంక ప్రచార బాధ్యతలను భవకుమార్, రవికి అప్పగించాలని భావిస్తున్నారు.

● బొమ్మసానితో వసంత..

మైలవరం నియోజకవర్గంలోనూ ఆదివారం ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. మైలవరం టికెట్ ఆశించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావుతో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ సమావేశమయ్యారు. గొల్లపూడిలోని బొమ్మసాని నివాసానికి వచ్చిన వసంత సుమారు గంటపాటు భేటీ అయ్యారు. బొమ్మసానితోపాటు మైలవరం టీడీపీ టికెట్ ఆశించిన గన్నె ప్రసాద్ ఇప్పటికే వసంతకు మద్దతుగా నిలిచారు. త్వరలోనే దేవినేని ఉమాతో సమావేశమవుతానని, తనకు ఆయనతో ఎలాంటి విభేదాలూ లేవని వసంత స్పష్టం చేశారు. అందరం కలిసి మైలవరంలో టీడీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తామన్నారు.

మైలవరంను చంద్రబాబుకు కానుకగా ఇస్తాం

● వసంత, బొమ్మసాని

గొల్లపూడి : మైలవరంలో టీడీపీ జెండా ఎగురవేసి చంద్రబాబు నాయకుడికి కానుకగా ఇస్తామని ఉమ్మడి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు స్పష్టం చేశారు. ఆదివారం వసంత గొల్లపూడిలో బొమ్మసాని నివాసంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ తనకంటే వయస్సులో పెద్దవారైన బొమ్మసాని సుబ్బారావుతో పాటు ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు వెళతానన్నారు. బొమ్మసాని మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు ఉమ్మడి అభ్యర్థిగా వసంత విజయానికి కృషి చేస్తామన్నారు. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి అందరం కలిసి పని చేస్తామన్నారు.



బొమ్మసాని సుబ్బారావుతో మైలవరం కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

● వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు : టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. టీడీపీ పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ ఆదివారం రాజేంద్రప్రసాద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపుకోసం ఐక్యంగా కృషి చేసి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేద్దామన్నారు. పెనమలూరు అభ్యర్థిగా పోటీలో ఉన్న బోడె ప్రసాద్‌కు సహాయ సహకారాలుంటాయన్నారు.



బోడె ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

విజయవాడ వెస్ట్ నుంచి సుజనా?

అవనిగడ్డ కూటమి అభ్యర్థిపై ఉత్కంఠ



యలమంచిలి సుజనా చౌదరి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా సుజనా చౌదరి పేరు తెరపైకి వచ్చింది. పొత్తుల్లో భాగంగా విజయవాడ పశ్చిమను తొలుత జనసేనకు కేటాయించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఈ స్థానాన్ని బీజేపీకి ఇచ్చారు. ఈ స్థానం నుంచి బీజేపీ తరఫున పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చినా చివరికి యలమంచిలి సుజనాచౌదరి వైపు పార్టీ పెద్దలు మొగ్గు చూపినట్టు సమాచారం. సుజనా చౌదరి ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందినవారు. ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచి ప్రారంభమైంది. ఆ పార్టీ తరఫున ఆయన రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరారు. మరోవైపు అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ఇక్కడి నుంచి రేసులో ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ బొబ్బా గౌతమ్, అప్పికట్ల అప్పారావు, మాదివాడ వెంకట కృష్ణ రామాంజనేయులు ఉన్నారు. వీరిలో విక్కుర్తి శ్రీనివాస్, అప్పికట్ల అప్పారావు, ఎంవీకే రామాంజనేయులు కాపు సామాజికవర్గానికి చెందిన వారు. రామాంజనేయులు కన్వర్టెడ్ క్రిస్టియన్. బొబ్బా గౌతమ్ కమ్మ సామాజికవర్గానికి చెందినవారు. ఈ రెండు స్థానాలతోపాటు మచిలీపట్నం పార్లమెంటు స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఈ స్థానం నుంచి వల్లభనేని బాలశౌరి పేరును ప్రకటించాల్సి ఉంది. ఈ మూడు స్థానాలపై రెండు మూడు రోజుల్లో స్పష్టత రానుంది.



క్షయ నిర్మూలనా ర్యాలీ

ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆదివారం పాత ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీని రాష్ట్ర టీబీ నివారణ అధికారి, మెడికల్ అండ్ హెల్త్ కుటుంబ సంక్షేమ శాఖ జేడీ డాక్టర్ టి.రమేష్ జెండా ఊపి ప్రారంభించి ప్రసంగించారు.

బస్టాండ్‌లో భద్రతా వైఫల్యం!

పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) సంఘ విద్రోహ శక్తులకు నిలయంగా మారిపోయింది. ప్రయాణికులు కదలాల్సిన చోట గంజాయి సేవించిన బ్లేడ్ బ్యాచ్ ఉన్మాదంతో హల్‌చల్ చేస్తోంది. మత్తులో వికృతకాండకు పాల్పడుతోంది. బస్టేషన్‌లో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులపై విచక్షణారహితంగా తెగపడుతోంది. తాజాగా ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దుస్తులు విప్పి సామూహికంగా దాడి చేయటమే కాకుండా సూపర్‌వైజర్‌పై బ్లేడ్‌తో మూక దాడి చేసింది. కంట్రోలర్‌ను కొట్టేందుకు ఏకంగా ఆర్టీసీ కంట్రోల్ రూమ్ పాయింట్‌పైకే వెళ్లింది. అడ్డొచ్చిన పోలీసులతో కూడా బాహాబాహీకి తలబడింది.



దాడిలో గాయాలపాలైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి



ఆర్టీసీ కంట్రోల్‌రూమ్‌పై దాడికి తెగపడుతున్న బ్లేడ్ బ్యాచ్

ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌పై బ్లేడ్ బ్యాచ్ దాడి

» సూపర్ వైజర్‌పై బ్లేడ్‌తో హల్‌చల్... పోలీసులపైనా ప్రతాపం
» ఆర్టీసీలో విజిలెన్స్ విభాగంలో.. పనిచేయని సెక్యూరిటీ వ్యవస్థ
» భద్రతా వైఫల్యాలతో పేట్రేగిపోతున్న బ్లేడ్ బ్యాచ్

అవుట్ సోర్సింగ్ సిబ్బంది దుస్తులు విప్పి దాడి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పీఎన్‌బీఎస్‌లో కొంత కాలంగా బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు తిష్టవేశారు. రైల్వేస్టేషన్‌లో తిష్టవేసిన ఈ బ్లేడ్ బ్యాచ్‌పై అక్కడ ఉక్కుపాదం మోపటంతో పీఎస్‌బీఎస్‌కు మకాం మార్చారు. మహిళా ప్రయాణికుల బాత్రూమ్‌లలోకి చొచ్చుకుపోయి తలుపులు పగులగొట్టి వారిని జుట్టుపట్టుకుని బయటకు లాగుతున్నారు. ఎంతోమంది బాధిత మహిళా ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒంటరి మహిళా ప్రయాణికులను రౌండప్ చేసి బ్లేడ్లు చూపి భయపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. కిందటి మంగళవారం ఇద్దరు గంజాయి సేవించి ఆ మత్తులో కంట్రోల్ రూమ్‌లోకి చొరబడ్డారు. ఒకరిని ఒకరిని కొట్టుకుంటూ అనౌన్సర్‌పై పడ్డారు. ఆర్టీసీ సిబ్బంది అంతా కలిసి వారిద్దరినీ పట్టుకుని అవుట్‌పోస్ట్‌లో అప్పగించారు. అర్ధగంట తమ దగ్గర ఉంచుకుని వారిని వదిలేశారు. ప్రతిరోజూ నిర్ణీత సమయాల్లో పీఎన్‌బీఎస్‌లో విధులు నిర్వహించే కంట్రోలర్లు సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో ప్రయాణికులు కాని వారిని బస్టేషన్ నుంచి ఖాళీ చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి కూడా హల్‌చల్ చేస్తున్న బ్లేడ్ బ్యాచ్‌ను తరిమే ప్రయత్నం చేయగా.. అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఇద్దరినీ అక్కడికక్కడే బ్లేడ్ బ్యాచ్ సభ్యులు రౌండప్ చేశారు. వారి బట్టలు విప్పి విచక్షణారహితంగా కొట్టారు. ఏక కాలంలో యాభై మందికిపైగా బ్లేడ్‌బ్యాచ్ దాడి చేయటంతో ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి దెబ్బలకు తాళలేక పారిపోయాడు. వీరిని పర్యవేక్షించే సూపర్ వైజర్ వైఎస్ రావు ప్రతిఘటించగా.. ఆయనపై బ్లేడ్‌తో దాడి చేశారు. వీరందరినీ కంట్రోలర్ పంపించాడన్న సమాచారంతో ఏకంగా కంట్రోల్‌రూమ్‌పై దాడికి వచ్చారు. ఓ అరడజను మంది యాచకులను కూడా తీసుకొచ్చి కంట్రోలర్‌ను కొట్టబోగా ఇద్దరు పోలీసులు అడ్డగించారు. వారిపై కూడా బ్లేడ్ బ్యాచ్ కలబడింది. ప్రయాణికులు బెంబేలెత్తిపోయారు.

● అడుగడుగునా భద్రతా వైఫల్యాలు

ఆర్టీసీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కింద పనిచేసే సెక్యూరిటీ వ్యవస్థ గాడి తప్పింది. ఈ విభాగానికి రాష్ట్రస్థాయిలో ఒకప్పుడు ఐపీఎస్ అధికారి బాస్‌గా ఉన్నారు. ఇప్పుడు ఆర్టీసీ అధికారులే బాస్‌గా ఉంటున్నారు. జోన్ స్థాయిలో డీఎస్పీ స్థాయి ర్యాంకు కలిగినవారు ఉండేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.మొత్తం 20 మంది వరకు ఉన్నా ఎవరు ఎక్కడ ఉంటున్నారో కూడా తెలియదు. ఉన్నతాధికారుల సేవల్లో మునిగిపోతున్నారు తప్పితే.. బస్‌స్టేషన్ పర్యవేక్షణను గాలికొదిలేశారు.

● అవుట్‌పోస్టు ఉన్నా.. వేస్ట్

బస్టేషన్‌లో పోలీసు అవుట్‌పోస్టు ఉంది. పేరుకు అవుట్‌పోస్టు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. ఇక్కడ మూడు షిఫ్టులలో పనిచేయటానికి నామమాత్రపు సిబ్బందినే పోలీసులు పంపిస్తున్నారు. వచ్చినవారు ఒకటీ, రెండు ఫొటోలు తీసుకుని ఆ తర్వాత డార్మిటరీల్లోకి వెళ్లి పడుకుంటున్నారు. పోలీసుల నిఘా పర్యవేక్షణ కూడా పూర్తిగా కొరవడింది. బస్టేషన్‌లో అసాంఘిక శక్తులతో సంబంధాలను కలిగి ఉంటున్నారన్న ఆరోపణలు కూడా విధులు నిర్వహించే పోలీసులపై ఉన్నాయి. పిక్ పాకెటర్స్‌తో కూడా సంబంధాలు ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో తిష్టవేసిన బ్లేడ్ బ్యాచ్‌తో కూడా సంబంధాలున్నందునే.. వారిని అర్ధగంటలోనే వదిలేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అవుట్‌పోస్టులో సీసీ టీవీ ఫుటేజీలు ఉంటాయి. గొడవ జరుగుతుంటే.. తక్షణం స్పందించాల్సిన పోలీసులు పక్కనే ఉన్నా గంటకు కూడా రాలేదు. అవుట్‌పోస్టులోనే నిద్రపోతుండటం వల్ల వీరు రాలేదని తెలుస్తోంది.

● ప్రైవేటు సెక్యూరిటీ తొలగింపు

బస్టేషన్‌లో గతంలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు కూడా ఉండేవారు. గత ప్రభుత్వ హయాంలో భద్రతకు పెద్దపీట వేయటం వల్ల పీఎన్‌బీఎస్‌లో 60 మంది సెక్యూరిటీ గార్డులను నియమించేవారు. నాలుగేళ్ల కిందట ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రైవేటు సెక్యూరిటీని కుదించేశారు. అరవై నుంచి 45కు ప్రైవేటు సెక్యూరిటీని తగ్గించారు. ఆ తర్వాత క్రమక్రమంగా సెక్యూరిటీని తగ్గించేస్తూ వచ్చారు. చివరగా అసలు ప్రైవేటు సెక్యూరిటీనే లేకుండా చేశారు.

బస్టేషన్‌లో గొడవ చేసింది యాచకులే

● కృష్ణలంక సీఐ ఆకుల మురళీకృష్ణ

బస్టేషన్ : విజయవాడ పండిట్‌నెహ్రూ బస్సు స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది, పోలీసులపై గొడవ చేసింది యాచకులేనని కృష్ణలంక సీఐ ఆకుల మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటలకు బస్టేషన్‌లో యాచకులు, బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది, పోలీసులపై దాడి చేశారు. ఈ ఘటనపై సీఐ తన ఛాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసు సిబ్బంది బస్సుస్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలుసుకుని కొందరిని విచారించినట్టు తెలిపారు. రాత్రివేళలో యాచకులు బస్టేషన్‌లోని బల్లలపై నిద్రపోతున్నారని వారిని ఆదివారం తెల్లవారుజామున బస్టేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సాంబయ్య నిద్రలేపుతూ అతని వద్ద ఉన్న లాఠీతో ఓ వ్యక్తిని కొట్టాడని తెలిపారు. ఆ వ్యక్తికి కాలి గాయంపై లాఠీ తగలడంతో గాయం మరింత అయింది. దీంతో బాధితుడు సాంబయ్యతో వాదనకు దిగాడు. ఈ విషయం తెలుసుకున్న బస్టేషన్‌లోని మిగిలిన యాచకులందరూ సాంబయ్యతో గొడవపడ్డారు. పోలీస్‌సిబ్బంది పలువురిని విచారించినట్టు తెలిపారు. గొడవకు దిగింది యాచకులే తప్ప బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు కాదని సీఐ తెలిపారు.



మాట్లాడుతున్న కృష్ణలంక సీఐ ఆకుల మురళీకృష్ణ

భజనచంద్ర సామిభక్తి!

సామినేని ఉదయభాను కోసం క్యాంపు ఆఫీసు ఏర్పాటు

- రూ.10 లక్షల వ్యయంతో కార్పొరేట్ హంగులతో క్యాంపు కార్యాలయం
- పంచాయతీల నుంచి అక్రమంగా వసూళ్లు చేసిన డబ్బుతో హంగులు



సామినేని ఉదయభాను కోసం జయచంద్ర అభివృద్ధి చేసిన క్యాంపు ఆఫీసు, (ఇన్‌సెట్‌లో) జయచంద్ర

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఒక జిల్లా అధికారి అయి ఉండి కూడా అధికార వైసీపీకి వీర భజన చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా డీపీవో జయచంద్ర గాంధీ 'సామి'భక్తికి అంతూ పొంతూ లేకుండా పోతోంది. తాను డీపీవో కాగానే ఉద్యోగుల గ్రూపులో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానును సర్దార్‌గా అభివర్ణిస్తూ తనకు పోస్టింగ్ ఇప్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆయన ఎంపీడీవోగా ఉండగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే కోసం ఏకంగా క్యాంపు ఆఫీసును కట్టించిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే కోసం చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన మండల మానవ వనరుల కేంద్రం భవనంలో సామినేని ఉదయభాను క్యాంపు ఆఫీసును అభివృద్ధి చేశారు. దీని కోసం రూ.10 లక్షల వరకు వ్యయం చేసినట్టు సమాచారం. ఈ డబ్బులను కూడా పలు పంచాయతీల నుంచి అక్రమంగా తెప్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఖరీదైన ఫర్నీచర్, సీలింగ్, ఫ్లోరింగ్, లైటింగ్, ఏసీ వంటి అనేక సదుపాయాలను ఏర్పాటు చేయించారు. తన మీద చర్యలు తీసుకోకుండా ఉండటం కోసం ఉన్నత స్థాయిలో అధికార పెద్దల ద్వారా జిల్లా యంత్రాంగంపై ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. మరోవైపు జగ్గయ్యపేట వైసీపీ అభ్యర్థి కోసం రహస్యంగా కార్యకర్తలా పనిచేస్తున్నారు. డీపీవో జయచంద్ర పూర్వం సాగించిన అనేక వైసీపీ అనుకూల ప్రచారాలు పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చేశాయి. డీపీవో జయచంద్ర గాంధీ వ్యవహారాలు జిల్లా ఎన్నికల యంత్రాంగానికి కూడా తలనొప్పిగా మారాయి. ఆయనపై వేటుకు రంగం సిద్ధమైనట్టు తెలిసింది.

వైసీపీ నేతల చేతివాటం

సీఎం జగన్, భారతి తెలుసంటూ సెంట్రల్ చోటా నేతల దందా

- రైతు బజారులో షాపులు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు

- 6లో..



- 6లో..

రసరమ్యం భామా కలాపం

» ఏడు పదుల వయసులో సత్యభామగా రాధేశ్యామ్

గొల్లనపల్లిలో వైసీపీ నేతల ప్రలోభాల పర్వం

యువతను దగ్గర చేసుకునేందుకు మందు, విందు ఏర్పాట్లు

- 6లో..

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (సోమ)
సహర్ (ఉదయం) : 4-56 (మంగళ)



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

సుబ్బారాయుడిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి, న్యాయాధికారులు

మోపిదేవి, మార్చి 24 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వి.ఎన్.బట్టి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఈవో ఎస్.ఎస్.చక్రధర రావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తికి అందజేశారు. జిల్లా న్యాయాధికారులు అరుణ సారిక, ఏడి.జె.చిన్నబాబు, నరసింహమూర్తి, పద్మ, ఉదయ రాజన్ ప్రకాష్ తదితరులు వారి వెంట ఉన్నారు.



వైభవంగా వేణుగోపాలుని శేషవాహన మహోత్సవం

గంపలగూడెం : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి శేషవాహన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలచార్యుల ఆధ్వర్యంలో స్వామి శేషవాహనదారుడై గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శమనిచ్చారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద స్వామి అమ్మవార్లకు ఎదుర్కోల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, ఎన్వీ సాంబశివరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, మార్చి 24 : ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ సోమవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద నుంచి ప్రారంభమవుతున్నట్టు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించిన వాహనంపై ఉంచి లఘుపూజలు చేసి బలిహరణలిచ్చిన అనంతరం హారతి సమర్పిస్తారు. భక్తుల కోలాహలం మధ్య మంగళవాయిద్యాల నడుమ గిరిప్రదక్షణ బయలుదేరుతుంది. సుమారు 7 కిలోమీటర్ల నిడివిలో గిరిప్రదక్షణ సాగుతుంది.

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి గొల్లపూడికి చెందిన బూర్లే వెంకట శివనాగ చైతన్య ఆదివారం ఆలయానికి విచ్చేసి రూ.1,01,116 విరాళం ఇచ్చారు. అలాగే మాచవరానికి చెందిన మారోజు దేవి మల్లేశ్వరి ఆలయానికి విచ్చేసి రూ.1,01,116 విరాళంగా ఇచ్చారు. దర్శనానంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

సూర్యోపాసన సేవ



దుర్గగుడిలో లోకకల్యాణార్థం, సకల జనుల ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ సంకల్పం చెప్పి సూర్యారాధన చేశారు. అర్చకులు సూర్యనమస్కారాలు, అరుణపారాయణ నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



మయూరి బృంద నాట్య ప్రదర్శన

రసరమ్యం 'భామా కలాపం'

▸▸ ఏడు పదుల వయసులో సత్యభామగా రాధేశ్యామ్



కూచిపూడి, మార్చి 24 : బాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఐదవ రోజైన ఆదివారం కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ తమ శిష్య బృందంతో ప్రదర్శించిన భామాకలాప సాంప్రదాయ నృత్య రూపకం అలరించింది. ఏడు పదుల వయస్సులో (స్త్రీ వేషధారణలో) రాధేశ్యామ్ 'భామనే సత్యభామనే' అంటూ హోయలొలికిస్తూ నేటితరం కళాకారుల్లో స్ఫూర్తిని నింపారు. వేదాంతం సత్యనరసింహశాస్త్రి, కురవి సుబ్రహ్మణ్యం, వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్ తదితరుల నృత్య ప్రదర్శన అబ్బుర పర్చింది. ఈ సందర్భంగా తిరుమల కళ్యాణి కామాక్షి దరువుతో రంజింపచేశారు. స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్‌కు చెందిన లక్ష్మీప్రసూన, రమణి సిద్ధి శిష్య బృంధం కుంజాదళాయతాక్షి, పరువు తేనెల తల్లి కులుకగ నడవరో అంశాలతో మెప్పించారు. అనంతరం కళాకారులను రాధేశ్యామ్, చింతా రవిబాలకృష్ణ, కావూరి భానుమూర్తి, వై.ఫణికుమార్, ఆలయ పాలకమండలి సభ్యులు మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టండి

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



కృష్ణలంక, మార్చి 24 : ప్రలోభాలకు అడ్డుకట్టవేసి, నిష్పక్షపాత వాతావరణంలో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్)ను సమర్థవంతంగా అమలుచేయడంపై ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు సూచించారు. ఆదివారం క్యాంపు కార్యాలయం నుంచి ఆర్వోలు, ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాల నోడల్ అధికారులతో ఎలక్షన్ సీజర్లపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తొలుత ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సీజర్ల వివరాలను తెలియజేశారు. ఈనెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సుమారు రూ.1.27 కోట్ల నగదు, 2,503 లీటర్ల మద్యం, 4,100 గ్రాముల మత్తు పదార్థాలు, 7,139 గ్రాముల విలువైన లోహాలు తదితరాలను సుమారు రూ.3.60 కోట్ల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేసినట్టు వివరించారు. ఈఎస్ఎంఎస్ యాప్‌లో సీజర్లకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా ఖచ్చితత్వంతో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోజువారీ సమాచారాన్ని సంబంధిత నియోజకవర్గాల ఆర్వోలకు కూడా పంపాలన్నారు. నివేదికల రూపకల్పనపైనా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జేసీ పి.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్.భవానీశంకర్, కె.మాధవి, రవీంద్రరావు, ఏడీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు, ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు

హోలీ పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కలెక్టర్ ఢిల్లీరావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సంప్రదాయ బద్ధంగా రసాయన రహిత రంగులతో జరుపుకోవాలన్నారు. ప్రతీఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా..

▸▸ వెనిగండ్ల హామీ

గుడివాడ/గుడివాడ రూరల్, మార్చి 24 : గుడివాడను అభివృద్ధి బాటలో నడిపే బాధ్యత తీసుకుంటున్నట్టు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం మల్లాయిపాలెం పరిధిలోని అలంకృత ఫంక్షన్ హాలులో జనసేన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, కొడాలి నాని కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ ఎదుగుదల కోసం కుయుక్తులు పన్నుతున్నాడని, విగ్రహ రాజకీ



వెనిగండ్ల రాము సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నేతలు, కార్యకర్తలు

యాలు చేసి అన్ని రకాలుగా కుతంత్రాలు చేస్తున్నాడని ఆరోపించారు. జనసేన, టీడీపీ నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తూ నాని ఆటలు గుడివాడలో సాగనివ్వకుండా కట్టడి చేద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, వైసీపీ నాయకులు చేసే కుతంత్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ) మాట్లాడుతూ, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో జనసేన నేత బూరగడ్డ శ్రీకాంత్, శాయన పుష్పావతి, దింట్యాల రాంబాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధే లక్ష్యం : మాగంటి బాబు

ఆరాచక, విధ్వంసకర పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని, ముస్లింల అభ్యున్నతి, అభివృద్ధే టీడీపీ లక్ష్యమని మాజీ మంత్రి, మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక 11వ వార్డులో ఆదివారం వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో జరిగిన 'ఇంటింటికి సూపర్-6' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి, జనసేన, బిజెపిల కూటమి మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. గ్రామ మాజీ అధ్యక్షుడు రషీద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 20 కుటుంబాలు

ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో వెనిగండ్ల రాము సమక్షంలో వలివర్తిపాడుకు చెందిన 20 కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరారు. విజయశేఖర్, గుడివాడ కుమార్, జువ్వనపూడి అనీల్, లింగవరపు యోసోబు తదితర కుటుంబాలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీ కార్మికుల పార్టీ

▸▸ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, మార్చి 24: తెలుగుదేశం పార్టీ పెట్టుబడుదారుల పార్టీ కాదని కార్మికుల పార్టీ అని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశం టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో జరిగింది. వివిధ పార్టీలకు చెందిన 150 మంది భవన నిర్మాణ కార్మికులు టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి కేశినేని శివనాథ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తూర్పు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. తూర్పులో గంజాయికి యువత బానిసలు కాకుండా ఉండాలంటే గద్దె రామ్మోహన్‌ను భారీ మోజారిటీతో గెలిపించాలన్నారు.

గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందులను ప్రస్తావిస్తూ వారందరి ఆదాయం తగ్గిపోయిందన్నారు. కార్మికులకు పూర్వవైభవం రావాలంటే రాజధాని నిర్మాణం జరగాలని దీనికి సీఎంగా చంద్రబాబు రావాలన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ కార్మికులకు



కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరిన భవన నిర్మాణ కార్మికులు

నియోజకవర్గంలోని మల్లిబాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన వందమంది, ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మికుల జిల్లా కార్యదర్శి షేక్ ఉమర్‌వలీ ఆధ్వర్యంలో 50మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ కొంతమంది అనుకుంటున్నట్టు టీడీపీ పెట్టుబడిదారుల, పెత్తందారుల పార్టీ కాదని, ఇది పూర్తిగా కార్మిక పక్షాన ఉండే పార్టీ అని అన్నారు. ఏ రంగంలోని కార్మికులైన సరే యూనియన్‌గా ఏర్పడితే నిత్యం అండగా ఉండే గద్దె రామ్మోహన్‌ను, కేశినేని శివనాథ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర నేతలు, తూర్పు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. టీడీపీలో చేరిన వారిలో సాయికిషోర్, నజీర్, రుషి, రాజేష్, గుందా వెంకటేశ్వర్లు, ఇస్మాయేల్, వీరబాబు, కుమార్, శేఖర్, రాజు, సూరి, పసుపులేటి రాంబాబు, తమ్మిశెట్టి రాంబాబు ఉన్నారు.

పెనమలూరులో ఉద్యోగుల బరితెగింపు

▸▸ కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి ఉదంతం మరువకముందే కోడ్ ఉల్లంఘనలు

▸▸ పెదపులిపాక పీఏసీఎస్ ఉద్యోగి, శానిటరీ సూపర్‌వైజర్ వైసీపీలో చేరిక



వైసీపీ కండువా కప్పుకున్న షేక్ సుభాని, ఖలీల్‌పాషా (సర్కిల్‌లో)

పెనమలూరు, మార్చి 24 : మూడు రోజుల క్రితం కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి వల్లభనేని మణికంఠ యనమలకుదురులో మంత్రి జోగిరమేశ్‌తో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న విషయంలో వేటుకు గురైనా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కోడ్‌ను ఉల్లంఘిస్తూనే ఉన్నారు. తాజాగా రెండు రోజుల క్రితం పెనమలూరు మండలం పెదపులిపాకలో పంచాయతీ శానిటరీ సూపర్‌వైజరుగా పనిచేస్తున్న షేక్ సుభాని మంత్రి తనయుడి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకోగా.. ఆదివారం పెదపులిపాక పీఏసీఎస్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న షేక్ ఖలీల్ పాషా జోగి రాజీవ్ సమక్షంలో వైసీపీలో చేరడం విమర్శలకు తావిచ్చింది. గత రెండు రోజులుగా షేక్ సుభాని గ్రామంలో అన్ని ఇళ్లకు తిరిగి ఇళ్లపై ఉన్న టీడీపీ జెండాలు తొలిగించండంటూ నోటీసులు ఇవ్వడం విశేషం.

గొల్లనపల్లిలో ప్రలోభాల పర్వం!

▸▸ యువతను దగ్గర చేసుకునేందుకు విందు ఏర్పాట్లు

▸▸ పార్టీ ఇవ్వడం కోసం క్వారీ నిర్వాహకుల నుంచి డబ్బు వసూళ్లు!

గన్నవరం, మార్చి 24 : గన్నవరం మండలం గొల్లనపల్లిలో వైసీపీ నేతల ప్రలోభాల పర్వం మొదలైంది. గ్రామం నుంచి టీడీపీలో వైసీపీ నాయకులు కార్యకర్తలు సర్పంచ్ చేరడంతో వైసీపీ నాయకులు ప్రలోభాలకు తెర లేపారు. గ్రామంలోని యువతను ఆకట్టుకునేందుకు కొంపెల్ల చెరువు సమీపంలో మామిడితోటలో శనివారం రాత్రి మందు, విందు పార్టీ ఏర్పాటు చేశారు. వైసీపీ నాయకులు 100 మంది వస్తారని అంచనా వేసుకుని వంద 8పీఎం మద్యం క్వార్టర్లు, బిర్యానీ పొట్లాలు తెచ్చారు. అయితే మందు, విందు ఉందని తెలియడంతో అధిక సంఖ్యలో వచ్చారు. లైన్లో నిలబెట్టి ఒక్కొక్కరికి ఒక క్వార్టర్ బాటిల్ ఇచ్చారు. ముందు వరుసలో ఉన్న వారికి మాత్రమే అవి అందాయి. దీంతో మిగిలిన వారు మందు, విందు లేకపోవడంతో నేతలను తిట్టుకుంటూ వెళ్లిపోయారు. ఈ లోగా విషయం తెలుసుకున్న వైసీపీ గ్రామ నాయకులు అక్కడికి వెళ్లేందుకు ఫోన్ చేయగా ఇక్కడికి రావొద్దని మందు సరిపోలేదని చెప్పటంతో వారు నిరుత్సాహంతో ఆగిపోయారు. టీడీపీ వారిని లోబర్చుకునేందుకు ఈ మందు పార్టీ ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ప్రలోభాల ఎరతో మందు, విందు పార్టీ ఇవ్వడానికి గ్రామంలోని క్వారీ నిర్వాహకుల నుంచి బలవంతంగా డబ్బు వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం.

సెంట్రల్‌లో వైసీపీ నేతల చేతివాటం!

▸▸ సీఎం జగన్, భారతి తెలుసునంటూ చోటా నేతల దందా

▸▸ రైతు బజారులో షాపులు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లు

▸▸ లబోదిబో మంటున్న బాధితులు



వెలంపల్లితో నాగుల్‌మీరా, రవికుమార్ (ఫైల్‌ఫొటో)

వన్‌టౌన్, మార్చి 24: సీఎం జగన్, ఆయన సతీమణి భారతి తమకు బాగా తెలుసని, తాను వారింట్లో మనిషినని.. వచ్చే ఎన్నికల్లో సెంట్రల్ సీటు తనకే వస్తుందని, లేదంటే ఎమ్మెల్సీ వస్తుందని నమ్మబలికి గాంధీనగర్‌లోని రైతుబజారులో షాపులిప్పిస్తానంటూ పలువురి వద్ద నగర వైసీపీ ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ భారీగా డబ్బులు వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు ముస్లిం అజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే నాగుల్‌మీరా సహకరించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. రైతుబజార్లలో షాపులిప్పించకపోవడంతో కొన్ని రోజుల క్రితం బాధితులు రవికుమార్‌ను నిలదీశారు. దీంతో ఆయన రేపు, మాపు అంటూ కాలయాపన చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే.. 31వ డివిజన్‌లోని ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సమీపంలో ఉంటున్న రవికుమార్ గాంధీనగర్‌లోని జీఎస్‌రాజు రోడ్డులో నిర్మించిన రైతు బజారులో 16 షాపులు తనకు ఎమ్మెల్యే విష్ణు ఇచ్చారని, అదే ప్రాంతంలోని తన బాల్య మిత్రుడు ఎ.శ్రీనివాసరావును నమ్మించాడు. ఒక్కోషాపునకు రూ.40వేలు చొప్పున రెండుషాపులకు రూ.80వేలను శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి తీసుకున్నాడు. రవి మాటలు నమ్మిన శ్రీనివాసరావు తనతో పాటు నెల్లూరులోని స్నేహితుడు ధనుంజయరెడ్డికి కూడా రెండు షాపులు కేటాయించడానికి రూ.95వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ఈ మొత్తాన్ని రవికుమార్‌కు సహాయకారిగా ఉన్న ఎస్కే నాగుల్‌మీరాకు అందజేశారు. వారే కాకుండా ప్రెస్ వద్ద టీస్టాల్ నిర్వహిస్తున్న రెడ్డెమ్మకు ఇల్లు ఇప్పిస్తానని రూ.10వేలు, ఐనాక్స్ థియేటర్ వద్ద ఉండే ఒక మహిళకు రైతు బజారులో షాపు అంటూ రూ.20 వేలు వసూలు చేశాడు. అంతేకాక ఇంకా పలువురు రవికుమార్ బాధితులుగా ఉన్నట్టు చెబుతున్నారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని ఆ పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ బాధితులను బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రవికుమార్‌పై ఎమ్మెల్యే విష్ణు స్వయంగా సత్యనారాయణపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. ప్రస్తుతం సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు వెంట నాగుల్‌మీరా, రవికుమార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

వైసీపీ భూదాహం వల్లే నేతన్నల ఆత్మహత్య!

▸▸ యార్లగడ్డ వెంకట్రావు ధ్వజం



యార్లగడ్డ సమక్షంలో టీడీపీలోకి చేరికలు

గన్నవరం, మార్చి 24 : వైసీపీ నాయకుల భూ దాహం వల్లే రాజంపేట నియోజకవర్గ ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఆరోపించారు. వైసీపీ నేతల భూకబ్జాకు నిండు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని ఆదివారం ఒక ప్రకటనలో యార్లగడ్డ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఈ ఘటన జరగడం శోచనీయమని సొంత భూమిని కోల్పోయిన బాధలో పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ ఘటనకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని వెంకట్రావు అన్నారు. బడుగు బలహీనవర్గాలంటే ప్రభుత్వానికి చిన్న చూపు తగదని హితవు పలికారు. ఈ ప్రభుత్వం అధికారం వచ్చిన రెండో రోజు నుంచి బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయని, ఆస్తులను దిగమింగి పేదలను బలి తీసుకోవడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. కొన్నాళ్ల క్రితం ముఖ్యమంత్రి సొంత జిల్లా కడపలో నందన్ సుబ్బయ్య అనే పద్మశాలి నేతని అత్యంత దారుణంగా చంపేశారని, నేటికి నిందితులపై చర్యలు తీసుకోకపోవటంతో ఇటువంటి దారుణాలు అధికమయ్యాయని ధ్వజమెత్తారు. వ్యవస్థను తమ చేతుల్లోకి తీసుకుని వైసీపీ నాయకులు రికార్డులు తారుమారు చేసి ప్రజల ఆస్తులు దోచుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

వ్యవస్థలను కాపాడుకుందాం..

గుణదల : రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రూరల్ మండలంలోని ఎనికేపాడులో రైవస్ కాల్వకట్లపై నివాసితుల సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ ఆరాచక పాలకులకు గుణపాఠం చెప్పి రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోనేరు సందీప్, బోడపాటి రవికుమార్, కొసరాజు సాయిరామ్, జాస్తి వెంకటేశ్వరరావు, కడియాల రాజా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

గన్నవరం టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వివిధ వర్గాల ప్రజలు వైసీపీని వీడి పెద్ద సంఖ్యలో సైకిల్ ఎక్కుతున్నారు. ముస్తాబాద గ్రామం నుంచి పలువురు ఆదివారం సాయంత్రం టీడీపీలోకి చేరగా వారికి యార్లగడ్డ వెంకట్రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కడవకొల్లు ప్రసాద్, కడవకొల్లు నరసింహారావు, పొటూరి నాగరాజు, పుల్లెల్లి బాబూరావు, వేము బసవరావు తదితరులతో పాటు 50మంది పార్టీలో చేరారు.

హైవే పనులను అడ్డుకున్న వారిపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్, మార్చి 24: విజయవాడ రోడ్డులో హైవే మరమ్మతు పనులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైవే పెట్రోలింగ్ ఆఫీసర్ జి.మురళీకృష్ణ ఆదివారం జంక్షన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోడ్డు మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా సైడ్ డ్రైనేజీ తవ్వి మట్టిని పక్కనే ఉన్న స్థలంలో పోసిన సందర్భంలో కె.సీతారాంపురం గ్రామానికి చెందిన చెన్నుబోయిన సాంబశివరావు, బల్లా జగదీష్‌లు పనులు పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ దిలీప్, అతడి స్నేహితుడు తిరుమల కిరణ్‌పై దౌర్జన్యం చేసి పనులు సాగకుండా అడ్డుకున్నారని మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు నిందితులపై కిరణ్ కూడా పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జనార్దన్ తెలిపారు.



బ్యారేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆధారాలు చూపని రూ.5లక్షలు స్వాధీనం

వన్‌టౌన్, మార్చి 24: ఎన్నికల సందర్భంగా ప్రకాశం బ్యారేజీ వద్ద ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులు ఒక వాహనం నుంచి రూ.2లక్షలు, మరో వాహనం నుంచి రూ.3లక్షలు ఆధారాల్లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. సీపీ కాంతి రాణా ఆదేశాలతో వెస్ట్‌జోన్ డీసీపీ హరికృష్ణ, వెస్ట్ డివిజన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో తనిఖీలు జరిగాయి. మద్యం, నగదు, అక్రమ రవాణాలను నిరోధించేందుకు తనిఖీలు ముమ్మరంగా చేస్తున్న క్రమంలో ఈ నగదును పట్టుకున్నారు. ఈ డబ్బును పశ్చిమ రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సీజింగ్ పార్టీకి అప్పగించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

▸▸ బాలుడు మృతి.. తండ్రికి గాయాలు

వన్‌టౌన్, మార్చి 24 : జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో బాలుడు మృతి చెందగా తండ్రికి గాయాలు కావడంపై ఆదివారం కృష్ణలంక స్టేషన్‌లో కేసు నమోదైంది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామం గణపతినగర్‌కు చెందిన కొత్తవరపు గోపికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇతను ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనులు చేస్తుంటాడు. పెద్ద కుమారుడు శివ గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతూ అక్కడే హస్టల్‌లో ఉంటున్నాడు. రెండో కుమారుడు బాలనాగకృష్ణ (12) 7వ తరగతి చదువుతున్నాడు. 23వ తేదీన పెద్ద కొడుకు గుడ్లవల్లేరు హస్టల్ నుంచి ఆత్మకూరుకు బయలుదేరగా అతడిని బస్‌స్టేషన్ నుంచి ఇంటికి తీసుకువెళ్లేందుకు తండ్రి గోపి చిన్నకొడుకు బాలనాగకృష్ణ బైక్‌పై బస్‌స్టేషన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఎం.హోటల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వారి బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో బాలనాగకృష్ణకు తీవ్రంగాను, తండ్రికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు వారిని విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలనాగకృష్ణ మృతిచెందాడు. గోపి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై కత్తులతో దాడి

అవనిగడ్డ : ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగ్ విషయమై ఏర్పడి వివాదంలో యువకుడిపై ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి గాయపర్చిన సంఘటన అవనిగడ్డలో ఆదివారం రాత్రి జరిగింది. రెండో వార్డుకు చెం దిన అకుల శ్రీనివాస్‌పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు ఎలాంటి ముప్పులేదని వైద్యులు తెలిపారు. అవనిగడ్డ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

వృద్ధులకు నిత్యావసరాలు, మందుల పంపిణీ

సత్యనారాయణపురం, మార్చి 24: డెబ్బై ఏళ్లు దాటి ఎవరూ పట్టించుకోని వృద్ధులను గుర్తించి వారికి 201 నెలలుగా ప్రతీనెలా నిత్యావసర వస్తువులు, మందులు అందజేస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని ఆర్థోపెడిక్ వైద్యుడు ఎ.సూర్యనారాయణరావు అన్నారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్‌నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంఘ్వీ నరేంద్రకుమార్ ఒత్వాల్‌జీ ఛాజెడ్ సాయంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లాహరికుమార్, డాక్టర్ కె.ఎల్.సౌజన్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి, తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ పాల్గొన్నారు.





ఎర్రకట్ట రోడ్డులో ప్రదర్శనగా వెళ్తున్న ఫ్రైజర్‌పేట బాప్టిస్ట్ చర్చి సభ్యులు, సండే స్కూల్ చిన్నారులు, బెంజి సర్కిల్ సమీపంలో ఫాదర్ మువ్వల ప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ, జోజినగర్‌లో బాలయేసు చర్చి ఆధ్వర్యంలో..

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

● చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
● వీధుల్లో ర్యాలీలు

చిట్టినగర్, మార్చి 24: ఫ్రైజర్‌పేట తెలుగుబాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు, సండే స్కూల్ చిన్నారులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చర్చి పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ర్యాలీని ప్రారంభించారు. చిన్నారులు రంగురంగుల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టుకుని ఏసురాజుకు జై..యూదుల రాజుకు జై..దావీదు కుమారుడికి జై అంటూ కీర్తనలు పాడుతూ భారీ ప్రదర్శన చేశారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి ప్రారంభమైన ప్రదర్శన చిట్టినగర్ జంక్షన్ వరకు వెళ్లి, తిరిగి చర్చి వరకు కొనసాగింది. ర్యాలీలో చర్చి పాస్టర్ నిక్సన్ ఆంద్రూస్, చర్చి కమిటీ సెక్రటరీ వి.ఇమ్మానుయేల్, చైర్మన్ మోజెస్, కోశాధికారి డి.విలియంబాబు, బూదాల భారతి పాల్గొన్నారు.

బాలయేసు చర్చి ఆధ్వర్యంలో..

భవానీపురం: 43వ డివిజన్ జోజినగర్‌లోని బాలయేసు చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. పుణ్యక్షేత్రం విచారణ గురువులు మెరుగుమాల చిన్నప్ప ఆధ్వర్యంలో మానికొమ్మలతో క్రైస్తవులు చర్చి నుంచి కరెంట్ ఆఫీస్ రోడ్డు, గొల్లపూడి బైపాస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఊరేగింపు అనంతరం గురువులతో సమష్టి దివ్యబలిపూజను నిర్వహించారు. సహాయక గురువులు ఫాదర్ రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

సెయింట్ షాక్స్‌లో..

పటమట: బెంజిసర్కిల్‌లో సమీపంలోని పటమట సెయింట్ షాక్స్ కథెడ్రల్‌లో ఆదివారం క్రైస్తవులు ఘనంగా మానికొమ్మల మట్టల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బిషప్ ధ్యానాశ్రమం నుంచి విజయవాడ కథోలిక పీఠం పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజు, మోన్సిన్నోర్ సెయింట్ షాక్స్ కథెడ్రల్ విచారణకర్తలు ఫాదర్లు మువ్వల ప్రసాద్, వినోద్, ఎం.కిషోర్, సిస్టర్స్, వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. భక్తి గీతాలపనలతో సర్వీసు రోడ్డు మీదుగా కథ్రెడల్‌లోకి ప్రవేశించారు. అనంతరం క్రైస్తవ మతగురువులు సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. బిషప్ రాజారావు భక్తులకు సందేశ మిచ్చారు. కథెడ్రల్ గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. బండి బాబూరావు, కోరుకొండ అశోక్‌కుమార్, ఎం.బెర్నాడ్ పాల్గొన్నారు.



9వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న గద్దె అనురాధ

కూటమి గెలవాలి..కల్తీ మద్యం ఆగాలి

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

పటమట, మార్చి 24: జగన్మోహన్‌రెడ్డి పాలనలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని, కల్తీ మద్యం ఆగాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి విజయాన్ని చేకూర్చాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రజలకు పిలుపునిచ్చారు. 9వ డివిజన్ చిన్న రామాలయం వద్ద కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని)లను అఖండ మెజార్టీలతో గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, శ్రీదేవి, అరవింద్‌బాబు, లక్ష్మీనరసింహారావు, సుబ్బారావు, ఓంకార్, భవాని, లక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్ అబద్ధాల కోట కూలే సమయం ఆసన్నం

రామలింగేశ్వరనగర్: అబద్ధపు హామీలతో జగన్మోహన్‌రెడ్డి నిర్మించుకున్న కోట కూలే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఆదివారం 16వ డివిజన్ కళానగర్‌లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జగన్ అవలంబిస్తున్న వింత విధానాల కారణంగా ఒక్కో ఇంటిలో ఒక్కో రకంగా బాధపడుతున్నారని, ఎన్నోఏళ్ల నుంచి తీసుకుంటున్న పింఛన్‌ను కారణం లేకుండా తొలగించారని అనేక కుటుంబాలు చెబుతున్నాయని ఆమె అన్నారు. బాధలు తొలగాలంటే టీడీపీ ప్రభుత్వం రావాలని ఆమె అన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి జనసేన, బీజేపీ బలపర్చిన అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని చిన్నిలను గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. టీడీపీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

టీడీపీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్



కరెన్సీనగర్‌లో కరపత్రాలను పంచుతున్న గద్దె రాజేష్

భారతీనగర్, మార్చి 24: "గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రాష్ట్రంలో స్కిల్ సెంటర్లను ఏర్పాటుచేసి యువతలో నైపుణ్యాలను పెంచారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం యువతను మత్తుపదార్థాలకు బానిసలుగా మార్చింది. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది." అని గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె రాజేష్ అన్నారు. ఆదివారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ కరెన్సీ నగర్‌లో గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను, విజయవాడ ఎంపీగా కేశినేని చిన్నిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. పేరేపి ఈశ్వర్, గద్దె రమేష్, గుత్తికొండ కృష్ణ మోహన్, గోవిందరాజు బాస్కర్, అందె కృష్ణకిషోర్, పుల్లదాసు మారుతీమోహన్, చెన్న శ్యాంప్రసాద్, అన్నే అశోక్ పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని విడనాడండి

● రౌడీ, సస్పెక్ట్‌షీటర్లకు పోలీసుల హెచ్చరిక

వన్‌టౌన్, మార్చి 24: నేర ప్రవృత్తిని మానుకోవాలని, నేరాలకు పాల్పడకుండా ఉండాలని ఎన్నికల వేళ అవాంఛనీయ ఘటనల్లో పాల్గొనకూడదని, ఒకవేళ గీతదాటితే వారిపై చర్యలు తప్పవని రౌడీ, సస్పెక్ట్‌షీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లను పోలీస్ అధికారులు హెచ్చరించారు. వెస్ట్‌జోన్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు మొత్తం 200 మందికి వెస్ట్‌జోన్ డీసీపీ హరికృష్ణ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ టి.కనకరాజు, వెస్ట్ డివిజన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాశేఖర్‌రెడ్డి, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ టి.గణేష్, భవానీపురం ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విప్లవోద్యమంలో హత్యా రాజకీయాలకు తావులేదు

● నాదెండ్ల బ్రహ్మయ్యను హత్యచేసిన చంద్రాన్ని కఠినంగా శిక్షించాలి
● సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పి.ప్రసాద్ డిమాండ్



మాట్లాడుతున్న పి.ప్రసాద్

మొగల్రాజపురం, మార్చి 24: విప్లవోద్యమంలో హత్యా రాజకీయాలకు తావులేదని గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మయ్యను పార్టీ ముసుగులో అరాచకాలకు పాల్పడుతూ అక్రమ సంపాదనకు అలవాటుపడిన చంద్రం ముఠా హత్య చేసిందని, చంద్రం అలియాస్ పాతూరి ఆదినారాయణస్వామిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.ప్రసాద్ డిమాండ్‌చేశారు. ఈనెల 7వ తేదీన గుంటూరులో హత్యకు గురైన నాదెండ్ల బ్రహ్మయ్య సంస్మరణ సభను సీఆర్ గ్రంథాలయంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. పాతూరి ఆదినారాయణ స్వామి(చంద్రం) పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టి అరాచకాలకు, భూకబ్జాలకు, ఆర్థిక కుంభకోణాలకు పాల్పడుతున్నాడని గుర్తించి విచారణ చేసి పార్టీ ఆధారాలతో నిరూపించిందన్నారు. తన అరాచకాలు బయటకు రాగానే చర్చలకు పిలిచి బ్రహ్మయ్యను హత్య చేశారని బ్రహ్మయ్య భార్య నాదెండ్ల సామ్రాజ్యం అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాస్కరరావు, ఓపీడీఆర్ జాతీయ అధ్యక్షుడు సి.భాస్కరరావు, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, పీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కొండారెడ్డి, పీడీఎం నాయకులు క్రాంతి, ప్రగతి శీలన్యాయవాద సంఘం నాయకులు శిఖా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

పాయకాపురం, మార్చి 24: ఉరి వేసుకుని లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వాంబేకాలనీ ఎక్సెల్‌ప్లాంట్ ప్రాంతంలో నివసించే తొమటి శ్రీను(37)లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్ హుక్‌కు మంచం నవారుతో ఉరి వేసుకుని మృతిచెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి 17రోజుల క్రితం మృతి చెందిందని, దీంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అక్క కానూరి నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిళ్ల ధ్వంసం ఘటనలో ఇద్దరిపై కేసు

వన్‌టౌన్, మార్చి 24: రాణిగారితోటలోని ఓ మెకానిక్ షెడ్డులో ఆరు బైకులను ధ్వంసం చేసిన ఘటనలో కృష్ణలంక పోలీసులు శనివారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కరెంట్ ఆఫీసురోడ్డులో ఎండీ హసీన్‌బేగ్ భార్య ఇద్దరు కుమారులతో ఉంటున్నాడు. సిద్ధం కృష్ణారెడ్డి రోడ్డులో బైకు మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద ప్రవీణ్ పనిచేస్తున్నాడు. ఈనెల 21న స్థానిక కార్పొరేటర్ సత్యం మెకానిక్ షెడ్డు వద్దకు వచ్చి షెడ్డు సమీపంలో యువకులు కూర్చుంటున్నారని వారిని కూర్చోనివ్వొద్దని మందలించాడు. ఆరోజు రాత్రి షెడ్డుకు తాళాలు వేసుకుని మెకానిక్ ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం 10 గంటలకు అతను షెడ్డుకు వెళ్లి చూడగా అందులో ఉండాల్సిన ఆరు మోటార్ సైకిళ్లు ధ్వంసమై ఉన్నాయి. కార్పొరేటర్ సత్యం అండతోనే బొజ్జ నాగరాజు, రమేష్ తమ షెడ్డులో ఆరు బైకులను ధ్వంసం చేశారని మెకానిక్ భార్య ఆయేషా బేగం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు నాగరాజు, రమేష్‌పై కేసు నమోదు చేశారు.

క్షయ నివారణకు ముందు జాగ్రత్తలు అవసరం



రైల్వే ఆస్పత్రిలో క్షయ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కె.యుగంధర్

రైల్వేస్టేషన్, మార్చి 24: "క్షయ అంటువ్యాధి. తుంపర్ల ద్వారా ఇది వ్యాపిస్తుంది. ఇది అన్ని వయస్సుల వారిని ప్రభావితం చేస్తోంది. ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చు." అని ఛాతీ వైద్యుడు డాక్టర్ కె.యుగంధర్ అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా రైల్వే ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీబీని మేము అంతం చేయగలం అనే అంశాన్ని ఈ ఏడాది క్షయ నిర్మూలన థీమ్‌గా ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. తొలిరోజులోనే వ్యాధిని గుర్తించి చికిత్స చేయించుకోవాలని, బాధితులు క్రమం తప్పని వ్యాయామం, మంచి ఆహారం తీసుకోవాలని ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగ డాక్టర్ ఎం.జయదీప్ సూచించారు. రైల్వే ఆస్పత్రిలో వందమంది రోగులకు, వారి సహాయకులకు అధికారులు అవగాహన కల్పించారు.

చిన్నారుల రామాయణ పఠనం

గవర్నర్‌పేట, మార్చి 24: చదవటం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వాహకులు పాఠశాల విద్యార్థులతో రామాయణాన్ని చదివించారు. రాముడి చరితను తెలిపే పుస్తకాలు విద్యార్థులకు ఇచ్చారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి విద్యార్థులకు రాముడి చరిత్రను వివరించారు.



22వ డివిజన్ వైసీపీ నాయకులను టీడీపీలో చేర్చుకుంటున్న గద్దె రామ్మోహన్

జగన్ ఒంటెత్తు పోకడలతో
కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి: గద్దె రామ్మోహన్

పటమట, మార్చి 24: జగన్మోహన్‌రెడ్డి ఒంటెత్తు పోకడల వల్లే అమరావతి రాజధాని నాశనమైందని, భూములిచ్చిన రైతులు రోదిస్తున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ 22వ డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు నడికొప్పుల శివ(బుల్లెట్ శివ), నడవికొప్పుల రవి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు టీడీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి గద్దె ఆహ్వానించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని విజయవాడలో గంజాయి విక్రయాలు, బ్లేడ్ బ్యాచ్‌లు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. 22వ డివిజన్‌లో గద్దె రామ్మోహన్‌కు భారీ మెజార్టీ తెచ్చి తమ చేరిక ద్వారా పార్టీకి పెరిగిన బలాన్ని చూపుతామని నడికొప్పుల రవి అన్నారు. బాణాల కాశీవిశ్వనాథ్, ఎస్.గోవింద్, సీహెచ్ జానకీరాం, రమణారావు, రాంబాబు, శివప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రారంభించింది టీడీపీ

పటమట: "సంక్షేమ పథకాలను ప్రారంభించిందే టీడీపీ. అమరావతి అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం. వైసీపీ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి. జగన్ మళ్లీ అధికారంలో వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేరు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న లబ్ధికంటే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాలతో ఒక్కో కుటుంబానికి జరిగే లబ్ధి చాలా ఎక్కువగా ఉంటుంది." అని టీడీపీ-జనసేన-బీజేపీ తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. 10వ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో గద్దె మాట్లాడారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దేవినేని అపర్ణ, బొప్పన భవకుమార్, చలసాని వాసు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, జయప్రకాష్, కోటేశ్వరరావు, రామచంద్రరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలన నుంచి విముక్తి కోసం
కూటమికి విజయాన్ని చేకూర్చండి: అడ్డూరి శ్రీరాం

లబ్బీపేట, మార్చి 24: "రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. ఈ అవినీతి, రాక్షస, నియంతపాలన నుంచి విముక్తి కలగాలంటే టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలి." అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. రాణిగారితోటలోని ఐస్ ఫ్యాక్టరీలో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పార్టీల కలయిక రాష్ట్రాభివృద్ధి కోసమే అని ఆయన అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే గద్దె రామ్మోహన్‌ను, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడారు. నగరాభివృద్ధికి తనవంతు కృషి చేశానని, రాబోయే ఎన్నికల్లో తనను, కేశినేని చిన్నిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాతూరి నాగభూషణం, గణేష్, రాముడు, బాషా, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కోడింగ్ డీకోడింగ్

పార్ట్-2

1. ఒక సంకేత భాషలో BENGALను DGPICNగా రాశారు. అయితే అదే సంకేత భాషలో REGIONను ఏవిధంగా రాస్తారు?
ఎ) TGIKQP బి) TIKQPG సి) TKGQPI డి) GIKTPQ

సమాధానం: (ఎ)


వివరణ:

2	5	14	7	1	12	18	5	7	9	15	14
B	E	N	G	A	L	R	E	G	I	O	N
+2	+2	+2	+2	+2	+2	+2	+2	+2	+2	+2	+2
D	G	P	I	C	N	T	G	I	K	Q	P
4	7	16	9	3	14	20	7	9	11	17	16

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలిస్తే +2 అని తెలుస్తున్నది.

2. ఒక సంకేత భాషలో BOUGHTను ANTFGSగా రాసిన అదే సంకేత భాషలో GOVERNను ఏవిధంగా రాస్తారు?



ఎ) FNUDQM బి) NFUDMQ సి) FNUQMD డి) FNQDMU

సమాధానం: (ఎ)

వివరణ:

2	15	21	7	8	20	7	15	22	5	18	14
B	O	U	G	H	T	G	O	V	E	R	N
-1	-1	-1	-1	-1	-1	-1	-1	-1	-1	-1	-1
A	N	T	F	G	S	F	N	U	D	Q	M
1	14	20	6	7	19	6	14	21	4	17	13

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన -1 అని తెలుస్తున్నది.

3. ఒక కోడ్‌లో DIRECTను EHSDDSగా రాస్తే ఇదే కోడ్‌లో PLAYER ఎలా రాస్తారు?
ఎ) QKBXFQ బి) QBKQFX సి) OURMNFUL డి) QKBQFX

సమాధానం: (ఎ)

వివరణ:

4	9	18	5	3	20	16	12	1	25	5	18
D	I	R	E	C	T	P	L	A	Y	E	R
+1	-1	+1	-1	+1	-1	+1	-1	+1	-1	+1	-1
E	H	S	D	D	S	Q	K	B	X	F	Q
5	8	19	4	4	19	17	11	2	24	6	17

గా రాస్తారు.

పోటీ పరీక్షల ప్రత్యేకం

గమనిక: పదాలకు పైన, కింద సంఖ్యలను పరిశీలించిన +1, -1 అని తెలుస్తున్నది.

4. ఒక సంకేత భాషలో 'SPECIAL'ను 'PNDCJCO'గా రాశారు. అదే సంకేత భాషలో 'CREATOR'ను ఏవిధంగా రాస్తారు?
ఎ) ZPCAVQU బి) ZQCAVQU సి) ZPDAUQU డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ:

19	16	5	3	9	1	12	29	18	5	1	20	15	18
S	P	E	C	I	A	L	C	R	E	A	T	O	R
-3	-2	-1	0	+1	+2	+3	-3	-2	-1	0	+1	+2	+3
P	N	D	C	J	C	O	Z	P	D	A	U	Q	U
16	14	4	3	10	3	15	26	16	4	1	21	17	21

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -3, -2, -1, 0, +1, +2, +3 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

5. ఒక సంకేత భాషలో 'GREAT'ను 'HTHEY'గా రాశారు. అదే సంకేత భాషలో 'INDIA'ను ఏవిధంగా రాస్తారు?
ఎ) JPGNE బి) JPGMF సి) JQGNF డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:

7	18	5	1	20	9	14	4	9	1
G	R	E	A	T	I	N	D	I	A
+1	+2	+3	+4	+5	+1	+2	+3	+4	+5
H	T	H	E	Y	J	P	G	M	F
8	20	8	5	25	10	16	7	13	6

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే +1, +2, +3, +4, +5 పద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

6. ఒక సంకేత భాషలో 'MERCY'ను 'NCUYD'గా రాశారు. అదే సంకేత భాషలో 'DREAM'ను ఏవిధంగా రాస్తారు?
ఎ) EPHWR బి) EWHVR సి) EHPRW డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

13	5	18	29	25	4	18	5	27	13
M	E	R	C	Y	D	R	E	A	M
+1	-2	+3	-4	+5	+1	-2	+3	-4	+5
N	C	U	Y	D	E	P	H	W	R
14	3	21	25	30	5	16	8	23	18

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలకు గమనిస్తే +1, -2, +3, -4, +5 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

7. ఒక సంకేత భాషలో 'PUBLIC'ను 'OWYPDI'గా రాశారు. అదే సంకేత భాషలో 'MASTER'ను ఏవిధంగా రాస్తారు?
ఎ) LCPXZX బి) LPCXXZ సి) LPCXZX డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ:

16	21	28	12	9	3	13	1	19	20	31	18
P	U	B	L	I	C	M	A	S	T	E	R
-1	+2	-3	+4	-5	+6	-1	+2	-3	+4	-5	+6
O	W	Y	P	D	I	L	C	P	X	Z	X
15	23	25	16	4	9	12	3	16	24	26	24

గా రాస్తారు.

గమనిక: పదాలకు పైన, కింద ఇచ్చిన సంఖ్యలను పరిశీలిస్తే -1, +2, -3, +4, -5, +6 అనే క్రమపద్ధతిలో కోడ్ చేశారని తెలుస్తున్నది.

నోట్: A, B, C, D, Eలకు కొన్ని సందర్భాలలో 27, 28, 29, 30, 31 ఈ విధంగా తీసుకున్నాం. Z తరవాత ఇంకా అక్షరాలు అవసరమైతే మరలా Aను 27, Bను 28గా ఇలా భావించాలి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్

శరణార్థుల పౌరసత్వ కల్పనకు ఉద్దేశించిన 'సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2019కి సంబంధించిన రూల్స్ కేంద్రప్రభుత్వం 2024 మార్చి 11న నోటిఫై చేసింది. అలా ఈ చట్టాన్ని అమలులోకి తీసుకురావడంతో, అందులో ఉన్న కొన్ని పరిమితులు, సడలింపుల దృష్ట్యా నిరసనలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాని పూర్వాపరాలు, చట్టంలోని అంశాలు, వస్తున్న విమర్శలు, ప్రభుత్వ వర్గాల వివరణ వంటివి పరిశీలిద్దాం.

తమ దేశంలోనే తాము పరాయివారు అయినప్పుడు, నిలువ నీడలేని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ప్రజలు ఎక్కడికైనా పరుగులు పెడతారు. పరాయి దేశమైనా అక్కున చేర్చుకుంటుందేమో అని ఆశపడుతుంటారు. అలా శరణార్థులు వేల, లక్షల సంఖ్యలో సరిహద్దు దేశాలకు చేరుకోవడం సహజం. భారత్ కూడా అందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే సరైన పత్రాలు, గుర్తింపు ధ్రువీకరణలు లేకుండా దేశంలోకి వచ్చే శరణార్థులతో అటు వారికే కాదు ఇటు దేశ భద్రతకూ ముప్పే. స్థానికుల నుంచి వారు తీవ్ర దోపిడీకి గురవడం, సామాజిక భద్రతా సౌకర్యాలను పొందలేకపోవడం, పేదరికం కారణంగా నేరాల బాట పట్టినా వారిని గుర్తించడం కష్టమవుతుంది. ఆ మాటున ఉగ్రవాదులు చొరబడటం వంటి కారణాల రీత్యా దేశంలోకి వచ్చే శరణార్థులకు చట్టబద్ధ గుర్తింపు అవసరం. తిరిగివెళ్లే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించనప్పుడు వారికి పౌరసత్వం కల్పించి ఆదుకోవడం కూడా సముచితమే.

ఈ పౌరసత్వ సవరణ చట్టానికి నాంది 2002లోనే పడింది. పాకిస్థాన్‌లో తీవ్ర దౌర్జన్యాలకు గురవుతున్న స్థానిక హిందువులకు భారత దేశ వీసాలు పొందేందుకు సహకరించాలని, అదే సమయంలో అక్రమ ప్రవేశాలను అడ్డుకోవాలని ఒక సరిహద్దు రాష్ట్రంగా రాజస్థాన్ ప్రభుత్వం అప్పటి ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి విన్నవించింది.

దీని ఫలితంగా 2004లో అప్పటి ప్రధాని వాజపేయీ ప్రభుత్వం, పౌరసత్వ నిబంధనలను సవరించింది. రాజస్థాన్, గుజరాత్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంత జిల్లాల మెజిస్ట్రేట్‌లకు - లాంగ్ టర్మ్ వీసా లు, పౌరసత్వం కల్పించే అధికారాన్ని కల్పించింది.

అదేవిధంగా 2010 జూన్‌లో అప్పటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూడా కొన్ని వర్గాలకు చెందిన పాకిస్థానీయులకు వారి పాస్‌పోర్టు వాలిడిటీతో సంబంధం లేకుండా, లాంగ్‌టర్మ్ వీసాలను పునరుద్ధరించవచ్చని రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు అనుమతినిచ్చింది. దీనికి 2009 డిసెంబరు 31ని కటాఫ్ డేట్‌గా నిర్ణయించింది.

అంటే అప్పటిలోగా లాంగ్‌టర్మ్ వీసాలను పొందిన పాకిస్థానీ హిందువులు, సిక్కులు, భారతీయ వ్యక్తిని వివాహం చేసుకొని భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీ మహిళలు, పాకిస్థానీయులను వివాహం చేసుకొని విడాకులు పొందిన భారత స్త్రీలు/ వితంతువులు, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న వారికి ఈ వీసా పొడిగింపును కల్పించింది.

అదేవిధంగా భారతీయ ముస్లిం తన కుటుంబాన్ని వదిలి దేశవిభజన సమయంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయి, తదుపరి వాలిడ్ పాకిస్థాన్ పాస్‌పోర్టుతో తిరిగివచ్చి కేరళలో స్థిరపడిన సందర్భంలో కూడా లాంగ్‌టర్మ్ వీసాను అందించారు. 2014 డిసెంబరులో నరేంద్రమోడీ ప్రభుత్వం పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందూ, సిక్కు, క్రిస్టియన్, బుద్ధిస్ట్ శరణార్థులకు పౌరసత్వం ఇచ్చేందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2015-16లో భారతదేశంలో ప్రవేశానికి సంబంధించిన పాస్‌పోర్ట్ రూల్స్ సవరించి పాక్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ క్రిస్టియన్ శరణార్థులకు సరైన పాస్‌పోర్ట్/ వీసా ధృవీకరణలు లేనప్పటికీ అనుమతించేవిధంగా నియమ నిబంధనలను మార్చారు.

తదుపరి 2018లో ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ జారీచేసి ఈ వర్గాల వారు భారతీయ పౌరసత్వం పొందాలనుకుంటే వారిని లాంగ్‌టర్మ్ వీసాలకు అర్హులను చేసింది. అదేవిధంగా వారు ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

ఈ నోటిఫికేషన్ల స్థానంలో సమగ్ర విధివిధానాలను రూపొందించేందుకు కేంద్రం 1955 నాటి పౌరసత్వ చట్టాన్ని సవరించింది. తాజాగా 2019లో పౌరసత్వ సవరణ చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలకు చెందిన శరణార్థులకు మాత్రమే అనుమతివ్వడం, ఇతర సరిహద్దు దేశాల శరణార్థులకు, ముస్లిం మతస్థులకు అనుమతి లేకపోవడం విషయమై తీవ్ర విమర్శలు చెలరేగి దేశవ్యాప్త నిరసనలు ఉధృతమయ్యాయి. అయితే 2019 డిసెంబర్ నాటికి చిన్నగా మొదలై దేశంలో కరోనా పరిస్థితులు ప్రారంభమైన సమయంలో ఈ నిరసనలూ సద్దుమణిగాయి. అయితే ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ వంటి సంస్థలు; అసోం గణపరిషత్, నేషనల్ పీపుల్స్ పార్టీ, డిఎంకే వంటి రాజకీయ పార్టీలు; జైరాం రమేష్, మహువా మొయిత్రా వంటి ప్రముఖులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై సుప్రీంకోర్టులో దాదాపు 200లకు పైగా పిటీషన్లు ఫైల్ అయ్యాయి.



ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకోవడానికి, వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి, బ్యాంక్ అకౌంట్స్ తెరవడానికి, ఇల్లు కొనుగోలుకు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను పొందడానికి వారిని అనుమతించడం వంటి సౌలభ్యాలు కల్పించింది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

గనుల శాఖలో ఘనుడు!

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగ రహస్యమే. ఒక కంపెనీలో ఉద్యోగి అయి ఉండి, మరో నాలుగు కంపెనీల పనులు కూడా ఎండీసీలో చక్కబెడుతుండటం ఆయనకే చెల్లింది. అందుకే ఎండీసీ అధికారులు, సిబ్బంది ఆయన్ను 'కార్పొరేట్ లాబీయిస్ట్'గా పిలుస్తుంటారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కంపెనీకి ఇప్పించిన బెరైటీస్ కాంట్రాక్ట్ కార్యరూపం దాల్చలేదు. అది నిబంధనల ప్రకారం 2010లోనే రద్దవ్వాల్సి ఉంది. దాన్ని రద్దుచేయనివ్వకుండా నిరంతరం లైవ్‌లో ఉండేలా ప్రయత్నిస్తున్నారు. ఇక, ఆ సంస్థ కోసం మంగంపేటలోనే ఓ ప్లాంటు పేరు చెప్పి 100 ఎకరాలు ఇప్పించేందుకు ప్రతిపాదనను కదిలించారు. ఎప్పుడో రద్దవ్వాల్సిన ఒప్పందం 16 ఏళ్ల తర్వాత కూడా కొనసాగడం, ఆ కంపెనీకే 100 ఎకరాలు ఇప్పించేందుకు ఆఘమేఘాల మీద ప్రతిపాదనలు రెవెన్యూ దాకా తీసుకెళ్లడంలో ఆయనదే కీలక పాత్ర. భూమి ఇవ్వడం కుదరదని రెవెన్యూ చెప్పినా గనుల శాఖతో రెండోసారి లేఖలు రాయించేలా లాబీయింగ్ చేయగలిగారు. ఇందులోనే ఓ పెద్ద మతలబు ఉంది. 2008 నాటి ఒప్పందం ప్రకారం 100 ఎకరాలు ఇస్తే, ఆనాడు నిర్ణయించిన ధర మేరకే బెరైటీస్‌ను సరఫరా చేయించేలా ఎండీసీని ఒప్పించడం మరో పెద్ద లాబీ. ఇప్పుడు ఆయన దృష్టంతా దీనిపైనే ఉంది. అదే జరిగితే ఎండీసీ నిండా మునిగిపోనుంది. చిన్న కంపెనీలు తమకు ఎక్కడ పోటీ వస్తాయో అన్న భయంతో వాటిని ఎండీసీ ప్రోత్సహించకూడదంటూ ఒత్తిడి తెస్తున్నారు. ఇదే అంశంపై ఎండీసీ ఎండీకి లేఖ కూడా రాశారు. దీనిపై నాటి ఎండీ తీవ్రంగా స్పందించారు. "నీకు ఈ విషయంలో సంబంధం లేదు. అనవసర విషయాల్లో వేలు పెట్టవద్దు" అని తీవ్రంగా హెచ్చరించారు. అంతే, తన పలుకుబడిని ఉపయోగించి నాటి ఎండీసీ ఆ పోస్టు నుంచి తప్పించారు. ఎండీగా మధుసూదన్ రెడ్డి ఉన్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

ఎవరికి ఏ పనిచెప్పాలో కూడా

బెరైటీస్, క్వార్ట్జ్, ఇతర ఖనిజాల టెండర్లు ఎవరికి ఇవ్వాలి? ఏ ఉద్యోగిని ఏ విభాగంలో కూర్చోబెట్టాలి? ఏ అధికారికి ఏయే సబ్జెక్టులు కట్టబెట్టాలో పెద్ద లిస్టే ఇచ్చారు. వాటిని మధుసూదన్‌రెడ్డి పట్టించుకోకుండా, అధికారుల పనితీరు ఆధారంగా విధులు అప్పగించారు. దీంతో 'నా మాటే వినరా' అంటూ సదరు లాబీయిస్టు రచ్చచేశారు. దీంతో ఆయనను ఆఫీసు రిసెప్షన్‌కే పరిమితం చేశారు. ఆఫీసుల్లోని విభాగాలకు వెళ్లకుండా నియంత్రించారు. దీంతో అనేక లాబీయింగ్ పనులు నిలిచిపోయాయి. తన కంపెనీ పెద్దను తీసుకొచ్చి మధుసూదన్‌రెడ్డిని మచ్చిక చేసుకుని, మరోసారి పొరపాటు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. మధుసూదన్ రెడ్డి బదిలీ తర్వాత లాబీయిస్టుకు మళ్లీ మునుపటి స్వేచ్ఛ వచ్చింది.

మార్కెటింగ్ విభాగం అడ్డాగా వ్యవహారాలు

ఎండీసీలో మార్కెటింగ్ విభాగం కీలకమైంది. దీనిలోని ఓ అధికారి ఈ లాబీయిస్టుకు సన్నిహితుడు. అంతే మార్కెంటింగ్ విభాగం అడ్డాగా ఆయన ఎండీసీలోని పరిపాలన, వ్యాపారపరమైన అంశాలతోపాటు బిల్లుల చెల్లింపు, లీజుల అనుమతి వరకు తను శాసించగలిగేలా ఎదిగారు. తన కంపెనీల పనులతోపాటు మరో నాలుగు కార్పొరేట్ పనుల ఫైళ్ల పరిష్కరించేందుకు నేరుగా విభాగాలకు వెళ్లడం, అక్కడి వారికి ఆదేశాలు ఇచ్చి ఆగమేఘాల మీద పనులు చేయాలని ఒత్తిడి తీసుకొస్తుంటారు. వారు వింటే సరే. కాదన్న వారికి గనుల శాఖలోని ముఖ్య అధికారి కార్యాలయం నుంచి ఫోన్‌లు చేయిస్తారు. అయినా కూడా మాట వినని వారికి ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఓ అధికారి నుంచి ఫోన్‌లు చేయిస్తుంటారు. ఇంత జరిగాక లాబీయిస్ట్ చెప్పిన పనులు ఎందుకు ఆగుతాయి? ఆయన చెప్పిన వారికే ఖనిజ తవ్వకాల దరఖాస్తుల పరిష్కారం లభిస్తుంది. లీజుల అనుమతులు ఇస్తున్నారు. బిల్లుల చెల్లింపు కూడా చకచకా జరుగుతుంది.



పనిని బట్టి రేటు

'**లాబీయిస్ట్**' శక్తి తెలుసుకున్న పలు కంపెనీలు, కాంట్రాక్టు సంస్థలు తమ పనులు చక్కబెట్టాలంటూ ఈయననే ఆశ్రయించడం, దీనికి ఆయన పనిని బట్టి రేటును నిర్ణయించడం షరా మామూలుగా మారింది. దీంతో గనుల శాఖ నుంచి ఆర్థికశాఖ, రెవెన్యూ, పరిశ్రమలు, పురపాలక శాఖ, ఆర్‌అండ్‌బీ విభాగాల్లో కలియ తిరిగి పనులు చక్కబెడుతున్నారని తెలిసింది. ఎండీసీలోని మార్కెటింగ్ విభాగాన్ని అనధికారిక కార్యాలయంగా మార్చుకున్నారు. అక్కడి నుంచే మైన్స్‌తోపాటు ఇతర శాఖల పనులు, వ్యవహారాలు చక్కబెడుతున్నారని తెలిసింది. దీనికి మార్కెటింగ్‌లోనే ఓ అధికారి పూర్తిగా సహకరిస్తున్నట్లు తెలిసింది. ఇక ఆయన చెప్పిన పనులు చేసిపెట్టేవారికి బంపర్ ఆఫర్లు, గిఫ్టులు, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తుంటారని తెలిసింది. గనుల శాఖలో ఎవరైనా ఉద్యోగి ఒక రోజు సెలవుపెట్టి ఆఫీసుకు రాకుండా ఉంటారమో కానీ ఈయన మాత్రం ఖచ్చితంగా వస్తుంటారు. ఆయన వచ్చాకే మిగతా పనులు సాగిపోతుంటాయి.

ఎందుకు ప్రోత్సహిస్తున్నారు?

గనుల శాఖ ఓ కార్పొరేట్ ఉద్యోగిని ఎందుకు ప్రోత్సహిస్తోంది? ఇది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఎండీసీతో వ్యాపారం చేసే మైనింగ్ కంపెనీల ప్రతినిధులు తమ సొంత పనులపై గనుల శాఖ అధికారులను కలిసి వెళ్తుంటారు. తమ విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని కోరుతుంటారు. ఇదంతా రొటీన్‌గా జరిగిపోయేదే. కానీ, ఉద్యోగులకన్నా ముందే ఆఫీసుకు వచ్చి రోజులో 24 గంటలపాటు ఆఫీసులోనే మకాం వేయడమే అసలు సమస్య. సొంత కంపెనీ పనులతోపాటు, ఇతర కంపెనీల వ్యవహారాలు, ఇంకా ఉద్యోగుల బదిలీలు, పోస్టింగ్‌లు, సబ్జెక్టుల అప్పగింత, లీజులు, బిల్లుల చెల్లింపు వంటి అంశాలను ప్రభావితం చేసేలా ఓ లాబీయిస్టు సర్వాంతర్యామిగా మారితే అధికారులు ఎందుకు మిన్నకుంటున్నారు? అతన్ని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? అతన్ని అడ్డుకోవడంలో ఎందుకు భయపడిపోతున్నారు? ఈ విషయంలో అనేక సందేహాలున్నాయి. అతను లాబీయిస్టుగా మారడం వెనుక ముఖ్య అధికారుల ప్రోత్సాహం కూడా ఉందన్న వాదన వినిపిస్తోంది.



లాడో బాయ్...
ఒకప్పుడు అయిదు రూపాయల కూలీ... ఇప్పుడు ఆమె పెయింటింగ్స్ పికాసో చిత్రాల సరసన సగర్వంగా నిలిచాయి. పిథోరా చిత్రకళకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన మహిళల్లో ఆమె ఒకరు. సంప్రదాయానికి ఆధునికతను మేళవించి వర్ణవిన్యాసం చేస్తున్న లాడో బాయ్ కథ ఇది...

కూలీ కుంచె... దేశాలు దాటింది

"మాది మధ్యప్రదేశ్‌లోని ఝబువా దగ్గరలోని బడీ బావడీ అనే చిన్న గ్రామం. రెక్కాడితే కాని డొక్కాడని భిల్ల గిరిజన కుటుంబం. రాయడం, చదవడం వచ్చు... అదే నా చదువు. బొమ్మలు వెయ్యడంలో నైపుణ్యం మాత్రం చిన్న వయసునుంచే వచ్చింది. దానికి కారణం... చిత్రలేఖనం మా జీవితాలతో విడదీయలేని భాగం. నేను 1954లో పుట్టాను. అప్పట్లో మా గ్రామంలో రంగులు, బ్రెష్‌లు ఉండేవి కావు. చెక్కని కుంచెగా రూపొందించుకొనేవాళ్ళం. బొగ్గు, ఎర్ర మట్టి, ఆకులు, బియ్యపు పిండితో రకరకాల రంగులు తయారు చేసేవాళ్ళం. పెళ్ళిళ్ళయినా, పండుగలైనా ఇంటి గోడల మీద బొమ్మలు వేయడం, వస్త్రాల మీద వేసిన చిత్రాలను తుమ్మ జిగురుతో గోడలపై అంటించడం మా ప్రాంతంలో సర్వసాధారణం. ఈ కళలో మా నాయనమ్మ దగ్గర ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. నాకు పన్నెండేళ్ళు వచ్చేసరికి ఇంటి పరిస్థితి మరింత దిగజారింది. గత్యంతరం లేక ఏదైనా పని చూసుకుందామని మా అన్నయ్య, వదిన భోపాల్‌కు వలస వచ్చారు. వాళ్ళ వెనుకే నేను కూడా. కూరగాయలు అమ్మడం, అడవి నుంచి కట్టెలు తెచ్చి విక్రయించడం... ఇలా చాలా పనులు చేశాం. చివరకు ఒక చోట భవన నిర్మాణ కూలీలుగా కుదిరాం. ఆ కట్టడం... భోపాల్‌లో సుప్రసిద్ధమైన భారతీయ భవన్. సకల కళలకూ కేంద్రంగా రూపుదిద్దుకున్న భవన నిర్మాణంలో ప్రముఖ కళాకారుడు, రచయిత అయిన జగదీశ్ స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. మా అన్నయ్యకు ఇరవై రూపాయలు, మా వదినకు పది రూపాయలు, నాకు అయిదు రూపాయలు కూలీగా దొరికేది.



స్వామినాథన్ ప్రోత్సాహంతో...

ఊరుకాని ఆ ఊర్లో నాకు ఏమీ తోచేది కాదు. ఖాళీ సమయాల్లో కాగితాలు, పెన్సిల్ తీసుకొని బొమ్మలేస్తూ ఉండేదాన్ని. అది ఒక రోజు స్వామినాథన్ కంట పడింది. ఆయన నా వివరాలు తెలుసుకున్నారు. మర్నాడు కొన్ని కాగితాలు, రంగులు తీసుకొచ్చి ఇచ్చారు. "నీకు తోచిన బొమ్మలు వెయ్యి. బాగా వెయ్యి" అని ప్రోత్సహించారు. నా చిత్రాలను పరిశీలించి, సూచనలు, సలహాలు ఇచ్చేవారు. "నీలో మంచి నైపుణ్యం ఉంది. మరింత సాధన చేస్తే మంచి చిత్రకారిణివి అవుతావు" అని చెప్పేవారు. కొన్నాళ్ళకు భారతీయ భవన్ నిర్మాణం పూర్తయింది. వేరే చోట పనిలో చేరాం. అప్పుడు కూడా బొమ్మలు వెయ్యడం, స్వామినాథన్‌కు చూపించడం కొనసాగించాను. కొన్నాళ్ళ తరువాత భోపాల్‌లోని ఆదివాసీ లోక్ కళా అకాడమీలో ఆయన నన్ను చేర్పించారు. అక్కడ నాకు భూరీబాయ్ పరిచయం అయ్యారు. గిరిజనులకు ప్రత్యేకమైన పిథోరా కళాకృతులను కాగితం మీద గీసి, ప్రాచుర్యంలోకి తెచ్చిన మొదటి వ్యక్తి ఆమె. పద్మశ్రీ పురస్కారం కూడా అందుకున్నారు. భూరీ సహచర్యం నాకు చిత్రకళలో కొత్త విషయాలెన్నో నేర్పింది. మా భిల్ల గిరిజనుల సంప్రదాయ రీతి అయిన పిథోరా చిత్రకళ మీదే పూర్తిగా దృష్టి కేంద్రీకరించాను. నా చిత్రాలతో మనదేశంలోనే కాదు, విదేశాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహించాను. ఈ ఏడాది జనవరి 20 నుంచి మార్చి మూడు వరకూ ఇటలీ మిలాన్ నగరంలోని పలాజ్జినా ట్రోంబినీ మ్యూజియంలో విశ్వవిఖ్యాత చిత్రకారులైన పికాసో తదితరుల చిత్రాల సరసన పద్మశ్రీ జోధియాబాయ్, పద్మశ్రీ భూరీబాయ్‌లతో పాటు నా పెయింటింగ్స్ కూడా చోటు చేసుకోవడం మాటల్లో వివరించలేని అనుభూతి. మన దేశ గిరిజన చిత్రకారులకు తొలిసారిగా దక్కిన అరుదైన గౌరవం ఇది.

ఎన్నడూ ఊహించలేదు...

నా వ్యక్తిగత విషయాలకు వస్తే... మా భిల్ల గిరిజన తెగకు చెందిన పెయింటర్ తెరూ తహెద్‌ను వివాహం చేసుకున్నాను. కొన్నేళ్ళ క్రితం ఆయన మరణించారు. అది నాకు అంతులేని విషాదాన్ని మిగిల్చింది. నలుగురు పిల్లల భారం నా మీద పడింది. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. అయినప్పటికీ ధైర్యంతో ముందుకు సాగాను. నా నలుగురు పిల్లలకు, కోడలికి కూడా ఈ కళను నేర్పాను. పిథోరా చిత్రకళకు కొత్త గుర్తింపును, అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన చిత్రకారిణుల్లో ఒకరిగా నన్ను పలు సంస్థలు గుర్తించి పురస్కారాలను అందజేశాయి, సత్కారాలు చేశాయి. పెద్దగా చదువుకోని, సాధారణ మహిళనైన నాకు ఎందరో ప్రముఖుల నుంచి ఇన్ని ప్రశంసలు దక్కుతాయని, అయిదు రూపాయల కూలీగా మొదలై లక్షల్లో అమ్ముడయ్యే పెయింటింగ్స్ వేసే స్థాయికి చేరుతానని ఏమాత్రం ఊహించలేదు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని కలుసుకోవడం నేను ఎన్నడూ మరచిపోలేని అనుభవం. ఒకప్పుడు ఇల్లు వదిలి వెళ్ళాలంటే భయపడేదాన్ని. ఇప్పుడు ప్రపంచమంతా ఒంటరిగానే వెళ్తున్నాను. ప్రకృతి, ఆధ్యాత్మికత, చుట్టూ ఉన్న జీవజాలం... ఇవన్నీ గిరిజనుల జీవితాల్లో, కళల్లో అంతర్భాగం. సంప్రదాయికమైన పిథోరా చిత్ర శైలిలో ఆధునికమైన, సమకాలీనమైన సామాజిక అంశాలను చిత్రించడం నాకు ఇష్టం. నేను గీసే చిత్రాల్లో జంతుప్రపంచం, భిల్లుల ఆచార వ్యవహారాలు, పండుగలు ప్రధానంగా ఉంటాయి. చిన్నప్పుడు మా పెద్దల నుంచి విన్న జానపద కథలను కూడా వివరంగా పెయింటింగ్స్ వేశాను. నాకు దైవభక్తి ఎక్కువ. నేను గీసే చిత్రాలు దైవానికి ప్రీతిపాత్రంగా ఉండాలనేది నా తపన. అందుకే పెయింటింగ్స్ వేసేటప్పుడు చాలా నిష్టగా ఉంటాను. నా చిత్రాల ద్వారా పిథోరా కళనూ, సంస్కృతి సంప్రదాయాలను, భిల్లుల జీవన శైలిపై అవగాహనను భావి తరాలకు అందించాలనేది నా కోరిక."



డైలాగ్ రాక్షసి అని పిలిచేవారు

పోలీసు అధికారి అవ్వాలని కోరుకున్నా... తల్లితండ్రుల ప్రోత్సాహంతో రంగస్థలం వైపు అడుగులు వేశారు ప్రొఫెసర్ భళ్లమూడి పద్మప్రియ. చివరకు దాన్నే ఆమె కెరీర్‌గా మలుచుకుని... నేడు ఎందరో ఔత్సాహికులను నాటక రంగానికి అందిస్తున్నారు. నటిగా రెండు వందలకు పైగా నాటకాలు... రెండు వేలకు పైగా ప్రదర్శనలు... దర్శకురాలిగా ఎన్నో ప్రయోగాలు. తెలుగు వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా బహుముఖ సేవలు అందిస్తున్న పద్మప్రియ ప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

"నాటక రంగంలో ఒక నటిగా కన్నా దర్శకురాలిగా పేరు సంపాదించుకోవడం చాలా కష్టం. మగవాళ్ల కంటే చాలా భిన్నంగా, మరింత సృజనాత్మకంగా ప్రతిభను చాటగలిగినప్పుడే రంగస్థలంలో మనకంటూ ఒక గుర్తింపు లభిస్తుంది. అందుకు పురుషులకంటే మరింత ఎక్కువ కష్టపడాలి కూడా. అప్పుడే మనదైన ముద్రతో రాణించగలం. నామటుకు నేను నలభైకు పైగా నాటకాలకు దర్శకత్వం వహించాను. 'పద్మప్రియ నాటకాలన్నీ దేనికదే ప్రత్యేకమనే' ప్రశంసలను ప్రేక్షకుల నుంచి అందుకొన్నాను. జాలర్ల జీవిత ఇతివృత్తంగా సాగే 'మోరియా' నాటక ప్రదర్శన కోసం రవీంద్ర భారతి వేదిక మీద ఏకంగా సముద్రం సెట్ వేశాను. పురాతన గ్రీకు నాటకం 'యాంటిగోన్'లో పాత్రధారులకు గోనె సంచులతో కాస్ట్యూమ్స్ డిజైన్ చేయడంతోపాటు ఆ నాటకాన్ని ఆరుబయట ప్రయోగాత్మకంగా ఎన్విరాన్‌మెంటల్ థియేటర్ ప్రక్రియలో ప్రదర్శించాను. 'కౌముది మహోత్సవం', 'అంతర్యుద్ధం', 'కట్టు బానిస', 'కాగితం పులి'... ఇలా నా దర్శకత్వంలోని ప్రతి నాటకాన్నీ సందర్భానుసారంగా లైటింగ్ ఎఫెక్టులు, విభిన్నమైన రంగాలంకరణ లాంటి మోడ్రన్ థియేటర్ టెక్నిక్స్‌తో వినూత్నంగా చూపించడానికి ప్రయత్నించాను. వాస్తవికేతర నాటకాలను ఎంపిక చేసుకోవడం... వాటికి సింబాలిజం, ఎక్స్‌ప్రెషనిజం, ఎగ్జిస్టెన్షియలిజం లాంటి ఆధునిక పద్ధతులను మిళితం చేయడం నాకు ఇష్టం. నా దర్శకత్వంలోని ప్రతి నాటకానికీ సెట్, కాస్ట్యూమ్స్‌లను నేనే డిజైన్ చేసుకొంటాను.

అదే పెద్ద సవాలు...

నాటక రంగంలో పని చేసే ఆడవాళ్ల సమస్యల గురించి చర్చకు వచ్చిన సందర్భాలు ఇంతవరకు పెద్దగా లేవు. కారణం ఈ రంగంలో నటీమణులుగా మినహా మిగతా విభాగాల్లో మహిళలు పెద్దగా లేకపోవడమే. రంగస్థలంలో మనకు ఉన్న మహిళా దర్శకులను వేళ్ల మీద లెక్కించవచ్చు. నాటక ప్రదర్శన ప్రదేశాలలో చాలా సందర్భాలలో కాస్ట్యూమ్స్ మార్చుకోడానికి, కాసేపు విశ్రాంతి తీసుకోడానికి కూడా ఆడవాళ్లకు సరైన వసతులుండవు. ఇక మరుగుదొడ్ల లాంటి సౌకర్యాల సంగతి సరేసరి. ఈ రంగంలోకి రావాలంటే కుటుంబం అనుమతి తప్పనిసరి. రిహార్సిళ్ల, ప్రదర్శనలంటూ... ఇంటికి చేరడానికి ఒక వేళపాళ అంటూ ఉండదు. కనుక ఇటు వృత్తి జీవితాన్ని అటు కుటుంబ బాధ్యతలనూ సమన్వయం చేసుకోవడం ఈ రంగంలోని ఆడవాళ్లకు అతిపెద్ద సవాల్. దానికితోడు ఇక్కడ ప్రతి మహిళ తన భద్రత, కన్వీనియెన్స్ చూసుకుంటూ పని చేయాలి. కనుక నాటక రంగంలోని మహిళలకు కొన్ని వెసులుబాట్లు అవసరం.

ఔట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించేలా...

ఔత్సాహిక నాటకాలకు భిన్నంగా రంగస్థలంపై విభిన్న ప్రయోగాలు చేయడానికి అవసరమైన కొత్త చూపును నాకు ఇచ్చింది మాత్రం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీనే. అక్కడ నేను థియేటర్ ఆర్ట్స్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో మా ప్రొఫెసర్ డీఎస్ఎన్ మూర్తి నాకు ఒక సన్నివేశాన్ని ఇచ్చి డైరెక్టు చేయమన్నారు. అప్పటికే కొన్ని వందల నాటకాల్లో నటించిన అనుభవం ఉన్న నాకు ఇదొక లెక్కా అనుకొని, ఠపీమని చేసి చూపించాను. 'పక్కా పరిషత్ నాటకంలా చేశావు. ఇది చేయడానికైతే ఇక్కడి వరకు రానక్కర్లేదు. విభిన్నంగా ఆలోచించాలి కదా' అన్నారు మూర్తి సర్. ఆ మాటలు నన్ను ఔట్ ఆఫ్ దిబాక్స్ ఆలోచించేలా చేశాయి. రంగస్థలంపై ప్రయోగాలు చేయడానికి ప్రేరణ కలిగించాయి. అదే యూనివర్సిటీలో తర్వాత 'రంగస్థల శిక్షణతో వ్యక్తిత్వ వికాసం' అంశం మీద పీహెచ్‌డీ కూడా పూర్తి చేశాను. తెలుగు నాటకరంగంలో మొట్టమొదటగా పీహెచ్‌డీ చేసిన మహిళను నేనే అని తెలిసి సంబరపడ్డాను.

పట్టాభిరాం సహకారంతో...

నా పరిశోధన కూడా చాలా సవాళ్లతోనే సాగింది. 'రంగస్థల శిక్షణతో వ్యక్తిత్వవికాసం' టాపిక్ తీసుకొంటానని మా గైడ్ ప్రొఫెసర్ బిట్టు వెంకటేశ్వర్లుతో చెప్పినప్పుడు... 'చాలా మంచి అంశం. కాకపోతే దీని మీద రిఫెరెన్స్ పుస్తకాలంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. థీసెస్ రాయడానికి కూడా చాలా కష్టమవుతుంది' అని ఆయన అన్నారు. 'మరెవ్వరూ చెయ్యలేదు కనుకే నేను చేస్తాను' అని మా గైడ్‌ను ఒప్పించిమరీ అదే టాపిక్ ఎంపిక చేసుకున్నాను. వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్‌ను కలిసి, మొదట ఆయన సూచించిన వ్యక్తిత్వవికాస పుస్తకాలన్నీ చదివాను. తర్వాత కొద్ది రోజులు ఆయనతో పాటు కౌన్సెలింగ్ సెషన్స్‌లో కూర్చొని విన్నాను. అలా క్రమశిక్షణ, సమయపాలన, కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి, ఏకాగ్రత పెరుగుదల, సమష్టి తత్వం... లాంటి లక్షణాలు రంగస్థల శిక్షణతో పెంపొందుతాయని రూఢీ చేస్తూ వాటన్నింటినీ థీసెస్‌లో సవివరంగా రాశాను. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే రంగస్థల ఆటలు కూడా బోలెడున్నాయి. అందుకే ప్రతి ఒక్క ఇంటర్నేషనల్ స్కూల్లో ఇప్పుడు థియేటర్ ట్రైనర్‌ను తప్పనిసరిగా నియమిస్తున్నారు. అలా నేనూ ఒక కార్పొరేట్ పాఠశాలలో కొంతకాలం పని చేశాను. సిగ్గు, బిడియం లాంటివాటిని అధిగమించడానికి, స్పీచ్‌ను మరింత మెరుగుపరుచుకోడానికి రంగస్థల శిక్షణ చాలా తోడ్పడుతుంది. కొన్ని రకాల మానసిక సమస్యలకు కూడా ఇది గొప్ప ఉపశమనం. కనుక వర్క్‌షాప్స్ ద్వారా చాలా మందికి రంగస్థల నటనలో శిక్షణ ఇచ్చాను.

అలా మొదలైంది...

నా బాల్యం చాలావరకు ప్రసిద్ధ నాటక ఉద్యమకర్త ఏఆర్ కృష్ణ గారింట్లోనే గడిచింది. అమ్మానాన్నకు ఆయనే పెద్ద దిక్కు కావడంతో స్కూలుకు సెలవులు వస్తే చాలు నేను కృష్ణ తాతయ్య వాళ్ల ఇంటికి వెళ్లేదాన్ని. ఆయన ఒడిలో కూర్చొని నాటకాల రిహార్సల్స్ చూసేదాన్ని. అప్పుడప్పుడూ తాతయ్య నాతోనూ డైలాగులు చెప్పిస్తుండేవారు. పదేళ్ల వయసులో అనుకొంటా... కృష్ణ తాతయ్య దగ్గర ఒక చిల్డ్రన్స్ థియేటర్ వర్క్‌షాప్ పూర్తి చేసి 'మళ్లీ మళ్లీ పుడితే గిడితే' నాటకంలో మొట్టమొదటిసారి రంగస్థలం మీద నటించాను. తర్వాత పదో తరగతిలో ఉండగా 'రసరంజని' నిర్వాహకుల్లో ఒకరైన సోమేశ్వర రావు దర్శకత్వంలో 'కాకి ఎంగిలి' నాటకంలో కథానాయికిగా నటించాను. అది నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు.

'రంగస్థల సావిత్రి' అనేవారు...

రెండు వందలకుపైగా నాటకాల్లో... దాదాపు రెండు వేల ప్రదర్శనల్లో నటించాను. అతి తక్కువ సమయంలో సంభాషణలు కంఠతా చెప్పడం నా ప్రత్యేకత. అది చూసి చాట్ల శ్రీరాములు గారు నన్ను 'డైలాగ్ రాక్షసి' అని పిలిచేవారు. మరొక నాటకరంగ ప్రముఖుడు డీఎస్ దీక్షిత్ గారు ఒక జాతీయ సదస్సులో నన్ను 'రంగస్థల సావిత్రి' అంటూ కొనియాడారు. జేవీ రమణమూర్తి, మొదలి నాగభూషణశర్మ, కోటా శంకర్రావు లాంటి రంగస్థల హేమాహేమీల దర్శకత్వంలో... రాళ్లపల్లి, సుత్తివేలు, పీజేశర్మ, సాక్షి రంగారావు, తనికెళ్ల భరణి, జేవీ సోమయాజులు, రఘుబాబు తదితర ప్రముఖులతో కలిసి రంగస్థలం మీద పని చేయడం నాకు లభించిన అరుదైన అవకాశం. రంగస్థల నటిగా నాలుగు సార్లు నంది అవార్డు, ఒక జాతీయ పురస్కారాన్ని అందుకున్నాను.

జాతీయ స్థాయి ప్రదర్శనే లక్ష్యం...

వినోదం స్మార్ట్‌ఫోన్ రూపంలో ప్రతిఒక్కరికీ అరచేతిలోకి వచ్చిన తర్వాత నాటకాల హవా కాస్త తగ్గిన మాట వాస్తవమే. అయితే మంచి ఇతివృత్తంతో ఈ కాలానికి తగినట్టు సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయోగాత్మకంగా రూపొందించిన నాటకాలను మాత్రం ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఇదివరకు నాటకాల్లో నటించే ఆడవాళ్లంటే సమాజంలో చాలామందికి చులకనా భావం. ఇప్పుడు పరిస్థితి మారింది. కానీ అమ్మాయిలు ఇటువైపు రావడానికి మొగ్గు చూపడం లేదు. సినిమా, టెలివిజన్ రంగాలవైపు వెళ్లడానికి ఎక్కువమంది ఇష్టపడుతున్నారు. టాటాప్లే డీటీహెచ్‌లో హిందీ ఇతర భాషల నాటకాలు కొన్ని రికార్డు చేసి మరీ ప్రసారం చేస్తున్నారు. అలా తెలుగు నాటకాలను కూడా చేయగలిగితే బావుంటుంది. ఓటీటీ లాంటి వేదికలతో కొత్త నటీనటులకు అవకాశాలు పెరిగాయి. తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళలు కోర్సు చేసిన మా విద్యార్థులు చాలామంది ఇప్పుడు వెబ్‌సిరీస్‌లు, ఓటీటీ సినిమాలకు పని చేస్తున్నారు. సినిమా, రంగస్థలం దేని ప్రత్యేకత దానిదే. తెలుగునాట నాటక రంగం ఒక పరిశ్రమగా ఎదిగే రోజు రావాలి. మన తెలుగు నాటకాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్నది నా ఆశయం. అందుకోసం నావంతు కృషి చేస్తున్నాను.

అమ్మానాన్న ప్రోత్సాహం

సాధారణంగా పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు నటన వైపు వెళతామంటే తల్లితండ్రులు వారిస్తుంటారు. నా విషయంలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధం. నన్ను నాటక రంగం వైపు వెళ్లమని ప్రోత్సహించింది మా నాన్న భళ్లమూడి కృష్ణమూర్తి, అమ్మ కల్యాణి. వారిద్దరూ రంగస్థల నటులు. అలా ఒకరికొకరు పరిచయం కావడంతో, ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. మా నాన్న ఎయిరిండియాలో ఉద్యోగం చేస్తూనే మరో వైపు నాటక సంఘాన్ని నెలకొల్పి క్రమం తప్పకుండా ప్రదర్శనలిచ్చేవారు. మొదట మా అక్కను నాటక రంగంవైపు తీసుకెళ్లాలి అనుకొంటే, కొన్ని పరిస్థితులవల్ల అది కుదరలేదు. దాంతో నన్ను రంగస్థలానికి పరిచయం చేశారు. 'అమ్మాయిని ఇంజనీరింగో మెడిసినో చదివించాలి కానీ నాటకాల్లోకి పంపించడమేంటి? ఇదేం విడ్డూరం' అని ఇరుగుపొరుగు చాలామంది అమ్మను సూటిపోటి మాటలన్నారు. నేను కూడా కిరణ్ బేడీలాంటివారి స్ఫూర్తితో మొదట పోలీసు అధికారి అవ్వాలి అనుకున్నాను. 'కాస్త కష్టపడితే ఎవరైనా పోలీసు కావచ్చు. కానీ అందరూ నటులు కాలేరు' అన్న అమ్మ మాటలు నాకు ఇప్పటికీ జ్ఞాపకం. తర్వాత అమ్మ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళలు శాఖలో అధ్యాపకురాలిగా చేరారు. ప్రస్తుతం అదే యూనివర్సిటీలో అమ్మకు సహోద్యోగిగా నేను అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తుండటం నాకు లభించిన అరుదైన అవకాశం.

● సొంత్వన్
ఫొటోలు: రాజ్‌కుమార్

నవ్య | చిత్రజ్యోతి

ఈ ప్రయాణం ఇంతటితో ఆగిపోదు

విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించారు. ఈ నెల 29న రాబోతోంది. రమాకాంత్ రెడ్డి ఆదివారం మీడియాతో ముచ్చటించారు.



డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి

"కలియుగం పట్టణంలో' అంటే ఊరిపేరు కాదు. కలియుగంలో మనుషులు ఎలా ఉన్నారు అనేది ఓ పట్టణానికి ముడిపెట్టి ఈ చిత్రంలో చూపించాం. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్ అయినా ఇందులోని మదర్ సెంటిమెంట్, లవ్, యాక్షన్ ఎపిసోడ్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. వాటితో పాటు ఇందులో మంచి మెసేజ్ కూడా ఉంది. కాలేజీ స్టూడెంట్స్ అందరూ దానికి తప్పకుండా కనెక్ట్ అవుతారు. కోడి రామకృష్ణ 'అరుంధతి' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి పలువురు దర్శకుల వద్ద పనిచేసాను. ఈ సినిమాను ఇండస్ట్రీ పెద్దలకు చూపించాం. మంచి కాంప్లిమెంట్స్ ఇచ్చారు. మొదటి సినిమానే బాగా చేసావు, డేరింగ్‌గా చేసావు అనడంతో ఎంతో ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకు అజయ్ అరసాద మంచి మ్యూజిక్ అందించారు. ఈ 'కలియుగ పట్టణంలో' ప్రయాణం ఇంతటితో ఆగిపోదు..దీనికి సీక్వెల్‌గా 'కలియుగ నగరంలో' వస్తుంది" అని చెప్పారు.

నా నల్లా కలువా పువ్వా



చైతన్యారావు, అర్జున్ అంబటి హీరోలుగా కిశోర్ దాత్రి కథానాయికగా నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. సతీశ్ రాపోలు దర్శకత్వంలో నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మించారు. ఏప్రిల్ 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'నా నల్లా కలువా పువ్వా' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది. అత్యాచారాలకు గురవుతున్న అమ్మాయిల కుటుంబాల్లోని ఆవేదనను ఈ పాటలో మనసును కదిలించేలా చూపించారు. పెంచల్‌దాస్ సాహిత్యం అందిస్తూ, ఆలపించిన ఈ గీతానికి పి. ఆర్ స్వరాలు సమకూర్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సతీశ్ చెప్పిన కథ నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. మంచి అవుట్‌పుట్ వచ్చింది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా నిర్మాత సహకారం వల్ల సినిమాను అనుకున్న విధంగా తీయగలిగాను. ప్రేక్షకులు మెచ్చే మంచి కమర్షియల్ చిత్రం అవుతుంది' అన్నారు.

సమంత సోయగం



అందం, చెక్కు చెదరని ఆత్మస్థైర్యం సమంత సొంతం . మయోసైటిస్ వ్యాధి బారిన పడినా కుంగిపోకుండా సినీ కెరీర్‌ను కొనసాగిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. 'సిటాడెల్: హనీ-బన్నీ' సిరీస్ షూటింగ్ పూర్తి చేసి మాంచి స్పీడ్ మీద ఉన్నారు సమంత. ఈసారి హాట్ ఫొటో షూట్‌తో కుర్రకారు హృదయలను కొల్లగొట్టారు. బ్లాక్ కలర్ సూట్‌లో హాట్ హాట్‌గా పోజులిచ్చారు. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం సమంత మయోసైటిస్‌కు చికిత్స తీసుకుంటూనే చిత్రీకరణల్లో పాల్గొంటున్నారు.

ఏప్రిల్‌లో లవ్ మీ



ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. దెయ్యాన్ని ప్రేమించిన ఓ యువకుడి జీవితంలో జరిగిన అనూహ్య సంఘటనల నేపథ్యంలో కథ సాగుతుంది. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ బేనర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్నారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన దక్కింది. ఈ హారర్ థ్రిల్లర్ రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. 'లవ్ మీ' చిత్రాన్ని ఏప్రిల్ 25న విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఆదివారం ప్రకటించారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రం ఇస్తుందని ఈ సందర్భంగా యూనిట్ తెలిపింది. ఎం. ఎం కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: పి. సి. శ్రీరామ్. ఎడిటర్: సంతోశ్ కామిరెడ్డి.

ఇళయరాజాగా ఇలా..!



మ్యాస్ట్రో ఇళయరాజా బయోపిక్ తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇందులో ఇళయరాజా పాత్రను ధనుశ్ పోషిస్తున్నారు. ఆయన ఇళయరాజా గెటప్పులో ఉన్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అచ్చు ఇళయరాజాను తలపించేలా ధనుశ్ కనిపించారు. 'ఇళయరాజా పాత్రలో ధనుశ్ ఎలా ఉన్నాడో చూడండి అంటూ' అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. 'ఇళయరాజా' బయోపిక్ అరుణ్ మాతేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఓజీ విలన్ వచ్చాడు



బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ 'ఓజీ' చిత్రంలో ప్రతినాయకుడి అవతారం ఎత్తిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డివివి దానయ్య నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 27న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆదివారం ఇమ్రాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఇమ్రాన్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఇందులో సిగరెట్ వెలిగిస్తూ సీరియస్ లుక్‌లో ఆయన కనిపించారు.

సంజూ..సత్తా

రాజస్థాన్ శుభారంభం
20 పరుగులతో లఖ్‌నవూ ఓటమి


సంజూ శాంసన్ (52 బంతుల్లో 82 నాటౌట్)

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (సి) క్రునాల్ (బి) మొహిసిన్ 24, బట్లర్ (సి) రాహుల్ (బి) నవీన్ 11, శాంసన్ (నాటౌట్) 82, పరాగ్ (సి) దీపక్ (బి) నవీన్ 43, హెట్‌మయెర్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 5, జురెల్ (నాటౌట్) 20; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 193/4; వికెట్ల పతనం:** 1-13, 2-49, 3-142, 4-150; **బౌలింగ్:** మొహిసిన్ 4-0-45-1, నవీనుల్ హక్ 4-0-41-2, క్రునాల్ 4-0-19-0, బిష్ణోయ్ 4-0-38-1, యష్ ఠాకూర్ 3-0-43-0, బదోని 1-0-6-0.

లఖ్‌నవూ: డికాక్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 4, రాహుల్ (సి) జురెల్ (బి) సందీప్ 58, పడిక్కల్ (బి) బౌల్ట్ 0, బదోని (సి) బట్లర్ (బి) బర్గర్ 1, హుడా (సి) జురెల్ (బి) చాహల్ 26, పూరన్ (నాటౌట్) 64, స్టొయినిస్ (సి) జురెల్ (బి) అశ్విన్ 3, క్రునాల్ (నాటౌట్) 3; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 173/6; వికెట్ల పతనం:** 1-4, 2-10, 3-11, 4-60, 5-145, 6-154; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-35-2, బర్గర్ 3-0-30-1, అశ్విన్ 4-0-35-1, అవేశ్ 3-0-21-0, చాహల్ 3-0-25-1, సందీప్ 3-0-22-1.

జైపూర్: ఐపీఎల్‌ను రాజస్థాన్ రాయల్స్ విజయంతో ఆరంభించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' సంజూ శాంసన్ (52 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 82 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో సత్తా చాటిన వేళ.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 20 పరుగుల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 193 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (29 బంతుల్లో ఫోర్, 3 సిక్సర్లతో 43) అదరగొట్టాడు. లఖ్‌నవూ బౌలర్లలో నవీనుల్ హక్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో లఖ్‌నవూ ఓవర్లన్నీ ఆడి 173/6 స్కోరు మాత్రమే చేసింది. బౌల్ట్ (2/35) దెబ్బకు జెయింట్స్ 11/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ రాహుల్ (58), దీపక్ హుడా (26) 4వ వికెట్‌కు 49 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. వీరి భాగస్వామ్యం బలపడుతున్న సమయంలో హుడాను చాహల్ అవుట్ చేశాడు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (41 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 నాటౌట్), రాహుల్.. 5వ వికెట్‌కు 85 పరుగుల భాగస్వామ్యంతో రాజస్థాన్ శిబిరంలో గుబులు రేపారు. అయితే, డెత్ ఓవర్లలో సందీప్ శర్మ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లఖ్‌నవూ జోరును అడ్డుకొన్నాడు. ఆఖరి 4 ఓవర్లలో 49 పరుగులు కావాల్సిన సమయంలో.. అర్ధ శతకం పూర్తి చేసుకొన్న రాహుల్‌ను సందీప్ క్యాచ్ అవుట్ చేసి లఖ్‌నవూను దెబ్బతీశాడు.

ఆదుకొన్న శాంసన్, పరాగ్: అంతకుముందు రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు బట్లర్ (11), యశస్వీ జైస్వాల్ (24) పవర్‌ప్లేలోపే పెవిలియన్ చేరారు. అయితే, కెప్టెన్ శాంసన్‌కు పరాగ్ రూపంలో చక్కని సహకారం లభించడంతో స్కోరు వేగం పుంజుకొంది. 9వ ఓవర్‌లో యష్ బౌలింగ్‌లో పరాగ్ బంతిని బౌండ్రీ ఆవలకు తరలించగా.. శాంసన్ 2 సిక్సర్లతో 21 పరుగులు రాబట్టడంతో రాజస్థాన్ 84/2తో నిలిచింది. 15వ ఓవర్‌లో నవీన్ బౌలింగ్‌లో 4,6తో జోరుచూపిన పరాగ్.. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి అవుటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో శాంసన్, ధ్రువ్ జురెల్ (20 నాటౌట్) వేగంగా 43 పరుగులు జోడించడంతో.. రాజస్థాన్ స్కోరు 190 మార్క్ దాటింది.

హర్షిత్ రాణాకు భారీ జరిమానా

కోల్‌కతా: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన కోల్‌కతా నైట్ రైడర్స్ పేసర్ హర్షిత్ రాణాపై భారీ జరిమానా పడింది. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో రెండుసార్లు అనుచితంగా ప్రవర్తించడంతో అతడి మ్యాచ్ ఫీజు లో మొత్తం 60 శాతం కోత విధించారు. రెండుసార్లు కోడ్ ఉల్లంఘించిన రాణా మ్యాచ్ ఫీజులో 10, 50 శాతం జరిమానా విధించామని ఐపీఎల్ తెలిపింది. అయితే, ఆ సందర్భాల గురించిన వివరాలను మాత్రం వెల్లడించలేదు. అయితే, సన్‌రైజర్స్ ఓపెనర్ మయాంక్ అవుటై వెళ్తున్నప్పుడు రాణా ఫ్లయింగ్ కిస్ ఇచ్చి.. అతడిని రెచ్చగొట్టేలా ప్రవర్తించడం ఇందుకు ఒక కారణమని తెలుస్తోంది.

ముంబై.. అదే తీరు!


విజయానందంలో గిల్, ఉమేశ్


సాయి సుదర్శన్ (45)

నేటి మ్యాచ్
బెంగళూరు X పంజాబ్
రాత్రి 7.30 గం. నుంచి

ఓటమితో ఆరంభం
గుజరాత్ బౌలర్లు అదుర్స్
ఆఖరి ఓవర్‌లో విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో తమ ఆరంభ మ్యాచ్‌ను ఓడడం ముంబై ఇండియన్స్‌కు ఆనవాయితీగా మారినట్టుంది. గుజరాత్ టైటాన్స్‌ను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయడంతో 2012 సీజన్ తర్వాత తమకు తొలి మ్యాచ్ విజయం ఖాయమని ఫ్యాన్స్ ఖుషీ అయ్యారు. తీరా చివరి ఆరు ఓవర్లలో.. చేతిలో ఏడు వికెట్లున్నా 48 రన్స్ చేయలేక చతికిలపడింది. దీంతో కొత్త కెప్టెన్ వచ్చినా వరుసగా 12వ 'తొలి' ఓటమి తప్పలేదు. అటు టైటాన్స్ బౌలర్లు మాత్రం పట్టు వదలకుండా, కీలక డెత్ ఓవర్లలో పైచేయి సాధించడం ఫలితాన్నిచ్చింది. దీంతో ఆదివారం ఉత్కంఠ భరితంగా ముగిసిన ఈ మ్యాచ్‌లో ఆరు పరుగుల తేడాతో గుజరాత్ నెగ్గింది. గిల్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (45), గిల్ (31), తెవాటియా (22) రాణించారు. బుమ్రాకు మూడు, కొట్జీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 162 పరుగులు చేసి ఓడింది. బ్రెవిస్ (46), రోహిత్ (43), తిలక్ (25) ఆకట్టుకున్నారు. స్పెన్సర్ జాన్సన్, ఉమేశ్, ఒమర్జాయ్, మోహిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సాయి సుదర్శన్ నిలిచాడు.

బౌలింగ్ భళా: ఓ మాదిరి ఛేదనలో ముంబైని టైటాన్స్ బౌలర్లు అడ్డుకున్నారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఇషాన్ (0) వెనుదిరగ్గా, అరంగేట్ర బ్యాటర్ నమన్ ధిర్ (20) ఉన్న కాసేపు అదరగొట్టాడు. ఒమర్జాయ్ ఓవర్‌లో తను 4,4,4,6 బాది ఆఖరి బంతికి అవుటయ్యాడు. అనంతరం ఓపెనర్ రోహిత్, డివాల్డ్ బ్రెవిస్ భారీషాట్లతో జీటీ బౌలర్లను ఆడుకున్నారు. ఇద్దరి జోరుతో ముంబై అవలీలగా గెలుస్తుందనిపించింది. రోహిత్ అర్ధసెంచరీకి ముందు 13వ ఓవర్‌లో ఎల్బీ కావడంతో మూడో వికెట్‌కు 77 పరుగుల మెరుపు భాగస్వామ్యం ముగిసింది. ఇక్కడే మ్యాచ్ టర్న్ అయ్యింది. కాసేపటికే బ్రెవిస్‌ను మోహిత్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా స్కోరులో వేగం తగ్గింది. ఇక 12 బంతుల్లో 27 రన్స్ కావాల్సిన వేళ తిలక్, కొట్జీ (1) వికెట్లను పేసర్ జాన్సన్ తీయడంతో సమీకరణం 19 రన్స్‌కి మారింది. అయితే ఆఖరి ఓవర్ తొలి రెండు బాల్స్‌ను హార్దిక్ 6,4 బాదడంతో మ్యాచ్ ముంబై వైపు మొగ్గింది. కానీ మూడు, నాలుగు బంతుల్లో హార్దిక్ (11), పియూష్ చావ్లా (0)ల వికెట్లు తీసిన ఉమేశ్ గట్టి షాకే ఇచ్చి మ్యాచ్‌ను ముగించాడు.

మెరుపుల్లేవ్..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్ వేగంగా ఆరంభమైనా మధ్య ఓవర్లలో భారీ షాట్లు ఆడలేకపోయింది. స్టార్ పేసర్ బుమ్రా మూడు వికెట్లతో గుజరాత్‌ను కట్టడి చేశాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు సాహా (15), గిల్ 31 పరుగులు జోడించారు. వీరి నిష్క్రమణ తర్వాత సాయి సుదర్శన్, ఒమర్జాయ్ (17) మూడో వికెట్‌కు 40 పరుగులు జత చేర్చారు. 17వ ఓవర్‌లో మిల్లర్ (12), సాయిని బుమ్రా అవుట్ చేశాడు. అయితే రాహుల్ తెవాటియా 18వ ఓవర్‌లో 6,4,4తో 19 రన్స్ అందించడంతో జట్టు స్కోరు 150 దాటగలిగింది. కానీ ఆఖరి ఓవర్‌లో కొట్జీ.. తెవాటియా వికెట్‌తో 7 పరుగులే ఇచ్చాడు.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) బుమ్రా 19, గిల్ (సి) రోహిత్ (బి) చావ్లా 31, సుదర్శన్ (సి) తిలక్ (బి) బుమ్రా 45, ఒమర్జాయ్ (సి) తిలక్ (బి) కొట్జీ 17, మిల్లర్ (సి) హార్దిక్ (బి) బుమ్రా 12, విజయ్ శంకర్ (నాటౌట్) 6, తెవాటియా (సి) నమన్ (బి) కొట్జీ 22, రషీద్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 168/6; వికెట్ల పతనం:** 1-31, 2-64, 3-104, 4-133, 5-134, 6-161; **బౌలింగ్:** హార్దిక్ 3-0-30-0, ల్యూక్ 2-0-25-0, బుమ్రా 4-0-14-3, ములానీ 3-0-24-0, పియూష్ చావ్లా 3-0-31-1, నమన్ ధిర్ 1-0-13-0, కొట్జీ 4-0-27-2.

ముంబై: ఇషాన్ (సి) సాహా (బి) ఒమర్జాయ్ 0, రోహిత్ (ఎల్బీ) కిషోర్ 43, నమన్ (ఎల్బీ) ఒమర్జాయ్ 20, బ్రెవిస్ (సి అండ్ బి) మోహిత్ 46, తిలక్ వర్మ (సి/సబ్) మనోహర్ (బి) జాన్సన్ 25, టిమ్ డేవిడ్ (సి) మిల్లర్ (బి) మోహిత్ 11, హార్దిక్ (సి) తెవాటియా (బి) ఉమేశ్ 11, కొట్జీ (సి అండ్ బి) జాన్సన్ 1, ములానీ (నాటౌట్)1, పియూష్ (సి) రషీద్ (బి) ఉమేశ్ 0, బుమ్రా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 162/9; వికెట్ల పతనం:** 1-0, 2-30, 3-107, 4-129, 5-142, 6-148, 7-150, 8-160, 9-160; **బౌలింగ్:** ఒమర్జాయ్ 3-0-27-2, ఉమేశ్ యాదవ్ 3-0-31-2, రషీద్ ఖాన్ 4-0-23-0, సాయి కిషోర్ 4-0-24-1, జాన్సన్ 2-0-25-2, మోహిత్ శర్మ 4-0-32-2.



ఆంధ్ర జట్టుకు నజరానా

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇటీవల జరిగిన బీసీసీఐ అండర్-19 మహిళల టీ20 చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఆంధ్ర జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సన్మానించింది. ఆదివారం ఇక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జట్టుకు ఏసీఏ తరఫున రూ. 20 లక్షలు అందజేశారు. అలాగే ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ సుమారు రూ.17 లక్షల విలువ గల ఎలక్ట్రిక్ స్కూటర్లను జట్టు సభ్యులకు బహూకరించారు. ఇక, వచ్చేనెల నుంచి జోనల్ స్థాయిలో ఆడిన క్రికెటర్లకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ.3 వేలు ఇవ్వనున్నామని ఏసీఏ తెలిపింది. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి, సీఈఓ శివారెడ్డి, కోచ్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో శ్రీకాంత్ అవుట్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో తెలుగు షట్లర్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన సెమీస్ పోరులో శ్రీకాంత్ 21-15, 9-21, 18-21తో లిన్ చున్ యి (తైపీ) చేతిలో ఓడాడు. ఇక, పోలిష్ ఓపెన్ టోర్నీలో భారత జోడీ అర్జున్-ధ్రువ్ డబుల్స్ విజేతగా నిలిచింది.

ఓటమి అంచున బంగ్లాదేశ్

సిల్హట్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి అంచున నిలిచింది. 511 పరుగుల భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఈ జట్టు ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో 47/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఫెర్నాండోకు 3 వికెట్లు దక్కాయి. విజయానికి బంగ్లా 464 పరుగుల దూరంలో ఉండ డంతో నాలుగో రోజు లంక గెలవడం లాంఛనమే. అంతకుముందు లంక రెండో ఇన్నింగ్స్‌లోనూ కమిందు (164), ధనంజయ (108) శతకాలు బాదడంతో జట్టు 418 పరుగులు సాధించింది. మెహిదీ హసన్ 4 వికెట్లు తీశాడు.

శ్రీజ.. బంగారం



న్యూఢిల్లీ: తెలుగమ్మాయి శ్రీజ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటింది. లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఓ స్వర్ణం, రజతంతో రెండు పతకాలు కొల్లగొట్టి అదరహో అనిపించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో శ్రీజ 4-1తో నూట్ సారా డి (లక్సెంబర్గ్)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. ఆ తర్వాత దియా చితాలెతో కలిసి డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. డబుల్స్ ఫైనల్లో శ్రీజ-దియా జోడీ 1-3తో హాంకాంగ్ ద్వయం డో హో- చెంగ్జు చేతిలో ఓటమిపాలైంది. ఈ మెగా టోర్నీలో స్వర్ణం నెగ్గిన తొలి భారత టీటీ క్రీడాకారిణిగా శ్రీజ రికార్డుకెక్కింది.

ఆర్చరీలో చికితకు పసిడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా సౌత్‌జోన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పెద్దపల్లి ఆర్చర్ చికితరావు స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. ఆదివారం చెన్నైలో జరిగిన ఈ పోటీల కాంపౌండ్ విభాగం ఫైనల్లో చికిత 143/150 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. మరో తెలుగమ్మాయి శ్రేష్ఠారెడ్డి 137 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం అందుకుంది.

'ఆస్ట్రేలియన్' కింగ్ కార్లోస్

మెల్‌బోర్న్: ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములావన్‌లో విజేతగా నిలిచాడు. ఫెరారీకే చెందిన చార్లెస్ రెండో స్థానం, మెక్‌లారెన్ డ్రైవర్ నోరిస్ మూడో స్థానం సాధించారు.

బిజినెస్

2030 నాటికి టాప్ 30లోకి
ఆకాశా ఎయిర్

న్యూఢిల్లీ: భారత్‌లో విమానయాన ధరలు "నమ్మలేనంత చౌక"గా ఉన్నాయని, ఆకాశా ఎయిర్‌కు మంచి వృద్ధి అవకాశాలు కనిపిస్తున్నాయని ఆకాశా ఎయిర్ సీఈఓ వినయ్ దూబే అన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 30 విమానయాన సంస్థల్లో ఒకటిగా నిలవాలన్నది తమ లక్ష్యమని ఆయన చెప్పారు. వచ్చే గురువారం ముంబై నుంచి దోహకు తొలి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అవుతామని స్పష్టం చేశారు. విమానయాన రంగంలో పోటీ ఎప్పుడూ తీవ్రంగానే ఉంటుందని, ఫండమెంటల్స్‌పై దృష్టి కేంద్రీకరించినట్టయితే ఆకాశా ఎయిర్‌కే కాకుండా అన్ని విమానయాన సంస్థలకు అవకాశాలు ఉజ్వలంగానే ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2022 ఆగస్టులో విమాన సర్వీసులు ప్రారంభించిన ఆకాశా ఎయిర్ ప్రస్తుతం 24 విమానాలతో 4.5 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది.

మళ్లీ ఎఫ్‌పీఐల వెల్లువ

ఈ నెలలో ఇప్పటికే రూ.38,000 కోట్లు ఇన్వెస్ట్

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో సానుకూల పవనాలు వీస్తుండడంతో పాటు భారత స్థూల ఆర్థిక స్థితి పటిష్ఠంగా ఉందన్న సంకేతాల నడుమ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) దృష్టి మరోసారి భారత ఈక్విటీ మార్కెట్‌పై పడింది. మార్చి నెలలో ఎఫ్‌పీఐలు ఇప్పటివరకు రూ.38,000 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఫిబ్రవరిలో ఎఫ్‌పీఐల మార్కెట్ పెట్టుబడులు అత్యంత నిరాశావహంగా రూ.1,539 కోట్లుగా మాత్రమే ఉన్నాయి. కాగా జనవరిలో మాత్రం రూ.25,743 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

2024లో ఎఫ్‌పీఐలు ఇప్పటివరకు రూ.13,893 కోట్లు ఈక్విటీల్లోను, రూ.55,480 కోట్లు డెట్ మార్కెట్లోను ఇన్వెస్ట్ చేసినట్లు డిపాజిటరీల వద్ద ఉన్న గణాంకాలు తెలుపుతున్నాయి. ఇటీవల దేశీయ మార్కెట్లో ఏర్పడిన కరెక్షన్ వారికి మంచి పెట్టుబడి అవకాశంగా నిలిచిందని పరిశీలకులంటున్నారు. దీనికి తోడు బలమైన జీడీపీ వృద్ధి రేటు, ఆర్‌బీఐ పాలసీ రేట్ల విషయంలో వైఖరి మార్చుకోవచ్చన్న సంకేతాలు కూడా ఎఫ్‌పీఐల పెట్టుబడులు పెరగడానికి దోహదపడిన అంశాలుగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.

నేడు మార్కెట్లకు సెలవు

హోలీ సందర్భంగా సోమవారం స్టాక్ మార్కెట్లు.. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మార్కెట్లు మంగళవారం తిరిగి యథావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (వెక్ 100 గుడ్లు)



24వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	395	విశాఖపట్నం	415
25వ తేదీ			
చిత్తూరు	458	వరంగల్	397
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	గోదావరి	116
వరంగల్	118	విజయవాడ	116
కరీంనగర్	118	గుంటూరు	117
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	117
కర్నూలు	118	చిత్తూరు	118
విశాఖపట్నం	115		

ప్రభుత్వానికి
డివిడెండ్ బొనాంజా
ఖజానాకు రూ.62,000 కోట్లు!
తుస్సుమన్న డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్‌ఈ)ను ఎంతగా ఆడిపోసుకుంటున్నా.. అవి పెద్దఎత్తున కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్ల రూపంలో ఆదాయం సమకూరుస్తున్నాయి. ఈ నెలాఖరుతో ముగిసే 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ ఈ సంస్థలు దాదాపు రూ.62,000 కోట్లు డివిడెండ్ రూపంలో సమకూరుస్తాయని అంచనా. ఇందులో ఇప్పటికే రూ.61,000 కోట్లు ప్రభుత్వ ఖాతాకు చేరాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు రూ.50,000 కోట్లకు మించి డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం వరుసగా ఇది మూడో సంవత్సరం.

అంచనాలకు మించి..

నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం సీపీఎస్ఈల నుంచి ప్రభుత్వ ఖజానాకు రూ.43,000 కోట్లు డివిడెండ్ల రూపంలో ఆదాయం లభిస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రకటించారు. తరువాత దీన్ని రూ.50,000 కోట్లకు సవరించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఈ అంచనాను కూడా మించి పోయి సీపీఎస్ఈలు కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.62,000 కోట్లు డివిడెండ్ల రూపంలో సమకూర్చనున్నాయి. 2016 నాటి మార్గదర్శకాల ప్రకారం ప్రతి సీపీఎస్ఈ తన నికర లాభంలో 30 శాతం లేదా ఆ సంస్థ ఈక్విటీలో ప్రభుత్వ వాటాపై 30 శాతం డివిడెండ్‌గా చెల్లించాలి.

లక్ష్యాన్ని చేరని డిజిన్వెస్ట్‌మెంట్

డివిడెండ్ ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని మించినా.. సీపీఎస్‌యూల పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్‌మెంట్) లక్ష్యం మాత్రం లక్ష్యానికి ఆమడ దూరంలో ఉంది. వాస్తవానికి డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.51,000 కోట్లు సమీకరించాలని 2023-24 బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్ణయించారు. తర్వాత దీన్ని రూ.30,000 కోట్లకు కుదించారు. అయినా ఈ నెలాఖరుకు రూ.15,000 కోట్లు కూడా సమకూరే పరిస్థితి కనిపించడం లేదు. ఐడీబీఐ బ్యాంక్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బీఈఎంఎల్, ఎన్ఎండీసీ స్టీల్ వంటి కంపెనీల అమ్మకం ముందుకు సాగకపోవడం ఇందుకు ప్రధాన కారణం.

పీఎస్‌బీల నుంచి రూ.15,000 కోట్ల డివిడెండ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ).. ప్రభుత్వ ఖజానాకు రూ.15,000 కోట్లకుపైగా డివిడెండ్ ఆదాయం సమకూర్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి 12 పీఎస్‌బీలు రూ.98,000 కోట్ల నికర లాభం ఆర్జించాయి. గత ఆర్థిక సంవత్సరం (2022-23) మొత్తం మీద ఆర్జించిన రూ.1.05 లక్షల కోట్లతో పోలిస్తే ఇది రూ.7,000 కోట్లు మాత్రమే తక్కువ. మార్చితో ముగిసే 2023-24 ఆర్థిక సంవత్సరం పీఎస్‌బీల లాభాలు 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని మించిపోతాయని అంచనా. దీంతో గత ఆర్థిక సంవత్సరం రూ.13,804 కోట్లు ఉన్న పీఎస్‌బీల డివిడెండ్ చెల్లింపులు ఈ ఆర్థిక సంవత్సరం రూ.15,000 కోట్లు మించుతాయని భావిస్తున్నారు.

వేదాంత లిమిటెడ్
రూ.50,000 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ పెద్దఎత్తున వ్యాపార విస్తరణకు సిద్ధమైంది. ఇందులోభాగంగా జింక్, అల్యూమినియం, ఇనుప ఖనిజం, అల్యూమినియం, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లో 600 కోట్ల డాలర్లు (సుమారు రూ.50,000 కోట్లు) పెట్టుబడి పెట్టనుంది. ఈ పెట్టుబడులతో గ్రూప్ కంపెనీల వార్షిక స్థూల లాభం 250 కోట్ల డాలర్ల మేర పెరుగుతుందని మదుపరుల సమావేశంలో తెలిపింది. వచ్చే పాతికేళ్లలో కంపెనీ మరో ఉన్నత స్థాయికి చేరుతుందని సమావేశంలో పాల్గొన్న వేదాంత లిమిటెడ్ చైర్మన్ అనిల్ అగర్వాల్ తెలిపారు. ఈ విస్తరణ ప్రాజెక్టులన్నీ పూర్తయితే 2027 మార్చి నాటికి స్థూల లాభమే 750 కోట్ల డాలర్ల మేర ఉంటుందని అగర్వాల్ వెల్లడించారు.

ఐఐఎఫ్ఎల్, జేఎం ఫైనాన్షియల్‌పై
ప్రత్యేక ఆడిట్: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ: నిబంధనలు తుంగలో తొక్కి ఎడాపెడా అడ్డగోలుగా రుణాలు మంజూరు చేసిన ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌పై మరిన్ని కఠిన చర్యలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ రెండు కంపెనీల పద్దులను ఫోరెన్సిక్ ఆడిట్ చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం సెబీ గుర్తింపు పొందిన ఫోరెన్సిక్ ఆడిట్ సంస్థలు ఏప్రిల్ 8లోగా ప్రతిపాదనలు పంపాలని టెండర్ జారీ చేసింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 12 నుంచే ఎంపికైన సంస్థలకు ఫోరెన్సిక్ ఆడిట్ బాధ్యతలు అప్పగించనుంది.

చిన్న నగరాల్లో ప్రీమియం కార్లకు డిమాండ్

ఫోక్స్‌వ్యాగన్ ఇండియా డైరెక్టర్ ఆశిష్ గుప్తా



జైపూర్: దేశంలోని మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో పెర్ఫార్మెన్స్ ఆధారంగా నడిచే ప్రీమియం కార్లకు పెరిగిన ఆదరణను సొమ్ము చేసుకోవాలని ఫోక్స్‌వేగన్ భావిస్తోంది. ఈ ఏడాది ఈ విభాగంలో అమ్మకాలు 15 శాతం పెరుగుతాయని అంచనా వేస్తోంది. గత ఏడాది కంపెనీ దేశీయ మార్కెట్లో 44,000 కార్లు విక్రయించింది. భారత మార్కెట్లో కంపెనీ విక్రయిస్తున్న కార్లలో ప్రీమియం పెర్ఫార్మెన్స్ విభాగానికి చెందిన ఎస్‌యూవీ టైగన్, సెడాన్ కారు వర్టస్ 1.5 పెట్రోల్ ఇంజన్ 'జీటీ' ట్రిమ్ కార్లున్నాయి. అయితే ఇదే జీటీ విభాగంలో అందుబాటు ధరల్లో కార్లు తీసుకురావాలన్న కస్టమర్ల కోరికను పరిగణనలోకి తీసుకుని ఈ రెండింటిలోనూ ఒక లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో 'జీటీ లైన్' వెర్షన్లు అందుబాటులోకి తెచ్చినట్టు ఫోక్స్‌వేగన్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. తమ మొత్తం కార్ల విక్రయాల్లో 20 నుంచి 25 శాతం జీటీ వెర్షన్లేనని గుప్తా చెప్పారు.

ఏప్రిల్ 3న భారతి హెక్సాకామ్ ఐపీఓ ప్రారంభం

న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతి హెక్సాకామ్.. పబ్లిక్ ఇష్యూ ఏప్రిల్ 3న ప్రారంభమై 5న ముగియనుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తున్న తొలి పబ్లిక్ ఇష్యూ ఇదే. ఇష్యూలో భాగంగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రస్తుత వాటాదారులైన టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ 15 శాతం వాటాకు సమానమైన 7.5 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఈ ఇష్యూ ద్వారా ప్రస్తుత వాటాదారు మాత్రమే తన వాటాలను విక్రయిస్తోంది. కంపెనీ ఎలాంటి నిధులు సమీకరించటం లేదు. ప్రస్తుతం కంపెనీలో భారతి ఎయిర్‌టెల్‌కు 70 శాతం వాటా ఉండగా ప్రభుత్వ రంగ సంస్థ టెలికమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియాకు 30 శాతం వాటా ఉంది.

టెక్ వ్యూ

కీలక స్థాయి 22,000 వద్ద పరీక్ష


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 22,000 వద్ద ప్రారంభమై కరెక్షన్‌లో పడి 21,700 వరకు దిగజారినా రికవరీ సాధించి వారంలో 70 పాయింట్ల మేరకు లాభపడి చివరికి ఆ కీలక స్థాయి కన్నా పైనే ముగిసింది. సానుకూల సంకేతం కోసం వరుసగా రెండో వారంలో కూడా 22,000 వద్ద మరింత కన్సాలిడేషన్ సాధించడం అవసరం. అలాగే ఈ వారంలో మూడు ట్రేడింగ్ దినాలు మాత్రమే ఉన్నందు వల్ల మరింత కన్సాలిడేషన్‌కే అవకాశాలున్నాయి. నిఫ్టీ గత రెండు నెలల కాలంలో 22,000 వద్ద సైడ్‌వేస్‌లో కదలాడుతూ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. గత వారం మిడ్‌క్యాప్ 100 సూచీ 600 పాయింట్లు, స్మాల్‌క్యాప్ 100 సూచీ 200 పాయింట్ల లాభంతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల తీరు ఆధారంగా ఇప్పుడు మార్కెట్ అప్రమత్త ధోరణిని కొనసాగించవచ్చు. అందువల్ల ప్రధాన మానసిక అవధి 22,000 వద్ద పరీక్ష ఎదురుకావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ రికవరీ బాట పట్టినా సానుకూలత కోసం నిరోధ స్థాయి 22,200 కన్నా పైన పటిష్ఠంగా క్లోజ్ కావాలి. స్వల్పకాలిక నిరోధం 22,550. కొద్ది రోజుల క్రితం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి ఇది.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనపడినా రాబోయే కొద్ది రోజుల్లో ట్రెండ్‌లో సానుకూలత కోసం 22,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే ఇంకా బలహీనపడుతుంది. దిగువన మరో మద్దతు స్థాయి 21,700. ఇక్కడ కూడా విఫలమైతే మరింతగా దిగజారే ప్రమాదంలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 21,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారంలో ఈ సూచీ 45,800 వద్ద రికవరీ సాధించి చివరికి 46,860 వద్ద ముగిసింది. కాని ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 48,600 కన్నా ఇంకా దిగువనే ఉంది. రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 47,200 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుత మద్దతు స్థాయి 46,500 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 45,800.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం స్వల్పకాలిక సపోర్ట్ ట్రెండ్‌లైన్ కన్నా దిగువన ఉండడం అప్రమత్త సంకేతం. 22,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద విఫలమైతే మరింత స్వల్పకాలిక బలహీనతను సూచిస్తుంది. 22,200 వద్ద డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడింది. సానుకూలత కోసం దీన్ని బ్రేక్ చేయాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం ఈ వారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

మంగళవారం స్థాయిలు	
నిరోధం	22,140, 22,200
మద్దతు	22,000, 21,940

www.sundartrends.in



తనను కలిసిన ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులతో మాట్లాడుతున్న చంద్రబాబు, పక్కన మంద కృష్ణమాదిగ

టీడీపీ గెలుపు.. మాదిగల గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

తెలుగుదేశం అని తెలిపారు. తెలుగుదేశం విజయంలో మాదిగలు కీలక పాత్ర పోషించాలని కోరారు. 40 ఏళ్లుగా పార్టీని మాదిగ సామాజికవర్గం ఆదరిస్తోందన్నారు. అలాంటి మాదిగ వర్గాన్ని పైకి తెచ్చేందుకు తాను ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తెలుగుదేశం గెలుపు మాదిగల గెలుపు అవుతుందన్నారు. మాదిగ సామాజికవర్గాన్ని అధికారంలో భాగస్వాములు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాదిగ సమస్యలపై మందకృష్ణ ప్రత్యేకంగా చర్చించారు. దళితులపై వైసీపీ ప్రభుత్వ దమన కాండను ఎదుర్కోవడంలో మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.

వర్గీకరణకు తీర్మానం చేయాలి: మందకృష్ణ

అనంతరం మందకృష్ణ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదట సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయాలని మందకృష్ణ కోరారు. రాజ్యాంగబద్ధ సంస్థల్లో మాదిగ వర్గానికి తగు ప్రాధాన్యం ఇవ్వాలని, కార్పొరేషన్లలో, నామినేటెడ్ పదవుల్లో మాదిగవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీలకు రద్దు చేసిన అన్ని పథకాలు తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వర్గీకరణ విషయంలో జగన్ మాదిగలకు అన్యాయం చేశారని, సుప్రీంకోర్టులో వర్గీకరణ విచారణ సందర్భంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం లాయర్‌ను కూడా పెట్టలేదని మండిపడ్డారు. మాదిగల సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని, మాదిగలంతా నిద్రాహారాలు మాని కూటమి గెలుపు కోసం పనిచేస్తారని తెలిపారు. 30న గుంటూరులో ఎన్నికల ప్రచార సరళిపై రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, గ్రామ స్థాయినుంచి ఇంటింటికీ కూటమి గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబుపై తమకు నమ్మకముందన్నారు. 29 రిజర్వుడ్ సీట్లలో జగన్ మాదిగలకు కేవలం పది స్థానాలు మాత్రమే ఇచ్చారని, టీడీపీ పోటీచేసే 24లో చంద్రబాబు 14 మాదిగలకు కేటాయించారన్నారు. పవన్ కల్యాణ్ పోటీ చేసే రిజర్వుడ్ స్థానాల్లో మూడింట్లో ఒకటి మాదిగలకు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. గతంలో రాజ్యసభ స్థానం వర్ల రామయ్యకు చేజారిందని, ఈ సారి కచ్చితంగా ఆయనకు ఇవ్వాలని కోరామన్నారు. ఎన్డీయే కూటమి గెలుపు మాదిగల గెలుపుగా భావిస్తామని మందకృష్ణ పేర్కొన్నారు.

27 నుంచి ప్రజాగళం సభలు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 27 నుంచి ప్రజాగళం పేరుతో ఎన్నికల ప్రచారం, రోడ్డు షోలు నిర్వహించనున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు నియోజకవర్గాల్లో సభలు, రోడ్డు షోలు సాగేలా ప్రణాళిక రూపొందించారు. 27వ తేదీ నుంచి 31 తేదీ వరకు పర్యటన ఖరారైంది. 27వ తేదీ పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్‌లో చంద్రబాబు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. 28న రాప్తాడు, సింగనమల, కదిరిలో పర్యటిస్తారు. 29వ తేదీ శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు, 30న మైదుకూరు, ప్రొద్దుటూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, 31న కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో చంద్రబాబు పర్యటిస్తారు.

ఆ ప్రభుత్వ అజెండా అనుమతించొద్దు

▸▸ సీఈవోకు అచ్చెన్న లేఖ



టెక్కలి మండలం భగవాన్‌పురంలో పర్యటిస్తున్న అచ్చెన్నాయుడు

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22, 23 తేదీల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నతాధికారుల సమావేశంలో ఎన్నికల కమిషన్ అనుమతి కోసం అజెండా తయారుచేశారని, ఆ అజెండాలోని అంశాలన్నీ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖ రాశారు. టెట్ పరీక్ష ఫలితాలు ప్రకటించేందుకు అనుమతి, 6100 డీఎస్సీ పోస్టుల భర్తీకి అనుమతించాలని, డిప్యూటీ డెరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డి.వి సుప్రకాష్‌ను జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించేందుకు అనుమతించాలంటూ.. ఇలా 30కి పైగా ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైన అనుమతుల కోసం అజెండాలో సీఎం కోరారన్నారు. ఇవన్నీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధం కనుక అనుమతించవద్దని కోరారు.

రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మార్చేశారు

టెక్కలి, మార్చి 24: రాష్ట్రాన్ని గడచిన ఐదేళ్లలో గంజాయి, డ్రగ్స్ హబ్‌గా అధికార పార్టీ మార్చేసిందని అచ్చెన్నాయుడు ఆరోపించారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం భగవాన్‌పురంలో ఆయన పర్యటించారు. జగన్ ఏలుబడిలో అవినీతి, అరాచక పాలన కొనసాగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ఎక్కడా మచ్చుకైనా కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలతో పాటు తల్లీ, చెల్లీ, బాబాయిని.. ఇలా అందర్నీ మోసం చేసిన సీఎం జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్పాలని, రానున్న ఎన్నికల్లో వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు. టీడీపీని గెలిపించాలని కోరారు.

నవమోసాలతో జగన్ కుట్ర: రఫీ

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జగన్ నవమోసాలతో ఎన్నికల్లో గెలవాలని కుట్ర పన్నారని టీడీపీ అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ అన్నారు. ఆదివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దొంగ ఓట్లు చేర్పించడం, ప్రతిపక్షాల ఓట్లు తొలగించడం, అవినీతి సొమ్ముతో పోలీసులు, అధికారులను, ఉద్యోగులను కొనడం, రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి అశాంతి సృష్టించడం, మాదకద్రవ్యాలతో యువతను నాశనం చేయడం, పోలింగ్ బూత్‌ల్లో రౌడీలను పెట్టి ఆక్రమణ చేయడం, మాఫియాల అండను వెనుక పెట్టుకుని.. నేనొక్కడినే, నాకెవరూ లేరంటూ ఏడ్వడం, 98.5 శాతం హామీలు అమలు చేశానని చెప్పడం, ప్రభుత్వ అధికారులను బయటపెట్టి లోబరుచుకోవడం, బూటకపు సామాజిక న్యాయంపై ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం ఇలా తొమ్మిది రకాల మోసాలకు పాల్పడి గెలవాలని జగన్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

ఇండోసోల్‌కు భూ కేటాయింపుపై సీబీఐ విచారణ: సీపీఐ డిమాండ్

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి 17,630 ఎకరాల భూమిని కేటాయించడంపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి ఒక రోజు ముందు హడావుడిగా తన బినామీ కంపెనీ అయిన ఇండోసోల్‌కు 17,630 ఎకరాల భూమిని కేటాయించడం ముఖ్యమంత్రి జగన్ బరితెగింపునకు నిదర్శనమని ఆయన విమర్శించారు. మోదీ ప్రభుత్వం అండగా ఉండటమే జగన్ బరితెగింపునకు కారణమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



జగన్ పత్రికపై 20 కోట్లకు దావా!

▸▸ పరువు నష్టం నోటీసు పంపిన పురందేశ్వరి

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జగన్ పత్రికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరువునష్టం దావాకు సిద్ధమయ్యారు. విశాఖలో డ్రగ్స్ దిగుమతి వ్యవహారానికి సంబంధించి తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు రాతలు రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీబీఐ సోదాలు నిర్వహించిన సంధ్య ఎక్స్‌పోర్ట్స్‌లో పురందేశ్వరి కుటుంబ సభ్యులకు భాగస్వామ్యం ఉందంటూ జగన్ సొంత పత్రిక ఆధార రహిత వార్తలు ప్రచురించిందని ఆమె ఆరోపిచారు. తప్పుడు కథనాలపై న్యాయ పోరాటానికి సిద్ధమైన పురందేశ్వరి... రూ.20కోట్లకు ఆ పత్రిక యాజమాన్యానికి పరువు నష్టం నోటీసులు పంపారు. సంధ్య ఎక్స్‌పోర్ట్ ఎండీ వీరభద్రరావుతో వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు రాయడం వెనుక దురుద్దేశం ఉందని, కూనం కుటుంబంతో తనకు బంధుత్వం, వ్యాపార భాగస్వామ్యం ఏదీ లేదని స్పష్టం చేశారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్న తనను డ్రగ్స్ వ్యాపారాలకు సంబంధించిన కంపెనీల్లో భాగస్వామి అనడం రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయడమేనని పేర్కొన్నారు. ఆ వ్యవహారంతో సంబంధం లేదని వివరణ ఇచ్చినా పదేపదే అవే రాతలు రాయడం వెనుక ఉన్న తన పరువుకు భంగం కలిగించే ఉద్దేశమేనని పురందేశ్వరి నోటీసులో వివరించారు. పద్నాలుగు రోజుల్లో తన నోటీసుకు ఆధారాలతో సహా సమాధానం ఇవ్వకపోతే కోర్టులో కేసు నమోదు చేస్తానని అందులో పేర్కొన్నారు.

అభివృద్ధి వైపు టీడీపీ.. డ్రగ్స్ వైపు వైసీపీ

ఏది కావాలో ప్రజలే విజ్ఞత చూపాలి: లోకేశ్



మంగళగిరిలో లోకేశ్ కాన్వాయ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

మంగళగిరి/తాడేపల్లి, మార్చి 24: "అభివృద్ధిలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా ఉంచాలన్నది టీడీపీ ఎజెండా. కానీ, డ్రగ్స్, గంజాయి, గ్యాంబ్లింగ్‌కు రాష్ట్రాన్ని రాజధానిని చేయాలన్నది వైసీపీ ఎజెండా. రాష్ట్రానికి కీలకమైన ఈ ఎన్నికల్లో ఎవరికి అధికారమివ్వాలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కోరారు. టీడీపీ అభ్యర్థిగా మంగళగిరి బరిలో ఉన్న ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తాడేపల్లిలోని వజ్ర రెసిడెన్సీ వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇసుక, మద్యం, గంజాయిలో దోచేసిన సొమ్ములను ఎన్నికలలో కొంత పెట్టుబడులుగా పెట్టి తర్వాత రాష్ట్రాన్ని నిలువునా దోచుకోవాలనే కుట్ర చేస్తున్నారని వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు. ప్రజలంతా చైతన్యవంతులై 'మై ఓట్ నాట్ ఫర్ సేల్' అనే నినాదంతో దోపిడీ దారులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని డ్రగ్స్, గంజాయిమయం చేసిన జే గ్యాంగ్.. గ్యాంబ్లింగ్‌ను కూడా చట్టబద్ధం చేసి యువత జీవితాలను సర్వనాశనం చేసే కుయుక్తులకు ప్రయత్నించిందన్నారు. 2020లోనే ఈ తరహా ఆలోచనకు తెరదీశారని తెలిపారు. దీనిలో భాగంగానే ఓ లాటరీ, గేమింగ్ కంపెనీ నుంచి వైసీపీకి రూ.160కోట్ల మేర ఎలక్టోరల్ బాండ్లు ముట్టాయని లోకేశ్ ఆరోపించారు. ఇలాంటి వారికి మరోమారు అధికారం అప్పగిస్తే ఈ తరహా దారుణాలు మరెన్నింటికో తెగబడే ప్రమాదముందన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టుచేసి జైలుకు పంపిస్తే ఆయన చేసిన అభివృద్ధిని గురించి అందరూ మాట్లాడుకున్నారు.. అదే జగన్ జైలుకెళితే ఆయన చేసిన రూ.వేలకోట్ల కుంభకోణాలు బయటపడ్డాయని, వాటిపై ప్రజలు చర్చించుకున్నారని తెలిపారు. జగన్ విధ్వంసకర విధానాల వలన పారిశ్రామికవేత్తలు ఒడిశాకు వెళ్లేందుకైనా సిద్ధపడుతున్నారు కానీ.. ఏపీకి వచ్చేందుకు మాత్రం వెనుకాడుతున్నారని లోకేశ్ విమర్శించారు. "రాష్ట్రంలో జే టాక్స్ విధానాలతో పీపీఏలను రద్దు చేశారు. కియాకు ప్రోత్సాహకాలను ఇవ్వకుండా ఇబ్బందిపెట్టారు. ముఖ్యమంత్రి స్వయంగా దావోస్ వెళ్లినా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. పరిశ్రమదారుల్లో దెబ్బతిన్న నమ్మకాన్ని పునరుద్ధరించి మళ్లీ రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరం. గతంలో గన్నవరం వద్ద తాము తెచ్చిన హెచ్‌సీఎల్ ఐటీ కంపెనీ ద్వారా దాదాపు ఏడువేలమందికి ఉద్యోగాలు వచ్చాయి" అని లోకేశ్ తెలిపారు. ప్రజలు అధికారమిస్తే విశాఖను ఐటీ హబ్‌గా మారుస్తామని చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలను తెప్పించి 20లక్షల ఉద్యోగాలను కల్పించే అంశాన్ని ఓ చాలెంజ్‌గా స్వీకరిస్తామని లోకేశ్ చెప్పారు. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు.

అభివృద్ధి కోసమే పొత్తు!

రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని లోకేశ్ అన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలను గౌరవిస్తూ, సామాజిక బాధ్యతను పెంచేలా విద్యావిధానంలో సమూల మార్పులను తీసుకువస్తామని చెప్పారు. మాజీ సైనిక ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అడ్డగోలుగా ప్రజలపై మోపిన పన్నులపై పునఃసమీక్ష చేసి రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నేతల వాహనాలే టార్గెట్టా?

▸▸ మావే ఆపాలని ఆదేశాలున్నాయా?

▸▸ కాన్వాయ్ తనిఖీలపై లోకేశ్ ఫైర్

ఎన్నికల కోడ్ పేరుతో పదే పదే తన కాన్వాయ్‌ను పోలీసులు తనిఖీ చేయడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతల వాహనాలే ఆపాలని ఆదేశాలు ఉన్నాయా? అని పోలీసులను ప్రశ్నించారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్తున్న లోకేశ్ కాన్వాయ్‌ని కేఎల్ రావు కాలనీ వద్ద ఆదివారం ఉదయం, సాయంత్రం రెండు సార్లు పోలీసులు తనిఖీ పేరిట ఆపారు. గడిచిన మూడు రోజుల్లో నాలుగుసార్లు లోకేశ్ కాన్వాయ్‌ని ఆపడం గమనార్హం. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన నారా లోకేశ్.. కారు దిగి వారిని ప్రశ్నించారు. టీడీపీ వారి వాహనాలే టార్గెట్టా? అని నిలదీశారు. కాగా, కాన్వాయ్‌లో కోడ్‌కు విరుద్ధంగా ఏమీ లేవని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించలేదని పోలీసులు నిర్ధారించారు.



కాంగ్రెస్‌లో చేరిన చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఎలిజాకు పార్టీ కండువా కప్పుతున్న పీసీసీ చీఫ్ షర్మిల

వైసీపీకి మరో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు గుడ్‌బై

▸▸ వరప్రసాద్ బీజేపీలో చేరిక.. కాంగ్రెస్‌లోకి ఎలీజా

న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల వేళ వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మరో ఇద్దరు దళిత ఎమ్మెల్యేలు.. గూడూరు(ఎస్సీ) ఎమ్మెల్యే విశ్రాంత ఐఏఎస్ అధికారి వరప్రసాద్, చింతలపూడి (ఎస్సీ) శాసనసభ్యుడు ఉన్నమట్ల రాకాడ ఎలీజా ఆ పార్టీకి రాజీనామా చేశారు. దీంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి వేరే పార్టీలోకి వెళ్లిన ఎస్సీ ఎమ్మెల్యేల సంఖ్య ఐదుకు చేరింది. ఉండవల్లి శ్రీదేవి(తాడికొండ-ఎస్సీ), కోనేటి ఆదిమూలం(సత్యవేడు-ఎస్సీ) టీడీపీలో చేరిపోగా.. నందికొట్కూరు-ఎస్సీ ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సిటింగ్ ఎమ్మెల్యేనైన తనను కాదని మేరుగ మురళీధర్‌కు గూడూరు టికెట్ ఇవ్వడంతో వరప్రసాద్ మనస్తాపం చెందారు. వైసీపీకి రాజీనామా చేసి.. ఆదివారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయంలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో బీజేపీలో చేరారు. తిరుపతి(ఎస్సీ) లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థిగా పోటీచేయనున్నట్లు తెలిసింది. ఆ పార్టీ నాయకత్వం కూడా హామీ ఇచ్చినట్లు తెలిసింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచే వైసీపీ తరఫున విజయం సాధించారు. 2019లో గూడూరు అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికయ్యారు. వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ప్రధాని మోదీకే సాధ్యమన్నారు. మరోసారి తిరుపతి ప్రజలకు సేవచేసే అవకాశం కలిగిందని చెప్పారు. ఇంకోవైపు.. చింతలపూడి వైసీపీ టికెట్ కంభం విజయరాజుకు ఇవ్వడంతో ఎలీజా కూడా ఆ పార్టీ నుంచి వైదొలిగారు. ఆదివారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ తనను దారుణంగా అవమానించిందని.. తన పార్టీ అనుకుని పని చేస్తే మోసం చేసిందని.. ప్రజాప్రతినిధిగా కనీస గౌరవాన్ని కూడా ఇవ్వలేదని విమర్శించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా తనకు తెలియకుండానే అభివృద్ధి కార్యక్రమాలను చేశారని, శిలాఫలకంపై తన పేరే లేకుండా చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో, దేశంలో కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. వైసీపీ అసంతృప్త నేతలంతా పార్టీలో చేరతారని చెప్పారు. ఈ దఫా వైసీపీ టికెట్లు దక్కని ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేల్లో చెట్టి ఫాల్గుణ (అరకులోయ-ఎస్టీ), టీజేఆర్ సుధాకరబాబు (సంతనూతలపాడు-ఎస్సీ), జొన్నలగడ్డ పద్మావతి (శింగనమల-ఎస్సీ), ఎం.బాబు (పూతలపట్టు-ఎస్సీ), కె.రక్షణనిధి (తిరువూరు-ఎస్సీ), తిప్పేస్వామి (మడకశిర-ఎస్సీ), కొండేటి చిట్టిబాబు (పి.గన్నవరం-ఎస్సీ) కూడా ఉన్నారు.

రఘురామరాజుకు నిరాశే!

▸▸ నరసాపురం బీజేపీ అభ్యర్థిగా శ్రీనివాసవర్మ



కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ సమక్షంలో బీజేపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యే వరప్రసాదరావు

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన పార్టీలతో పొత్తులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో తనకు దక్కిన ఆరు లోక్‌సభ స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం రాత్రి విడుదల చేసిన జాబితాలో నరసాపురం వైసీపీ ఎంపీ కె.రఘురామకృష్ణంరాజుకు చోటు దక్కలేదు. తాను ఆశించిన నరసాపురం పార్లమెంటరీ స్థానంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మకు టికెట్ లభించడంతో ఆయన తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి రాజమండ్రి నుంచి బరిలోకి దిగనున్నారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి రాజంపేటలో, కొత్తపల్లి గీత-అరకు(ఎస్టీ), సీఎం రమేశ్-అనకాపల్లి, వైసీపీకి రాజీనామా చేసి వచ్చిన వరప్రసాద్ తిరుపతి (ఎస్సీ)లో పోటీచేయనున్నారు. ఇక పొత్తులో తమకు కేటాయించిన పది అసెంబ్లీ స్థానాలకు బీజేపీ నాయకత్వం సోమవారం అభ్యర్థులను ప్రకటించనుంది. కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరికి విజయవాడ పశ్చిమ, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్-ధర్మవరం, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి-జమ్మలమడుగు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్-కైకలూరు, విష్ణుకుమార్‌రాజు-విశాఖ ఉత్తరం, నడికుదిటి ఈశ్వరరావు-ఎచ్చెర్ల, ఉమామహేశ్వరరావు-పాడేరు, పార్థసారథి-ఆదోని, పనతల సురేశ్‌కు బద్వేలు (ఎస్సీ) స్థానం కేటాయించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అనపర్తి స్థానం కూడా బీజేపీ ఖాతాలోనే పడినట్లు తెలిసాయి.

రాజకీయాలు క్రూరం: రఘురామ



రాజకీయాలు క్రూరంగా ఉంటాయని తెలిసినప్పటికీ ఇప్పుడు ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చిందని రఘురామరాజు వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నరసాపురం టికెట్ రానందుకు తన అభిమానులు మనస్తాపం చెందవద్దని.. తాను ఎన్నికల బరిలో ఉన్నా, లేకపోయినా ఎన్డీయే విజయం సాధిస్తుందని, చంద్రబాబు అధికారంలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తాను రాజకీయాల్లోనే ఉంటానని, జగన్‌కు తగిన గుణపాఠం చెబుతానని స్పష్టం చేశారు.



పవన్ కల్యాణ్‌తో వర్మ, సుజయ్‌కృష్ణ రంగారావు

పవన్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాం

▸▸ టీడీపీ నేతలు వర్మ, సుజయ్‌కృష్ణ భరోసా

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను భారీ అధిక్యంతో గెలిపించుకొంటామని ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం నియోజకవర్గం నుంచి పవన్ పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన్ను వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్మకు పవన్ పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. వర్మతో పాటు కాకినాడ, అమలాపురం, రాజమండ్రి పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి సుజయ్‌కృష్ణ రంగారావు జనసేనానితో సమావేశమయ్యారు. పిఠాపురంలో రాజకీయ పరిస్థితులను వారు పవన్‌కు వివరించారు. అక్కడ కచ్చితంగా పవన్‌ను భారీ అధిక్యంతో గెలిపించుకొంటామని భరోసా ఇచ్చారు. త్వరలో తన ప్రచారం పిఠాపురం నుంచే ప్రారంభిస్తున్నట్లు పవన్ తెలియజేశారు. తొలుత అమ్మవారిని, దత్తపీఠాన్ని దర్శించుకుంటానని తెలిపారు. అనంతరం వర్మ ఇంటికి వెళ్లిన తర్వాత పిఠాపురం టీడీపీ నాయకులతోనూ సమావేశమవుతానని వివరించారు. మూడు పార్టీలు సమన్వయంతో కలిసి ఎన్నికల్లో పని చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పవన్ వెల్లడించారు.

తిరుపతిలో ఆరణి శ్రీనివాసులే

▸▸ 11 స్థానాలకు జనసేన అభ్యర్థుల ప్రకటన

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 21 స్థానాలకు గాను మరో 11 సీట్లకు జనసేన తన అభ్యర్థులను ప్రకటించింది. స్థానిక నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా.. తిరుపతిలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వాన్నే చివరకు ఖరారుచేసింది. పిఠాపురం నుంచి అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీచేస్తారని ఆదివారం అధికారికంగా వెల్లడించింది. దీంతో ఇప్పటికి 18 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయింది. తొలుత నెల్లిమర్ల, రాజానగరం, కాకినాడ రూరల్, అనకాపల్లి, తెనాలి స్థానాలకు అభ్యర్థులను వెల్లడించగా.. అనంతరం నిడదవోలులో కందుల దుర్గేశ్, ఆ తర్వాత పిఠాపురంలో పవన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పోటీచేస్తారని జనసేనాని స్వయంగా వెల్లడించిన విషయం తెలిసిందే. పాలకొండ, అవనిగడ్డ, విశాఖపట్నం దక్షిణ స్థానాల అభ్యర్థులను, మచిలీపట్నం లోక్‌సభ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయాల్సి ఉంది.

18 మంది అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	పేరు	కులం
పిఠాపురం	పవన్ కల్యాణ్	కాపు
నెల్లిమర్ల	లోకం మాధవి	బ్రాహ్మణ
అనకాపల్లి	కొణతాల రామకృష్ణ	గవర
కాకినాడ రూరల్	పంతం నానాజీ	కాపు
రాజానగరం	బత్తుల బలరామకృష్ణ	కాపు
తెనాలి	నాదెండ్ల మనోహర్	కమ్మ
నిడదవోలు	కందుల దుర్గేశ్	కాపు
పెందుర్తి	పంచకర్ల రమేశ్‌బాబు	కాపు
యలమంచిలి	సుందరపు విజయ్‌కుమార్	కాపు
పి.గన్నవరం	గిడ్డి సత్యనారాయణ	ఎస్సీ
రాజోలు	దేవ వరప్రసాద్	ఎస్సీ
తాడేపల్లిగూడెం	బొలిశెట్టి శ్రీనివాస్	కాపు
భీమవరం	పులపర్తి రామాంజనేయులు	కాపు
నరసాపురం	బొమ్మిడి నాయకర్	మత్స్యకార
ఉంగుటూరు	పత్సమట్ల ధర్మరాజు	క్షత్రియ
పోలవరం	చిర్రి బాలరాజు	ఎస్టీ
తిరుపతి	ఆరణి శ్రీనివాసులు	బలిజ
రైల్వేకోడూరు	యనమల భాస్కరరావు	ఎస్సీ

అదే బరితెగింపు!

▸▸ తీరు మార్చుకోని వలంటీర్లు

▸▸ ఎన్నికల సంఘం వేటు వేస్తున్నా లెక్కచేయకుండా వైసీపీ ప్రచారం

▸▸ ప్రచారంలో కాంట్రాక్టు ఉద్యోగులు కూడా

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)



బాపట్ల జిల్లా రేపల్లెలో వైసీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ షేక్ ఫయ్యాజ్ అహ్మద్

నేతల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినా ఈ మార్గదర్శకాలను వైసీపీకి సర్వంగా మారిన వలంటీర్లు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. అధికార వైసీపీకి మద్దతుగా పార్టీ అభ్యర్థులు, నేతలతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్షాలు ఆయా వలంటీర్ల ఫొటోలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నా, ఈసీ స్పందించి వేటు వేస్తున్నా.. వలంటీర్లు బేఖాతరు చేస్తున్నారు. అధికార పార్టీ వైసీపీ అభ్యర్థుల పక్షాన జోరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఒక్క వలంటీర్లే కాదు కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ఈ ప్రచారంలో పాల్గొనడం ఆదివారం పలు చోట్ల కనిపించింది.

- ప్రకాశం జిల్లా మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందూరు నాగార్జున రెడ్డి ఆదివారం గిద్దలూరులో ప్రచారం చేశారు. ఆ కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బిజ్జం రంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అంతేకాకుండా ఆ ప్రాంతానికి వచ్చిన నాయకులను, కార్యకర్తలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి ఆయనే పరిచయం చేశారు. ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి జగన్‌ని మరోసారి సీఎంని చేయాలని ప్రచారం చేశారు.



గిద్దలూరులో వైసీపీ అభ్యర్థి నాగార్జునరెడ్డి ప్రచారంలో పాల్గొన్న కాంట్రాక్టు ఉద్యోగి రాంభూపాల్‌రెడ్డి

- బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి మండలం కనగాల గ్రామంలో వైసీపీ అభ్యర్థి ఈవూరి గణేశ్ ఇంటింటికీ పేరుతో ప్రచారం నిర్వహించారు. ఆయనకు మద్దతుగా కనగాల 12వ వార్డుకు చెందిన వలంటీర్ షేక్ ఫయ్యాజ్ అహ్మద్ పాల్గొన్నారు. కరపత్రాలను అందిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి గణేశ్‌కు ఓటు వేయాలని కోరారు. అంతేకాదు, ఓటు వేయకపోతే వచ్చే పథకాలన్నీ ఆగిపోతాయని చెప్పడం గమనార్హం. ఈ విషయాన్ని తెలుసుకున్న టీడీపీ శ్రేణులు సీ-విజిల్‌లో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.
- ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేరుగ నాగార్జున పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వలంటీర్లు టి.శ్రీను, సీహెచ్ ఏడుకొండలు, ఎ. సాయి, ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. దీనిపై ఎంపీడీవో రాఘవేంద్రను వివరణ కోరగా.. వలంటీర్లు ఇలాంటి కార్యక్రమాలకు హాజరు కాకూడదని తెలిపారు. ఇలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ కవ్వింపు చర్యలు

- పరిటాల సునీత ప్రచారానికి అడ్డుతగిలే యత్నం



వైసీపీ వర్గీయులను వదిలేసి.. టీడీపీ వర్గీయులనే వీడియో తీస్తున్న కానిస్టేబుల్

ధర్మవరం, మార్చి 24: శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం మద్దెలరువు గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ నాయకులను చూసి వైసీపీ వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మాజీ మంత్రి, టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దెలచెరువు గ్రామంలో పర్యటిస్తుండగా, మద్యం తాగి ఉన్న పలువురు వైసీపీ కార్యకర్తలు జెండాలు పట్టుకుని, అడ్డుగా వచ్చారు. గ్రామంలో ప్రచారం చేయరాదంటూ తొడగొడుతూ కవ్వింపు చర్యలకు దిగారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అయితే, సునీత అప్రమత్తమై.. కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని, ఓటమి భయంతోనే వైసీపీ వర్గీయులు రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈసారి రాప్తాడులో టీడీపీ గెలుస్తుందన్న భయంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, ఆయన సోదరులు వైసీపీ కార్యకర్తలకు మద్యం తాపించి, ఇలా రెచ్చగొట్టి పంపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రచారానికి తాము అధికారుల అనుమతి తీసుకుని గ్రామానికి వచ్చామనీ, ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారన్నారు. పోలీసుల్లో కూడా కొందరు ఏకపక్షంగా వ్యవహరిస్తూ రెచ్చగొట్టే వారిని కాకుండా టీడీపీ వర్గీయులనే వీడియోలు తీస్తూ భయభ్రాంతులకు లోను చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పరిటాల సునీత తెలిపారు.

సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశాడని..

- టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతల దాడి



బాధితుడ్ని పరామర్శిస్తున్న తంగిరాల సౌమ్య

వీరులపాడు (కృష్ణా జిల్లా), మార్చి 24 : వీరులపాడు మండలం జుజ్జూరులో వైసీపీ రంగులు వేసిన గేట్లను ఫొటోలు తీసి సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశాడని గ్రామానికి చెందిన మెకానిక్, టీడీపీ కార్యకర్త షేక్ నాగుల్ బాష అనే వ్యక్తిపై ఆదివారం వైసీపీ నాయకులు పులారాంబాబు, పూర్ణ, గోవిందరావు దాడి చేశారు. బాధితుడు వీరులపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి చేయడమే కాకుండా, 'నిన్ను ఎవడ్రా కాపాడేది.. నీ అంతు చూస్తాం..' అని బెదిరిస్తున్నారని బాధితుడు వాపోయాడు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలికారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం బాధితుడు నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నాగుల్ బాషాను మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు. 20 మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారని సౌమ్య తెలిపారు. తలను గోడకు కొట్టి దారుణంగా ప్రవర్తించారన్నారు. సీసీ ఫుటేజ్ ద్వారా నిజాన్ని బయట పెడతామన్నారు. దాడి అనంతరం కూడా పోలీసులు వైసీపీకి వత్తాసు పలకడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



మృతుల చిత్రపటాల వద్ద కళ్లకు గంతలు, చేతిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాలు, టీడీపీ నేతలు

బీసీలను బలి తీసుకుంటున్న జగన్‌కు బుద్ధి చెప్తాం

- ఇది ముమ్మాటికీ వైసీపీ చేసిన హత్యే
- బీసీ సంఘాలు, టీడీపీ నేతల ధ్వజం
- మరణించిన చేనేత కుటుంబానికి నివాళి

కనిగిరి, మార్చి 24: బీసీల ప్రాణాలను బలిగొంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని బీసీ సంఘాల నాయకులు హెచ్చరించారు. కడప జిల్లాలో వైసీపీ నాయకుల భూకబ్జాతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబానికి ఆదివారం రాత్రి కొవ్వొత్తులు, కళ్లకు గంతలతో నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకుడు మాలకొండలరావు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల భూములు కబ్జాకు గురయ్యాయన్నారు. తాజాగా కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామానికి చెందిన మరో చేనేత కుటుంబం బలవన్మరణానికి పాల్పడడం బాధాకరమన్నారు. ఇది ముమ్మాటికీ వైసీపీ హత్యే అని తేల్చిచెప్పారు.

కారకులను కఠినంగా శిక్షించాలి: అఖిల భారత పద్మశాలి సంఘం

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కార్మిక కుటుంబం చావుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అఖిలభారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ డిమాండ్ చేశారు. 'అమాయక చేనేత కుటుంబాన్ని పొట్టనపెట్టుకున్న ఇలాంటి వ్యక్తులు పార్టీలో ఉంటే మీ పార్టీకి చెడ్డ పేరువస్తుందని గుర్తించండి' అని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు విజ్ఞప్తి చేశారు. తక్షణం అలాంటి వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని సూచించారు. రెక్కాడితేగానీ డొక్కాడని చేనేత కార్మికుని భూమి ఏ విధంగా లాక్కోవాలనిపించిందని ప్రశ్నించారు. వారి మరణానికి కారకులైన ప్రభుత్వ అధికారులు ఎంతటి వారైనా గుర్తించి న్యాయపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైసీపీ నేతల భూదందాలకు పేదలు బలి: పవన్

అమరావతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలో భూ రికార్డులు మార్చిన ఘటనలో చేనేత కార్మికుడు సుబ్బారావు కుటుంబం మరణించడం పలు సందేహాలు కలిగిస్తోందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సుబ్బారావు మరణం బాధేసిందని, వైసీపీ నాయకులు చేస్తున్న భూదందాలకు పేదలు బలైపోతున్నారని ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత మగ్గం నడవక ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఆ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన కొద్దిపాటి భూమి మీద హక్కులు లేకుండా చేశారన్నారు. ఆ కుటుంబానికి చెందిన ఆస్తి వైసీపీ నాయకుల పేరిట ఎలా మారిపోయిందని వ్యాఖ్యానించారు. సామూహిక మరణాలకు కారకులెవరో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యపై సీఎం స్పందించడే?: నందం

అమరావతి, మార్చి24(ఆంధ్రజ్యోతి): భూ హక్కు చట్టం ద్వారా కూడా హత్యలు చేయడం జగన్‌రెడ్డికే చెల్లిందని బాపట్ల టీడీపీ ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ విమర్శించారు. వైసీపీ నేత భూమి కబ్జా కావడంతో చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుందని, టీడీపీ అధికారంలోకి రాగానే దోషుల్ని శిక్షిస్తామని అన్నారు. కాగా, ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో చేనేత వర్గానికి చెందిన పాల సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుని 24గంటలు గడిచినా సీఎం స్పందించకపోవడం దేనికి సంకేతమని మంగళగిరి టీడీపీ సమన్వయకర్త నందం అబద్ధయ్య ధ్వజమెత్తారు. వైసీపీ నేతల ఆగడాలపై పోరాడలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సుబ్బారావు రాసిన సూసైడ్ నోట్‌పై సీఎం ఏం సమాధానం చెప్తాడని ప్రశ్నించారు.

చిత్తయినా.. అదే ఎత్తు..!

నాడు వివేకా హత్య.. ఇప్పుడు విశాఖ డ్రగ్స్

- ఎన్నికలముందు ప్రత్యర్థులపైకి నెట్టే యత్నం
- సీబీఐ విచారిస్తుండగానే 'డ్రగ్స్'లో లింకులు
- పురందేశ్వరి, బాబు, లోకేశ్, భరత్‌లపై విషం
- ఎన్నికలముందు మరోసారి జగన్ మైండ్‌గేమ్
- వివేకాను బాబు చంపించారని నాడు కథనాలు
- చివరకు జగన్ కుటుంబం మెడకు ఆ కేసు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వివేకా హత్య, కోడి కత్తి.. ఇలా గత ఎన్నికల ముందు జరిగిన ప్రతి ఘటననూ ప్రత్యర్థులపైకి జగన్, ఆయన రోత మీడియా నెట్టాయి. ఆనక.. వివేకా కేసు జగన్ కుటుంబం మెడకే చుట్టుకోగా, కోడి కత్తి ఘటనలో 'కుట్ర'ను వెతకాలని ప్రయత్నించి భంగపడ్డారు. సరిగ్గా ఎన్నికల ముందు ఇప్పుడు విశాఖ డ్రగ్స్ వ్యవహారంలోనూ ఆ పాచిపోయిన పాత వ్యూహాన్నే తెర పైకి తెచ్చారు. ఒకవైపు దర్యాప్తు సాగుతుండగానే చంద్రబాబును, ఆయన బంధువులకు లింకు పెడుతూ రోత ప్రచారం మొదలుపెట్టారు. అయితే, ఈ ఎత్తూ మళ్లీ చిత్తు కావడం ఖాయమని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సార్వత్రిక ఎన్నికలకు ముందు హత్యలు, దోపిడీలు, ఇతర చట్టవ్యతిరేక అంశాలు బయటకొస్తే, వాటిని ప్రత్యర్థిపై నెట్టేసి, తన రోత మీడియా ద్వారా ప్రజల్లో దుష్ప్రచారం చేయడానికి వేసిన ఎత్తులు...ఆ తర్వాత ఘోరంగా చిత్తయ్యాయి. గత ఎన్నికల ముందు చంద్రబాబుపైకి మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యను నెట్టేయాలని చూడగా, ఐదేళ్లు తిరిగేటప్పటికి ఆ కేసు జగన్ కుటుంబం మెడకే చుట్టుకోవడం చూశాం. అయినా... పాలక పార్టీకి బుద్ధి రావడం లేదు. తాజాగా విశాఖ డ్రగ్స్ వ్యవహారంలోనూ అదే పాచిపోయిన పాత ఎత్తును తెరపైకి తెచ్చారు. సీబీఐ దర్యాప్తు ప్రాథమిక స్థాయిలో ఉండగానే, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు పురందేశ్వరి, చంద్రబాబు, లోకేశ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి భరత్‌కు లింకులు అంటగడుతూ జగన్ రోత పత్రిక దుష్ప్రచారం మొదలెట్టేసింది. సత్యం లోకానికి తెలిసేలోగానే అబద్ధాలతో తన పని కానించేసుకోవడం జగన్ మనస్తత్వం అని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి, ఇప్పుడు రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉంది. అయితే, ఆ విషయమూ మరిచిపోయారా అన్నట్టు వైసీపీ నేతల తీరు ఉంది. విశాఖ పోర్టుకు వచ్చిన డ్రగ్స్‌తో ఎవరెవరికి ప్రమేయం ఉందో సమగ్ర సమాచారం రాష్ట్ర దర్యాప్తు సంస్థలు-సీఎం జగన్‌కు అందిస్తాయి. నిఘావర్గాల నివేదికలూ అందుబాటులోనే ఉంటాయి. కానీ .. ఆధారాల్లేకుండా .. ప్రతిపక్షాలపై బురద జల్లేస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకునే వీలున్నా, అధికారిక ట్విట్టర్ వేదికగా ప్రత్యర్థిపార్టీల నేతలపై విషప్రచారానికి దిగారు. విశాఖ పోర్టుకు దిగుమతి అయిన డ్రగ్స్‌తో చంద్రబాబు, లోకేశ్‌ల ప్రమేయంపై విచారణ జరపాలంటూ ఎన్నికల కమిషన్‌కు మాజీ మంత్రి పేర్ని నాని ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ కేసును కేంద్ర దర్యాప్తుసంస్థ సీబీఐ విచారణ చేస్తోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తమ విధులకు ఆటంకం కలిగించడంవల్లే దర్యాప్తులో జాప్యం జరిగిందని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. విశాఖ పోర్టు డ్రగ్స్ దిగుమతిపై సీబీఐ ప్రాథమిక దర్యాప్తు వివరాలు బయటకు రాకుండానే .. ప్రత్యర్థులపై బురద జల్లేయడం ద్వారా 2019 తరహా రాజకీయలబ్ధిని పొందాలని చూస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బూమరాంగ్ అవుతుందా?

విశాఖ డ్రగ్స్ దిగుమతిపై తొలుత పురందేశ్వరిపైనా, ఆమె కుటుంబ సభ్యులపైనా జగన్ రోత పత్రిక, అధికారిక ట్విట్టర్ వేదికగా విషం జిమ్మారు. ఆ తర్వాత, పురందేశ్వరితో బంధుత్వం రీత్యా చంద్రబాబుకు, బాలకృష్ణ, ఆయన అల్లుళ్లు భరత్, లోకేశ్‌లకూ లంకె పెడుతూ దుష్ప్రచారం మొదలుపెట్టారు. తాజాగా వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకూ ఈ మకిలి అంటిస్తూ పోస్టులు పెట్టారు. ఈ పోస్టులపై శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ శనివారం ఎన్నికల ప్రధానాధికారికి ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్నికల సంఘం తగు చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. రాజకీయంగా ఎప్పటికప్పుడు వ్యూహాలను మారుస్తూ ఉండాలని విశ్లేషకులు చెబుతుంటారు. అన్నింటికీ ఒకే మంత్రం వేస్తే బెడిసికొట్టడం ఖాయం. 2019 నాటి పరిస్థితులకూ .. ప్రస్తుత స్థితిగతులకూ పూర్తి వ్యత్యాసం ఉందని గుర్తు చేస్తున్నారు. 2019లో వైఎస్ వివేకానందరెడ్డి హత్య సమయానికి ఎన్నికలు సమీపించాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో నిర్ణయాలను తీసుకునే వీలు లేని పరిస్థితి ఆయనది. అందువల్ల .. వివేకా హత్య కేసులో ప్రాథమిక దర్యాప్తు వివరాలను చంద్రబాబు ప్రజల్లోకి తీసుకువెళ్లలేకపోయారు. ఈ సందిగ్ధకాలాన్ని జగన్ వ్యూహాత్మకంగా ఉపయోగించుకున్నారు. వివేకా హత్యలో చంద్రబాబు పాత్ర ఉందనే సందేహాలను కలిగించారని రాజకీయ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పుడు విశాఖ డ్రగ్స్ కేసు విషయంలోనూ 2019 తరహా వ్యూహాన్నే అమలు చేస్తూ ప్రత్యర్థులపై జగన్ మైండ్ గేమ్‌కు ప్రయత్నిస్తున్నారు. అయితే, ప్రతిపక్షంలో ఉన్న జగన్ ఎలాంటి ఆటలు ఆడినా చెల్లుబాటయింది. ఇప్పుడు అధికారంలో ఉన్నందున జగన్ వేస్తున్న ఎత్తుగడలు బూమరాంగ్ అవుతాయని రాజకీయవర్గాలు హెచ్చరిస్తున్నాయి.



విజయవాడలో మాట్లాడుతున్న ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి

కళ్లకు గంతలతో ఈసీ!

- ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు వందల కోట్లు
- సోషల్ మీడియాలో పెరిగిన విశృంఖలత్వం
- ఐటీ, ఈడీ దాడులతో బీజేపీకి వేలకోట్ల విరాళాలు
- ఐజేయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వెల్లడి

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 24: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వందల కోట్లు ఖర్చు చేస్తున్నా ఎన్నికల కమిషన్ కళ్లకు గంతలు కట్టుకున్నట్టు వ్యవహరిస్తోందని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. 'సార్వత్రిక ఎన్నికలు-మీడియా పాత్ర' అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవస్థలను నిలబెట్టేది మీడియానేనన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం పెరిగిందని, ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు రూ.10,702 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. ఐటీ, ఈడీ, సీబీఐ దాడులతో కేంద్రంలోని బీజేపీకి వేలకోట్ల విరాళాలు వస్తున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో విశృంఖలత్వం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులు, నేరారోపణలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటును అమ్ముకోకుండా ప్రజల్లో మీడియా చైతన్యం కలిగించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనాలు అందుకుంటున్న వలంటీర్లు ఒక పార్టీకి ఓట్లు వేయాలని అడగడం సమంజసం కాదన్నారు. ప్రముఖ ప్రొఫెసర్ ఎంసీ దాస్ మాట్లాడుతూ ఓటుహక్కు, ఓటు వేసే బాధ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని మీడియా సంస్థలను కోరారు. మీడియా కమిషన్, వేజ్‌బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ఐజేయూ కార్యదర్శి సోమసుందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఐజేయూ కార్యవర్గ సభ్యుడు ఆలపాటి సురేష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, సీనియర్ జర్నలిస్టులు ఎస్కే బాబు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇదేదో తేడాగా ఉందే!

(మొదటి పేజీ తరువాయి)

వివాదస్పద నిర్ణయాలతో ఈసీకి చిరాకు తెప్పిస్తున్నట్లు తెలిసింది. అనేక జిల్లాల్లో అధికార యంత్రాంగం అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని, కొన్ని చోట్ల ప్రభుత్వ ఉద్యోగులను, అధికారులను కూడా వైసీపీ కార్యకర్తలుగా పనిచేయించుకుంటున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అటు ప్రతిపక్షాల ద్వారా, ఇటు మీడియా ద్వారానే కాకుండా తన సొంత మార్గాల ద్వారా కూడా కమిషన్ ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటోంది. వాటిపై వివరణ అడిగినప్పుడు కొందరు కలెక్టర్లు.. వాస్తవాలను ఈసీ ముందుంచుతున్నారు. కానీ ఆ అరడజను మంది మాత్రం 'అంతా బాగుంది. ఇక్కడ ఏమీ జరగడం లేదు. సందేహించాల్సింది ఏమీ లేదు' అని నివేదికలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. తమకు అందిన సమాచారం, కలెక్టర్లు ఇస్తున్న నివేదికలకు పొంతన కుదరకపోవడంతో ఈసీలో అనుమానం మొలకెత్తింది. దీంతో ఆ కలెక్టర్ల పూర్వాపరాలు.. పనితీరు.. ఏ ప్రాతిపదికన ప్రస్తుత పోస్టులోకి వచ్చారన్న వివరాలపై ఆరా తీస్తున్నట్లు ఉన్నత స్థాయి వర్గాల ద్వారా తెలిసింది. అదే సమయంలో శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన కొందరు ఎస్పీలు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు తలెత్తాయి. వీరు కాకుండా ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులపైనా ఈసీకి అనేక ఫిర్యాదులు వెళ్లాయి. ఇవేవో ఆషామాషీ ఆరోపణలు కాదు. సహేతుకమైన ఆధారాలతో ఫిర్యాదులు అందుతుండడంతో ఈసీ వాటిపై దృష్టి సారించింది. ఇప్పటికే కొంత మందిపై అంతర్గత విచారణ కూడా మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో తొలి దశ నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్నందున.. ఈసీ అధికారులు వారం తర్వాత ఆంధ్రపై ఫోకస్ పెడతారని, ఆ వెంటనే జగన్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్న కొందరు అధికారులపై వరుసబెట్టి వేటువేస్తారని తెలుస్తోంది.



సెజ్‌లో సంధ్య ఆక్వాకు చెందిన బస్‌లో తనిఖీలు

కేఎస్ఈజెడ్‌లో 'సంధ్య' బస్సు కలకలం

- నాలుగు రోజులుగా ఒకేచోట పార్కింగ్

కొత్తపల్లి, మార్చి 24: సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీకి చెందిన బస్సు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్తమూలపేట సెజ్‌లో గత నాలుగు రోజులుగా ఒకేచోట ఉండడం కలకలం రేపింది. ఇటీవల బ్రెజిల్ నుంచి మాదక ద్రవ్యాల కంటైనర్ ఒకటి విశాఖ పోర్టులో పట్టుబడడం.. అది సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ పేరిటే బుక్ కావడం నేపథ్యంలో సీబీఐ పెద్ద ఎత్తున తనిఖీలు చేయడం, రాష్ట్రంలో డ్రగ్స్ దందాలపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొనడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తమూలపేట సెజ్ పునరావాస కాలనీలో ఓ చోట సంధ్య ఆక్వా కంపెనీ బస్సు నాలుగు రోజులుగా ఉండడంతో స్థానికులు ఆదివారం కొత్తపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బస్సు డోర్లు లాక్ చేసి ఉండడంతో కిటికీల గుండా లోపలకు వెళ్లిన పోలీసులు అక్కడున్న అట్టపెట్టెలను పరిశీలించారు. అయా పెట్టెల్లో సంధ్య ఆక్వా కంపెనీకి చెందిన పలు ఫైళ్లు, రికార్డులు ఉన్నాయన్నారు. రిపేర్ కారణంగా గత 4 రోజుల నుంచి దానిని వేరేచోట పార్క్ చేశారని చెప్పారు.

బకాయిలపై బుకాయింపు!

- నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సింది 1,400 కోట్లు
- ఆరోగ్యశ్రీ టస్టు విడుదల చేసిన నిధులు 180కోట్లు
- నిర్వహణ భారంగా మారిందంటున్న యాజమాన్యాలు
- రెండు రోజుల్లో మరో 700 కోట్ల విడుదలకు డిమాండ్

అమరావతి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలపై ఆరోగ్యశ్రీ టస్ట్ బుకాయిస్తోంది. వీటికి దాదాపు రూ.1,400 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉండగా, గురువారం కేవలం రూ.180 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకొంది. మిగిలిన బకాయిల గురించి ట్రస్ట్ అధికారులు నోరెత్తడం లేదు. ఆస్పత్రులకు ఇప్పటికే రూ.1,200 కోట్లకు పైగా బకాయిలున్నాయి. కానీ ట్రస్ట్ మాత్రం మొత్తం బకాయిలు రూ.350కోట్లు మాత్రమేనని చెబుతోంది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో వివిధ స్థాయుల్లో దాదాపు రూ.900 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. పైకి రూ.350కోట్ల బకాయిలు మాత్రమే చూపిస్తున్నారు. అందులో ఇప్పటికే రూ.180కోట్లు విడుదల చేశామని, మరో రూ.170కోట్లు ఇస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. వాస్తవంగా ట్రస్ట్‌లో ఉన్న పెండింగ్ బిల్లుల గురించి మాత్రం వారు మాట్లాడటం లేదు. దీంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ తీరుపై నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా ఉందని, కనీసం సప్లయిర్స్‌కి బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నాయి. ప్రభుత్వానికి, ట్రస్ట్‌కు తాము సహకరిస్తున్నప్పటికీ, ట్రస్ట్ అధికారులు బకాయిల విడుదలలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. రెండు రోజుల్లో మరో రూ.700కోట్లు విడుదల చేయాలని ఆసుపత్రుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.

'ఆమంచి' విద్యుత్తు బకాయిలు 4కోట్లు!

- ఆయన బంధువుల పేరునా పెద్ద మొత్తంలో...
- వైసీపీ నేత కావడంతో పట్టించుకోని అధికారులు

చీరాల, మార్చి 24: బాపట్ల జిల్లా చీరాల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆమంచి కృష్ణమోహన్, ఆయన బంధువులు చెల్లించాల్సిన విద్యుత్తు బకాయిలు రూ.4కోట్ల పైచిలుకు పేరుకుపోయాయి. ఆమంచికి చెందిన క్రిస్టల్ సీ ఫుడ్స్(ప్రై) లిమిటెడ్ కరెంటు బకాయి రూ.3,67,63,562 ఉంది. ఆయన బంధువుల పేరున ఉన్న క్రిస్టల్ ఆక్వా మెరైన్ హేచరీస్(ప్రై) లిమిటెడ్ తాలూకా రూ.2,14,768 బిల్లు బకాయి ఉంది. ఇవికాక రొయ్యల చెరువులకు సంబంధించి ఆమంచి బంధువుల పేరున ఉన్న బకాయిలు కూడా రూ.లక్షల్లో పేరుకుపోయాయి. వీరికి సంబంధించి రూ.4 కోట్ల పైచిలుకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇంత పెద్దమొత్తంలో బకాయిలు ఉన్నప్పటికీ ఆయా సంస్థలకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరుగుతుండటం విశేషం. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకుంటేనే కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించే విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది వీరి విషయంలో మాత్రం ఉదాసీనంగా ఉంటున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నోటీసులు ఇచ్చాం

విద్యుత్తు బకాయిలు చెల్లించాల్సిన వినియోగదారులందరికీ నోటీసులు ఇచ్చాం. రూ.9కోట్లకు పైగా రావాల్సి ఉంది. అందులో సగం క్రిస్టల్ సంస్థలు, వారి సంబంధీకులకు చెందినవి ఉన్నాయి క్రిస్టల్ సంస్థ నిర్వాహకులు దశల వారీగా చెల్లించేందుకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందారు. అందుకు సంబంధించి కిస్తీలు కడుతున్నారు. బకాయిలన్నీ పూర్తిస్థాయిలో వసూలు చేస్తాం.

\- జాన్ థామస్, విద్యుత్తు శాఖ డీఈ, చీరాల

అస్మదీయుడికి..

అదిరేటి ఆఫర్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేశారు. దీంతోపాటు అటు చంద్రబాబు హయాంలోనూ, ఇటు జగన్ హయాంలోనూ కీలకపోస్టుల్లో ఉన్న ఒక సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి ఈ కంపెనీకి వెన్నెముకగా ఉంటున్నారు. అందుకే ఏ కంపెనీకీ దక్కని ప్రయోజనాలు గ్రీన్‌కోకు మాత్రమే దక్కాయి. లీజు ఊసే లేకుండా అడిగిన చోట, అడిగినంత ధరకు వేల ఎకరాల భూమిని రాసిచ్చేసింది జగన్ సర్కార్.

నాడు అలా.. నేడు ఇలా

గ్రీన్‌కో కంపెనీకి మొదట టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భూమి కేటాయించారు. 2750 మెగావాట్ల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టును 2018లో ఆమోదిస్తూ టీడీపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. అందులో ప్రాజెక్టు వ్యయం, ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలు తదితర విషయాలను ప్రస్తావించారు. రూ.15,000 కోట్ల పెట్టుబడి అని జీవోలో ఉంది. అప్పట్లో జీవోను అందరికీ అందుబాటులో ఉంచారు. భూమి తమ చేతికొచ్చినప్పటి నుంచి ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి 48 నెలలు కావాలని గ్రీన్‌కో అడగడంతో ప్రభుత్వం ఓకే చెప్పింది. దీనికి సంబంధించి 2019లో ఉమ్మడి కర్నూలు జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామం వద్ద 2467.28 ఎకరాలు కేటాయిస్తూ జీవో ఇచ్చింది. భూమి గ్రీన్‌కో చేతుల్లోకి వెళ్లి ఆరేళ్లవుతున్నా ఇప్పటి వరకూ ఆ ప్రాజెక్టు పూర్తి కాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 మే నెలలో సీఎం జగన్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాక, కాంక్రీటు పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. అవి ఇప్పటి వరకు పూర్తికాలేదు. ఈ ఐదేళ్లలో జగన్ సర్కార్ గ్రీన్‌కోకు ఇచ్చిన జీవోల్లో ప్రాజెక్టులు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఎప్పుడు పూర్తవుతాయి? ఎంత మందికి ఉపాధి లభిస్తుంది? అన్న వివరాలు లేవు. అడ్డగోలుగా భూములు అమ్మేశారు. జీవోలను రహస్యంగా ఉంచారు.

గ్రీన్‌కోకు అమ్మకం

జగన్ ప్రభుత్వం వచ్చాక చాలా కంపెనీలకు ఇచ్చిన భూములు వెనక్కి తీసుకున్నారు. 25 శాతం కంటే తక్కువ పనులు పూర్తయిన ప్రాజెక్టులను పూర్తిగా రద్దుచేశారు. అలాంటిది గ్రీన్‌కోకు టీడీపీ హయాంలో ఇచ్చిన భూములు తీసుకోకపోగా, అదనంగా మరో 7,047 ఎకరాలు కేటాయించడం ఆశ్చర్యకరం. ఎకరం 5 లక్షల చొప్పున అమ్మేశారు.

- నంద్యాల జిల్లా గుడివేముల మండలం చెన్నక్కపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 791, 794లోని 973.55 ఎకరాలను గ్రీన్‌కో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరం రూ.5 లక్షల చొప్పున అమ్మేసినట్టు మార్చి 15న జీవో ఇచ్చారు.
- నంద్యాల జిల్లాలోని మిడ్తూరు మండలం నాగలూటీ గ్రామంలోని 181, 269, 314, 285/1, 259/1, 295/ఏ1ఏ, 290 1ఏ1, 303 సర్వే నంబర్లలో, మాసపేట గ్రామంలోని 159-1, 159-2బి, 192, 312-1, 358-2 సర్వే నంబర్లలోని 1011.44 ఎకరాలను రూ.50.57 కోట్లకు అమ్మేసినట్టు మార్చి 15న మరో జీవో ఇచ్చారు. ఇక్కడా ఎకరం రూ.5 లక్షలే.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో గ్రీన్‌కోకు 386 ఎకరాలను ఎకరం 5 లక్షల చొప్పున ఇచ్చారు. ఈ నెల 15న జీవో జారీ చేశారు.
- వైసీపీ అధికారంలోకి వచ్చాక గ్రీన్‌కోకు కేటాయించిన భూములను ముందుగానే పొజిషన్‌లోకి తీసుకునేలా 2020 జూన్ 13న తొలి జీవో ఇచ్చారు.
- 2022 సెప్టెంబరు 15వ తేదీన ఈ కంపెనీకి అదనపు భూములు కేటాయిస్తున్నట్టు జీవో ఇచ్చారు. ఈ దఫా ఏకంగా 4766.28 ఎకరాలు కేటాయించారు. ఎకరం రూ.5 లక్షల చొప్పున ఔట్‌రైట్ సేల్(ఎంతోకొంతకి అమ్ముకోవడం) చేశారు.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలోని సర్వే నంబర్ 433/ఏ1ఏ, ఇంకా ఇతర సర్వే నంబర్లలోని 21.08 ఎకరాలను 2023 జూన్ 16వ తేదీన ఇచ్చిన జీవో ద్వారా ఎకరం రూ.5 లక్షల చొప్పున అమ్మేశారు.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లిలోని సర్వే నంబర్లు 355/2, ఇంకా ఇతర సర్వే నంబర్లలో ఉన్న 30.53 ఎకరాలను రూ.5 లక్షల చొప్పున అమ్మేశారు. 2023 జూన్ 16న జీవో జారీచేశారు.
- 2023లో జూన్ 16వ తేదీన నంద్యాల జిల్లా పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలోని సర్వే నంబరు 314 నుంచి 453 వరకు గల 244.97 ఎకరాలను ఎకరా రూ.5 లక్షల చొప్పున అమ్మేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.